www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 163 | బుధవారం | 03-12-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00




సమస్యల వలయంలో గుజరాత్ రాష్ట్రం

శాంతికోసం మతాలు ఐక్యంగా వ్యవహరించాలి

చొరబాటుదారులకు 'రెడ్‌కార్పెట్' పరవాలా? 05

# 'సర్'పై చర్చకు ఓకే

ప్రతిపక్షాల డిమాండ్‌కు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం

8న వందేమాతరంపై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ



**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో చర్చించేందుకు అధికార పక్షం అంగీకరించింది. ఈ విషయాన్ని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో మంగళవారం సమావేశమైన అనంతరం కాంగ్రెస్ నేత కె.సురేశ్ వెల్లడించారు. డిసెంబర్ 8న వందేమాతరంపై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ జరగనున్నట్లు తెలిపారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో సర్‌పై చర్చించాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. చర్చకు ప్రభుత్వం విముఖం కాదని, కాలపరిమితిని నిర్దేశించాలనుకోవడం మాత్రం తగదని అధికారపక్షం పేర్కొంది. ఈ నేపథ్యంలో విపక్షాలు ఆందోళనకు దిగడంతో స్పీకర్ అఖిలపక్ష సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎట్టకేలకు అధికార పక్షం చర్చకు అంగీకరించింది. అయితే, ప్రత్యేకంగా సర్‌పై కాకుండా.. ఎన్నికల సంస్కరణలు అనే విస్తృత అంశాన్ని సభ ముందు ఉంచనున్నట్లు తెలుస్తోంది.

**రెండవ రోజూ పట్టువీడని ప్రతిపక్షాలు**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రెండవ రోజైన మంగళవారం కూడా వాయిదాల పర్వం కొనసాగింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై చర్చించాల్సిందేనని డిమాండ్ చేస్తూ ఉభయసభల్లోనూ ప్రతిపక్ష ఎంపిలు పట్టుబట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్‌పై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని అయితే దానికి కాలపరిమితి ఏమీ ఉండదని

తరువాయి 2లో




## ప్రధానాంశాలపై చర్చించకుండా మోదీ పారిపోతున్నారు...

- ఇండియా కూటమి నేతలు మండిపాటు
- పార్లమెంట్ వెలుపల 'సర్'కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

05



# ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌తో ప్రపంచపటంలో రాష్ట్రం

- తెలంగాణ ఏర్పాటుకు, ఉద్యమ ఆలోచనకు పాల్వంచలోనే బీజం
- ప్రజాప్రభుత్వానికి ఖమ్మం జిల్లానే ఆయువుపట్టు
- దేశాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు నడిపించిన మన్మోహన్‌సింగ్ చిరస్మరణీయులు
- తెలంగాణ కలను సాకారం చేసిన మహనీయుడు
- ఎర్త్ సైన్సెస్ వర్సిటీ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి
- కొత్తగూడెంలో వర్సిటీ ఏర్పాటు అభినందనీయం
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం

ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలు తెలంగాణను ప్రపంచపటంలో నిలబెడతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అరవై ఏళ్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను ప్రధాన మంత్రి హోదాలో నెరవేర్చిన మహోన్నతుడు డా.మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటుకు, ఉద్యమానికి ఆలోచనా బీజం పాల్వంచ కేంద్రంగా పడిందని, రాష్ట్ర ప్రజల కలను సాకారం చేసిన మన్మోహన్ సింగ్ పేరు భూ విజ్ఞాన విశ్వవిద్యాలయానికి పెట్టడం గర్వ కారణం అన్నారు. మంగళవారం దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన భూ విజ్ఞాన విశ్వవిద్యాలయాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రేవంత్ మాట్లాడుతూ ఈ యూనివర్సిటీ దేశానికి తలమానికం కానుందన్నారు. దేశాన్ని సంక్షోభం నుండి సంక్షేమం వైపు

తరువాయి 12లో

## పిఎంఒ భవనం ఇక 'సేవాతీర్థ్'

కేంద్ర ప్రభుత్వం నిర్ణయం



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి కార్యాలయం(పిఎంఒ) భవనం పేరును కేంద్ర ప్రభుత్వం మార్చింది. పిఎంఒ భవనం పేరును 'సేవాతీర్థ్'గా మారుస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో పిఎంఒను ఇక నుంచి సేవాతీర్థ్‌గా పిలవనున్నారు. ప్రధానమంత్రి దశాబ్దాలుగా సౌత్‌బ్లాక్‌లోని పిఎంఒ నుంచి ప్రధానులు విధులు నిర్వర్తిస్తుండగా, ఆ కార్యాలయం కొత్త భవనంలోకి మారనుంది. ఈ నేపథ్యంలోనే పేరు మార్పుపై ప్రకటన వచ్చింది. సెంట్రల్ విస్టా అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. ఇంతకుముందు ఈ భవనాలను

తరువాయి 2లో

## 'లోక్ భవన్'గా 'రాజ్‌భవన్'

పేరు మారుస్తూ ప్రభుత్వ నోటిఫికేషన్ జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్




తెలంగాణ గవర్నర్ అధికారిక నివాసం 'రాజ్ భవన్'ను 'లోక్ భవన్'గా మార్చారు. అన్ని 'రాజ్ భవన్'లను 'లోక్ భవన్'లుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకు 'రాజ్ భవన్, తెలంగాణ'గా ఉన్న పేరును ఇకపై 'లోక్ భవన్, తెలంగాణ' అని పిలువనున్నట్లు తెలంగాణ లోక్ భవన్ తెలియజేసింది. వికసిత్ భారత్ వైపు విశ్వాసంతో ముందుకు వెళుతున్న నేపథ్యంలో దేశ ప్రజాస్వామ్య విలువల బలం,

తరువాయి 2లో




## 'సంచార్‌సాథీ' యాప్‌పై తీవ్ర దుమారం

తప్పనిసరేం కాదు : కేంద్రం

**న్యూఢిల్లీ :** ఇకనుంచి దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్లలో 'సంచార్ సాథీ' యాప్‌ను ప్రీఇన్‌స్టాల్ (డిఫాల్ట్‌గా) చేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై మంగళవారంనాడు పార్లమెంటు దద్దరిల్లింది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగమని, దీనిపై విస్తృత చర్చ జరపాలంటూ విపక్ష కాంగ్రెస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ఈ నేపథ్యంలో 'సంచార్ సాథీ' యాప్‌పై కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వివరణ ఇచ్చారు. వినియోగదారులు అక్కర్లేదనుకుంటే తమ స్మార్ట్ ఫోన్ల నుంచి యాప్‌ను డిలీట్ చేయవచ్చని చెప్పారు. ఇది ఐచ్ఛికమని అన్నారు. ప్రతి ఒక్కరి కోసం ఈ యాప్‌ను ప్రవేశపెట్టడం తన డ్యూటీ

తరువాయి 12లో

తెలంగాణ 'డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియా'కు

## సమగ్ర కార్యాచరణ




- రాష్ట్రంలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్‌కు ప్రణాళికలు
- రూ.850 కోట్లతో మహేశ్వరంలో 'జెఎస్ డబ్ల్యూ యుఎవి ఫెసిలిటీ'
- మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను 'డిఫెన్స్ స్ట్రాటజిక్ హబ్ ఆఫ్ ఇండియా'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ అన్ మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్, డిఫెన్స్ ఇన్నోవేషన్ లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్ గా మార్చేలా 'ఎకోసిస్టం'ను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో డ్రోన్ మాన్యుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. మంగళవారం

తరువాయి 2లో

## గ్లోబల్ సమ్మిట్‌కు సిఎంలకు ఆహ్వానం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం ప్రధానిని ఆహ్వానించనున్న సిఎం, డిప్యూటీ సిఎం భట్టి
- 4న వివిధ రాష్ట్రాల సిఎంలను ఆహ్వానించనున్న మంత్రులు

ప్రజాపక్షం/హైదరాబాద్

TELANGANA RISING GLOBAL SUMMIT

హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8, 9 తేదీలలో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ –2025'కు ప్రధానమంత్రి మోదీ సహా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మంగళవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్ళారు. సిఎం, డిప్యూటీ సిఎం బుధవారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీని కలిసి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' కు రావాలని ఆహ్వానించనున్నారు. అనంతరం పలువురు కేంద్ర మంత్రులనూ సదస్సుకు ఆహ్వానించనున్నారు. కాగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను

తరువాయి 2లో




## గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి

- అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇంటింటికీ తీసుకువెళ్లాలి
- ప్రతీ ఆడబిడ్డకూ చీర చేరేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులదే
- డిసిసి అధ్యక్షులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకు వెళ్లాలని తద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికలో విజయ ఢంకా మోగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసిసి అధ్యక్షులకు దిశా నిర్దేశనం చేశారు. మంగళవారం గాంధీభవన్‌లో గాంధీ టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన నూతన డిసిసి అధ్యక్షులు, పూర్వ డిసిసి అధ్యక్షుల సమావేశంతో పాటు టిపిసిసి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఎఐసిసి కార్యదర్శులు విశ్వనాథన్ , సచిన్ సావంత్ పాల్గొంటారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కోటి మంది ఆడబిడ్డలకు ప్రభుత్వం సారెగా అందిస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని,

తరువాయి 2లో

తెలంగాణ ప్రజలకు

## పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

లేదంటే సినిమాలు నడువవు..

హెచ్చరించిన మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో అతని సినిమాలు నడపబోనీయమని సినిమాటో గ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. తెలంగాణ ప్రజల దిష్టి వల్లనే కోనసీమలో కొబ్బరిచెట్లు ఎండిపోయాయని ఓ సభలో పవన్ కళ్యాణ్ వ్యంగంగా అభివర్ణించారు. పవన్ వ్యాఖ్యలను కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ..ఉమ్మడి ఎపిలో తెలంగాణ ప్రజలు 60 ఏళ్లు బాధపడ్డామన్నారు. తాము ఫ్లోరైడ్ నీళ్లు తాగామని, నిధులు, నీళ్ల ఉద్యోగాలు మాత్రం మీరే

తరువాయి 12లో

# రెండు దశల్లో జనగణన

- ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య మొదటి దశ
- 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన
- లోక్‌సభలో ప్రభుత్వ వెల్లడి




**న్యూఢిల్లీ :** దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్ సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపి రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హోమ్ వ్యవహారాల సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇస్తూ, జన గణన గురించి తెలిపారు. జన గణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెన్స్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. 'జన గణన 2027

తరువాయి 12లో


## ఒకవైపు చర్చలు... మరోవైపు యుద్ధం

పోక్రోవ్స్క్ రష్యా స్వాధీనం : ఖండించిన ఉక్రేన్



**మాస్కో:** ఒకవైపు శాంతి చర్చలు ముమ్మర దశకు చేరుకున్న తరుణంలో ఉక్రేన్ తూర్పుప్రాంత నగరం పోక్రోవ్స్క్‌లో తీవ్ర యుద్ధం జరుగుతోంది. ఈ నగరాన్ని తాము స్వాధీనం చేసుకున్నామని రష్యా దళాలు ప్రకటించాయి. కానీ ఉక్రేన్ దానిని ఖండించింది. ఐతే పోక్రోవ్స్క్ నగరంపై రష్యా దళాల ఆధిపత్యం కొనసాగుతోందని అంతర్జాతీయ మీడియా వార్తలు ప్రచురించాయి. మరో నగరాన్ని కూడా రష్యా స్వాధీనం చేసుకునే దిశగా వెళుతోంది. ఇదేసమయంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్,ట్రంప్ అల్లుడు కుష్నెర్ మాస్కో చేరుకుని అధ్యక్షుడు పుతిన్‌తో చర్చల్లో నిమగ్నమయ్యారు. ఒకవైపు దౌత్య చర్చలు జరుగుతున్నాగానీ యుద్ధం ఆపడంలేదని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఫ్రాన్స్‌లో పర్యటించి అధ్యక్షుడు మేక్రాన్‌తో

తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## హాంగ్‌కాంగ్ ప్రమాదంపై స్వతంత్ర విచారణ

**విక్టోరియా :** హాంగ్‌కాంగ్ థాయ్ పో జిల్లాలో నవంబరు 26వ తేదీన ఈ ఏడాది అతిపెద్ద అగ్నిప్రమాద ఘటనపై అక్కడి ప్రభుత్వం స్వతంత్ర దర్యాప్తు చేసేందుకు కమిటీ ఏర్పాటు చేసింది. అన్ని వర్గాల ప్రజల నుండి ఈ ప్రమాద ఘటనపై తీవ్ర వ్యతిరేకత, నిరసనలు వ్యక్తం అవుతూ ఉండటంతో ఆ ఒత్తిడిని భరించలేక ప్రభుత్వం దిగి వచ్చింది. స్వతంత్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రమాదంపై హాంగ్‌కాంగ్‌లోని యువతరం అనేక అనుమానాలు వ్యక్తం చేస్తోంది. దాదాపు ఎనిమిది ఆకాశహర్మ్యాలు దగ్ధమై పోయినప్పటికీ అక్కడున్న పోలీస్ స్టేషన్ మాత్రం చెక్కుచెదరకుండా ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోందని యువకులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గడచిన అనేక దశాబ్దాల చరిత్రలో హాంకాంగ్‌లో ఇంతటి ఘోరమైన విలయం సంభవించలేదు. ఈ ఘటన ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలకూ ఆందోళన కలిగించింది. ఈ ప్రమాద ఘటనకు సంబంధించి 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## భయపడి శాంతికోసం బానిసత్వం చేసేదిలేదు

### ట్రంప్ సైనిక సన్నాహాలపై మదురో హెచ్చరిక



**కారకాస్ :** వెనిజులాపై తదుపరి చర్యలకు భద్రతాధికారులతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒకవైపు సమావేశమైన తరుణంలో, తమ దేశంపై సైనిక చర్య జరిగే అవకాశాలు ఉన్నాయని దేశాధ్యక్షుడు నికొలస్ మదురో అంచనావేస్తున్నారు. ఈ ఉద్రిక్త పరిస్థితులమధ్య నికొలస్ మదురో ఎంతో నిగ్రహంతో గుండెధైర్యంతో వ్యవహరిస్తూ రాజధాని కారకాస్ నగరంలో మిరాఫ్లోర్స్ ప్యాలస్ వెలుపల వేలాదిమందితో కూడిన భారీ శాంతి ర్యాలీ ముందు నిలబడి ప్రసంగించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నైతికస్థైర్యాన్ని కోల్పోయేది లేదని, సామ్రాజ్యవాద దురాక్రమణ చర్యలను ప్రతిఘటిస్తామని మదురో ప్రకటించారు. యుద్ధం, సైనిక చర్యలకు భయపడి శాంతి కోసం ఎట్టిపరిస్థితుల్లోనూ బానిసత్వం చేసేదిలేదని, "బానిసత్వశాంతి" తమకు అవసరం లేదని డోనాల్డ్ ట్రంప్‌కు మదురో హెచ్చరిక చేశారు. శాంతికోసం ఆయన పదే పదే పిలుపు ఇచ్చారు. ప్రజా పాలకుడుగా విధేయంగా ఉంటానని, దేశాన్ని సమష్టిగా రక్షించుకుందామని మదురో ప్రజలకు పిలుపు ఇచ్చారు. వెనిజులా శాంతిని కోరుకుంటున్నదనీ, కానీ బానిసత్వంతో కూడిన శాంతిని కోరుకోవడంలేదని, సార్వభౌమాధికారం, పరస్పర గౌరవం, సమానత్వం, స్వేచ్ఛతో కూడిన శాంతిని మాత్రమే తమ దేశం కోరుకుంటున్నదని స్పష్టం చేశారు. "మనకు బానిసత్వ శాంతి అవసరం లేదు, వలసదేశ శాంతి అవసరం లేదు, బానిసులు ఎప్పుడు? వలసదేశాలు ఎప్పటిమాట? వలసదేశాలు వద్దు, బానిసత్వశాంతి వద్దు" అని మదురో నినాదాలు చేశారు. గడచిన 22 వారాలుగా కరీబియన్ జలాల్లో ట్రంప్ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు సృష్టించారు. డ్రగ్స్ మాఫియా ముఠాలను పెంచిపోషిస్తున్నారంటూ లాటిన్ అమెరికా దేశాలకు బెదిరింపులు ప్రారంభించారు. కరీబియన్ జలాల్లో అత్యంత శక్తిమంతమైన విమాన వాహక యుద్ధ నౌకలను, 15,000 మంది సైన్యాలను ట్రంప్ మోహరించి రేపో మాపో వెనిజులాపై యుద్ధం ప్రకటిస్తామన్న వాతావరణం తెచ్చారు. ఈ పరిస్థితుల్లో వైట్‌హౌస్‌లో భద్రతాధికారులతో ట్రంప్ ఈ విషయంపై చర్చలు జరుపుతున్నారు. మదురోను గద్దె దించుతామని, ఆయనను వెనిజులా నుండి వెళ్ళగొడతామని ట్రంప్ బాహాటంగా ప్రకటనలు చేశారు. మాదకద్రవ్యాల పడవల పేరుతో కరీబియన్ జలాల్లో ఇప్పటివరకూ 22 పడవలపై అమెరికా రక్షణ దళం దాడులు చేసింది. 80 మందిని హతమార్చింది.

ఈ విషయం చివరకు వివాదాస్పదంగా మారింది. అమెరికా చట్టసభ సభ్యులు ఈ దాడులలో రెండు దాడులను యుద్ధ నేరంగా పరిగణించి ట్రంప్ సమాధానం చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఈ సైనిక చర్యను మాదకద్రవ్యాల వ్యాపారులు, ముఠాల అణచివేత, వ్యతిరేక ప్రచారంగా ట్రంప్ చెబుతుండగా, కమ్యూనిస్టు నేత నికొలస్ మదురోను పదవీచ్యుతుణ్ణి చేసేందుకే ట్రంప్ ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోందని వెనిజులా ప్రభుత్వం విమర్శిస్తున్నది.

## సజీవంగానే ఇమ్రాన్ ఖాన్..కానీ మానసిక చిత్రహింస

### అడియాలా జైలు వద్ద భారీ బందోబస్తు
### తెహ్రీక్ ఇన్సాఫ్ దేశవ్యాప్త ఆందోళన : నిషేధాజ్ఞలు



**రావల్పిండి :** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ (73) జైలులో సజీవంగానే ఉన్నారని, కానీ మానసిక చిత్రహింసకు గురవుతున్నారని ఆయన సోదరి డాక్టర్ ఉజ్మాఖాన్ చెప్పారు. తన సోదరుడు చూడటానికి ఆరోగ్యంగానే కనిపిస్తున్నారని చెప్పారు. గడచిన 45 రోజులుగా ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకునేందుకు నిరాకరించిన రావల్పిండి జైలు అధికారులు ఎట్టకేలకు అనుమతి ఇచ్చారు. పదులసంఖ్యలో ఉన్న పిటిఐ పార్టీ కార్యకర్తలను వెంటబెట్టుకుని డాక్టర్ ఉజ్మాఖాన్ అడియాలా జైలులోకి ప్రవేశించి ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకున్నారని ఆయన పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇమ్రాన్‌ఖాన్ జైలులో 2023 ఆగస్టు నెల నుండి ఒంటరిగా నిర్బంధంలో ఉన్నారు. ఆయనను ఎవరూ కలుసుకోనీయకుండా అధికారులు అప్రకటిత ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలకు కారణం ఏమిటో కూడా చెప్పలేదు. చివరకు కుటుంబసభ్యులను కూడా అనుమతించకపోవడంతో జైలులోనే ఆయన మరణించారని సోషల్ మీడియాలో, పత్రికల్లో వదంతులు ప్రారంభమయ్యాయి. దీంతో పిటిఐ కార్యకర్తలు వీధుల్లోకి వచ్చారు. మంగళవారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు మొదలయ్యాయి. ఇస్లామాబాద్ హైకోర్టు వెలుపల కూడా న్యాయవాదులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన జరిపారు. జైలు అధికారులు నెలరోజులుగా ఆయన్ను కలుసుకునేందుకు అనుమతి నిరాకరించడంవల్ల ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక చివరకు చేసేదిలేక ఇమ్రాన్‌ఖాన్ సోదరీమణికి అనుమతి ఇస్తూ జైలు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అడియాలా జైలు సిబ్బంది జైలుప్రాంగణం ఉన్న ప్రాంతంలో 144 నిషేధాజ్ఞలు అమలు చేశారు. పార్టీ కార్యకర్తలను రానీయకుండా అడ్డుకున్నారు. పంజాబ్ ప్రభుత్వం యావత్ పోలీసు యంత్రాంగాన్ని భద్రత నిమిత్తం రావల్పిండికి తరలించింది. మొత్తం ఎనిమిది కి.మీ మేరకు రహదారిలో ఎవ్వరినీ అనుమతించకుండా రాకపోకలను స్తంభింపజేశారు. కాగా, పాకిస్థాన్ హోంమంత్రి తల్లాల్ చౌధురి ఒక ప్రకటన చేస్తూ ఇస్లామాబాద్, రావల్పిండిలలో 144 నిషేధాజ్ఞలు మూడు రోజులపాటు అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. పిటిఐ నాయకులు, చట్టసభ్యులు చట్టానికి, న్యాయానికి కట్టుబడి ఉండాలని కోరారు.

**డెత్‌సెల్‌లో ఇమ్రాన్‌ఖాన్ నిర్బంధం?**

తమ తండ్రిని 'డెత్‌సెల్'లో ఒంటరిగా నిర్బంధించి చిత్రహింసకు గురిచేస్తున్నారని వస్తున్న వార్తలు తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఇమ్రాన్ ఖాన్ కుమారులు ఖాసిం, సులేమాన్ మీడియాకు చెప్పారు. ఇమ్రాన్‌ఖాన్‌ను చూసేందుకు అనుమతించకపోతే దేశవ్యాప్త ఆందోళన చేస్తామని అధికారుల అనుమతికి ముందు వారు హెచ్చరించారు. దేశవ్యాప్తంగా పార్టీ నిరసన ఉద్యమం చేపట్టిన నేపథ్యంలో వారు మాట్లాడారు. ఒకవైపు ప్రభుత్వం ఇమ్రాన్‌ఖాన్‌ను కలుసుకోవడానికి ఒక సోదరికి అనుమతి ఇచ్చామని జైలు అధికారులు చెప్పారు. దీనికి ముందు ఖాసిం, సులేమాన్ మాట్లాడుతూ, నెలన్నర రోజులుగా తమ తండ్రి ఆచూకీ చెప్పకుండా మానసికంగా తమ కుటుంబాన్ని ప్రభుత్వం చిత్రహింసలు చేస్తోందని విమర్శించారు.

## నెతన్యాహూ పదవీ విరమణకు ప్రతిపక్షాల డిమాండ్



**టెల్అవీవ్ :** పరిపాలనలో అవినీతి, మోసాలకు పాల్పడ్డారని స్వదేశంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రతిపక్షాల డిమాండ్ల మధ్య మంగళవారం కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. రెండు రోజులక్రితం నెతన్యాహూ ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ కు క్షమాభిక్ష ప్రసాదించమంటూ లేఖ రాసిన తర్వాత మొదటిసారి ఆయన కోర్టుకు హాజరయ్యారు. దీనిపై దేశంలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ప్రధానమంత్రి దేశంలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని మరికొన్నిపార్టీల నాయకులు కోరారు. ఇజ్రాయెల్‌లో సార్వత్రిక ఎన్నికలకు నిర్ణీత ప్రకారం 2026 అక్టోబరు వరకు గడువు ఉంది. రాజకీయాల నుండి ఉపసంహరించుకోవడానికి నెతన్యాహూ అంగీకరిస్తే ఆయన క్షమాభిక్షకు, విచారణ లేకుండా చేసేందుకు అంగీకరించాలని మాజీ ప్రధానమంత్రి నఫ్తాలీ బెన్నెత్ అన్నారు. 2021లో నెతన్యాహూను పదవీచ్యుతుణ్ణి చేసిన కూటమి నాయకుడు బెన్నెత్. నెతన్యాహూ అవినీతిపై 2020లో విచారణ ప్రారంభమైంది. కానీ ఆయన ఇప్పటివరకూ తన తప్పులను అంగీకరించలేదు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రిగా మూడు విడతలుగా 19 సంవత్సరాలు పాలిస్తున్న సుదీర్ఘ రాజకీయ చరిత్రగల నాయకుడు నెతన్యాహూ. 2021లో నెతన్యాహూ పదవీచ్యుతుడయ్యారు. తిరిగి 2022 ఎన్నికల్లో పదవిని చేజిక్కించుకున్నారు. ఆయన అవినీతిపై ప్రతిపక్షాలు సహా ప్రజాగ్రహం పెల్లుబికింది. ఆయన తన తప్పులను అంగీకరించాలని, పదవీ విరమణ చేస్తానని వాగ్దానం చేయాలని, ఆ షరతులపైనే క్షమాభిక్షకు అవకాశం ఇవ్వాలని కొన్ని ప్రతిపక్షాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలు అధ్యక్ష భవనం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తూ నెతన్యాహూను క్షమించవద్దని డిమాండ్ చేశారు.

## ఒకరు చేస్తే... అందరికీ ఆపాదించకండి

### వైట్‌హౌస్ ఎదుట ఆఫ్ఘానిస్థాన్ పౌరుల నిరసన




**వాషింగ్టన్ :** అమెరికా వైట్‌హౌస్ వెలుపల అమెరికాలో ఉన్న ఆఫ్ఘానిస్థాన్ జాతీయులు శాంతియుతంగా నిరసన ప్రదర్శన జరిపారు. అమెరికా సైన్యంలో పనిచేసిన లఖన్‌వాలా అనే సైనికుడు అమెరికా నేషనల్ గార్డులపై కాల్పులు జరిపితే ఈ చర్యను యావత్ అఫ్ఘానిస్థాన్ జాతీయులకు అంటగట్టి వారిని బహిష్కృతులుగా చూడటం న్యాయసమ్మతం కాదని వారు నినాదాలు చేశారు. ఒకరు చేసిన తప్పుకు మొత్తం ఆఫ్ఘానిస్థాన్ జాతీయులను నిందించవద్దని, వారిని దేశంలోకి అనుమతించకుండా అడ్డుకోవడం న్యాయం కాదని వారు కోరారు. కొద్దిరోజుల క్రితం జరిగిన కాల్పుల్లో ఒక మహిళా నేషనల్ గార్డు మరణించిన తర్వాత ట్రంప్ వలస విధానంలో కఠిన మార్పులు తీసుకువచ్చారు. అఫ్ఘానిస్థాన్ జాతీయులకు అమెరికాలో ప్రవేశం లేదని ప్రకటించారు. దేశంలో ఉన్నవారిని తనిఖీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. అఫ్ఘానిస్థాన్ జాతీయులు ప్రదర్శన చేసినప్పటికీ పత్రికలు చాలా చులకనగా చూశాయి.

## విజయఢంకా మోగించాలి
(మొదటి పేజీ తరువాయి)

ప్రతీ ఆడబిడ్డకు చీర చేరేలా చూడాల్సిన బాధ్యత జిల్లా అధ్యక్షులదేనన్నారు. గ్రామలవారీగా సమన్వయం చేసుకుంటూ పంపిణీ పూర్తి చేయాలని, డిసెంబర్ లోగా గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల చీరల పంపిణీ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. మార్చి నెలలో పట్టణ ప్రాంతాల్లో మహిళలకు 35 లక్షల చీరలను పంపిణీ చేయాలని, తద్వారా ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, పరిపాలనపై గ్రామ గ్రామాన చర్చ జరిగేలా చూడాలన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సంక్షోభంలో రాష్ట్రాన్ని అప్పగిస్తే, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సంక్షోభం నుంచి సంక్షేమం వైపు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నామన్నారు. 2034 నాటికి రాష్ట్రాన్ని 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చి దిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ నెల 7 న ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్‌కాలేజీ ముందు సభ నిర్వహించి యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం ద్వారా ఉస్మానియా యూనివర్సిటీని అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యుత్తమ యూనివర్సిటీగా తీర్చి దిద్దుతామని చెప్పారు. ఈ నెల 8,9 న నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రాజకీయాల్లో చేసింది చెప్పుకోవాలని, ప్రభుత్వం చేస్తున్న పనులు, అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. జిల్లా అధ్యక్షుడు అనేది గొప్ప బాధ్యత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో కాళ్లలో కట్టెలు పెట్టడం సహజమని, అది పెద్ద సమస్యగా భావించొద్దని అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని సూచించారు.

**ఓటు చోరీని అంశాన్ని దృష్టి మరలించేందుకే కేసులు : సిఎం రేవంత్‌రెడ్డి**

కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ ఓట్ చోరీ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా తీసుకెళ్లుతున్న నేపథ్యంలో ఆవిషయాన్ని దృష్టి మరల్చేందుకు మనీ ల్యాండరింగ్ కేసుల పేరుతో కేంద్ర ప్రభుత్వం మళ్లీ హడావుడి చేస్తోందని సిఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పై పెట్టిన అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానం చేస్తున్నామన్నారు.

మాజీ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ వారసత్వంగా వచ్చిన ఆస్తులతో పత్రికను నడిపారని, దీన్ని మనీ ల్యాండరింగ్ కేసు పెట్టి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లను వేధిస్తున్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి అండగా నిలబడతామని, అవసరమైతే ఎందాకైనా పోరాడతామని సందేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి ఇవ్వదలచుకున్నామని సిఎం స్పష్టం చేశారు.

**కష్టపడి పనిచేస్తేనే పదవులు వస్తాయి : మహేశ్ కుమార్**

టిపిసిసి కార్యవర్గ సమావేశాన్ని ఉద్దేశించి టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనికి తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని, కష్టపడి పని చేస్తే పదవులు అవే వస్తాయన్నారు. డిసిసి పదవి ప్రముఖమైందని స్థానిక నేతలను సమన్వయం చేసుకుంటూ పార్టీ నిర్మాణం పై దృష్టి పెట్టాని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. ఓట్ చోరీ కార్యక్రమం కొంత ఆలస్యం అయ్యింది.వాటి పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనుల ఉంటాయని వాటిని విజయవంతం చేయాలన్నారు.

రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కుల సర్వే నిర్వహించమని దీంతో తప్పక ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జనగణన లో కుల సర్వే నిర్వహిస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సాగుతున్న ప్రజాపాలనతో కెసిఆర్ శకం ముగిసిందన్నారు. వాటాల పంచాయతీ లో తేడా వల్ల కెసిఆర్ కుటుంబంలో కొట్లాటు వచ్చాయన్నారు. వారం పది రోజుల్లో కార్పొరేషన్ తో పాటు పెండింగ్ లో ఉన్న పదవుల భర్తీ వర్కింగ్ ప్రెసిడెంట్ లు భర్తీ చేసేందుకు ఆలోచనలో ఉన్నామని చెప్పారు.

## 'సర్'పై చర్చకు ఓకె
(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. దీంతో ప్రతిపక్షాలు సర్‌పై వెంటనే చర్చ జరపాల్సిందేనని ముక్తకంఠంతో పట్టుబట్టాయి. ఈ నేపథ్యంలో లోక్‌సభలో గందరగోళ పరిస్థితులు తలెత్తగా, స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో సర్‌పై వెంటనే చర్చ జరిపేందుకు కేంద్రం అంగీకరించకపోవడంతో ప్రతిపక్ష సభ్యులు సభను వాకౌట్ చేశాయి. పార్లమెంట్ వెలుపల కూడా విపక్ష సభ్యులు ప్లకార్డులు చేబూని సర్‌పై చర్చించకు డిమాండ్ చేశాయి. కాగా, లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొడంతో స్పీకర్ సభను ముందుగా మధ్యాహ్నం 12 గంటలకు, ఆ తరువాత 2 గంటలకు సభను వాయిదా వేశారు. అనంతరం ప్రతిపక్ష సభ్యుల నినాదాల మధ్య సభ మళ్ళీ సమావేశమైంది. సభకు అధ్యక్షత వహించిన దిలీప్ సైకియా, తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో కొనసాగుతున్న సర్‌పై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున సభా కార్యక్రమాలకు అనుమతివ్వాలని ప్రతిపక్షాలను కోరారు. బిహార్‌లో సర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, ఎన్నికల ఫలితాలు కూడా వెల్లడయ్యాయన్నారు. సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025 లోక్‌సభలో పరిశీలన, ఆమోదం కోసం ఎజెండాలో పెట్టినప్పటికీ సభ అంతరాయం కారణంగా దానిని చేపట్టలేకపోయారు. ముందుగా దాదాపు 10 నిమిషాల పాటు కొనసాగిన జీరో అవర్‌లో, వివిధ పత్రాలు, స్టాండింగ్ కమిటీల నివేదికలను సభలో ఉంచారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఓటర్ల జాబితా సర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. నినాదాలు చేశారు. ఈ అంశంపై వెంటనే చర్చకు డిమాండ్ పట్టుబట్టారు. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కల్పించుకుని సభ మర్యాదను కాపాడాలని, వివిధ పార్టీల నుండి చాలా మంది సభ్యులు ఉన్నారని, వారి వాదనలు కూడా వినాలని కోరారు. కొన్ని పార్టీల సభ్యులు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం సరికాదని, ఎన్నికల్లో ఓడిపోయామనే కోపం కూడా సభలో కనిపించకూడదని మంత్రి అన్నారు. దివంగత బిజెపి నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా ఎన్నికల్లో ఓడిపోయారని ప్రస్తావించారు. ఇటీవలి ఎన్నికల ఓటములపై కాంగ్రెస్‌ను విమర్శిస్తూ, వారు ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్నారని రిజిజు అన్నారు. ప్రభుత్వం సమస్యలపై చర్చించడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగుతుండగా, 10 నిమిషాల్లోనే సభా కార్యకలాపాలను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. అంతకుముందు, నిరసనల కారణంగా మధ్యాహ్నం 12 గంటల వరకు సభా కార్యకలాపాలు వాయిదా పడ్డాయి.

**రాజ్యసభలోనూ ప్రతిష్టంభన**

టర్ల జాబితాపై చర్చకు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన నెలకొంది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉందని చెప్పినప్పటికీ చర్చకు గడువు ఇవ్వడానికి నిరాకరించారు.

దీంతో విపక్షాలు ఇతర విషయాల కంటే సర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా చర్చను నిర్వహించాలని డిమాండ్ చేయగా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి 'వందేమాతరం'పై చర్చను ముందుగా చేపట్టాలని సూచించారు. సర్‌పై చర్చకు ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరించడంతో, ప్రతిపక్ష ఎంపిలు ఎగువ సభలో నినాదాలు చేసి, తరువాత వాకౌట్ చేశారు. సర్‌పై చర్చ కోసం ఒత్తిడి చేస్తూ, కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, ఆప్, ఎస్‌పి, సిపిఐ, సిపిఐ(ఎం), సభ్యులు రిజిజును కలిశారు. ఎన్నికల సంస్కరణలపై చర్చకు ప్రభుత్వం సభలో సమయం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఉదయం రాజ్య సభ వాయిదా తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సమావేశమైనప్పుడు, 'వందేమాతరం'పై చర్చను బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో చేర్చామని, 'ఎన్నికల సంస్కరణలు'పై చర్చకు ముందు దీనిని చేపడతామని రిజిజు అన్నారు. 'వందేమాతరం మన స్వాతంత్ర్య పోరాటానికి సంబంధించిన విషయం. ఎన్నికల సంస్కరణలకు సంబంధించిన విషయాలు కూడా చాలా ముఖ్యమైనవి. పార్టీలు సభలో లేవనెత్తాలనుకునే మరిన్ని అంశాలు ఉండవచ్చు. అయితే, ప్రతిపక్ష పార్టీలు ఒక అంశాన్ని లేవనెత్తడానికి ఐక్యంగా ఉన్న కారణంగా, ప్రభుత్వం చర్చను చేపట్టడానికి సిద్ధంగా ఉంది, కానీ వందేమాతరంపై చర్చకు ముందు దానిని ఉంచడం సముచితం కాకపోవచ్చు' అని ఆయన అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు డెరెక్ ఓ బ్రెయిన్ స్పందిస్తూ ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. '14 కంటే ఎక్కువ ప్రతిపక్ష పార్టీలు సర్ కారణంగా మృతి చెందారని, అందువల్ల ఒక నిర్దిష్ట అంశంపై చర్చను కోరుకుంటున్నాయి' అని అన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ అనేక పార్టీలు రూల్ 267 కింద చర్చను డిమాండ్ చేశాయని, అది ఇతర విషయాల కంటే ప్రాధాన్యత పొందాలన్నారు. ఇతర వ్యవహారాలన్నింటినీ పక్కన పెట్టి సర్‌పై నిబంధన 267 కింద చర్చను సభ చేపట్టాలన్నారు. డిఎంకెకు చెందిన తిరుచ్చి శివ, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్ కూడా ఎన్నికల సంస్కరణలపై చర్చ ముందుగా జరగాలని డిమాండ్ చేశారు. చైర్మన్ ఇతర పనులను కొనసాగిస్తుండగా, ప్రతిపక్ష నాయకులు సర్‌పై అంశంపై చర్చకు డిమాండ్ చేస్తూ నినాదాలు చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత వారు సభ నుండి వాకౌట్ చేశారు.

## సమగ్ర కార్యాచరణ
(మొదటి పేజీ తరువాయి)

జెఎస్ డబ్ల్యూ, షీల్డ్ ఏఐ సంయుక్తంగా రూ.850 కోట్లతో మహేశ్వరంలోని ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ క్లస్టర్(ఇఎంసి)లో ఏర్పాటు చేయనున్న 'జెఎస్ డబ్ల్యూ అన్ మ్యాన్డ్ ఏరియల్ వెహికిల్(యుఎవి) ఫెసిలిటీ' భూమి పూజకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... డ్రోన్లు, శాటిలైట్లు, సైబర్ సిస్టమ్స్, ఎఐ అనేవి ఇకపై భవిష్యత్తు సాంకేతికతలు కావని, అవి ఇప్పటికే ఆధునిక యుద్ధాల నిర్వహణ వ్యవస్థగా మారాయన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో డ్రోన్ల తయారీలో స్వయం సమృద్ధిని సాధించడం జాతీయ భద్రతకు అత్యంత అవసరమన్నారు. 2030 నాటికి దేశీయ డిఫెన్స్ యుఎవి, డ్రోన్ మార్కెట్ వాల్యూ 4.4 బిలియన్ డాలర్లు, 5 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశముందన్నారు. ఈ పరిస్థితులను మనకు అనుకూలంగా మార్చుకునేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఎల్బిట్ సిస్టమ్స్, షీబెల్ లాంటి అంతర్జాతీయ డిఫెన్స్ దిగ్గజ సంస్థల తయారీ కేంద్రాలు హైదరాబాద్ లో ఉండటం 'రైజింగ్ తెలంగాణ'కు నిదర్శనమన్నారు. ఈ 16 ఎకరాల స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీలో ఏటా 300 వరకు వీబీఏటీ డ్రోన్లు తయారవుతాయన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఇక్కడ ఉత్పత్తి మొదలవుతుందని, ప్రొడక్షన్, రీపేర్, టెస్టింగ్... ఇలా అన్ని ఒకేచోట అందుబాటులో ఉంటాయన్నారు. కొత్తగా 300 మందికి హైవాల్యూ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో జేఎస్ డబ్ల్యూ డిఫెన్స్ ఫౌండర్ పార్థ్ జిందాల్, ఎంఎల్ఏ మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'లోక్ భవన్'గా 'రాజ్‌భవన్'
(మొదటి పేజీ తరువాయి)

ఉత్సాహాన్ని పునరుద్ధాటించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు లోక్ భవన్ తెలియజేసింది. లోక్ భవన్, తెలంగాణ అనే కొత్త నామకరణం అన్ని అధికారిక దస్త్రాలు, సూచనలు, రికార్డుల కోసం తక్షణమే అమల్లోకి వస్తుందని లోక్‌భవన్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంలో భాగంగా రాష్ట్రాల గవర్నర్ల అధికారిక నివాసాలు 'రాజ్ భవన్', 'రాజ్ నివాస్' పేర్లను 'లోక్ భవన్', లోక్ నివాస్' లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నవంబర్ 25వ తేదీన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు లేఖ రాసింది. అందుకు అనుగుణంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా తదితర రాష్ట్రాలు ఉత్తర్వులు జారీ చేశాయి.

## పిఎంఒ భవనం ఇక.. 'సేవాతీర్థ్'
(మొదటి పేజీ తరువాయి)

ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌గా పిలిచేవారు. అయితే పరిపాలనలో సేవా భావం ప్రాముఖ్యం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దీనికి సేవా తీర్థ్ అనే పేరు పెట్టాలని నిర్ణయించింది.

ఏఏ కార్యాలయాలు ఉండబోతున్నాయి?

కొత్తగా నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో పిఎంఒతో పాటు కేబినెట్ కార్యదర్శిత్వం, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ (ఎన్‌ఎస్‌సిఎస్), ఇండియా హౌస్ ముఖ్యంగా ఉండనున్నాయి. ఇందులోని ఇండియా హౌస్ ప్రత్యేకంగా విదేశీ ప్రతినిధులు, ప్రపంచ నాయకులతో ఉన్నత స్థాయి చర్చలు జరిపే కేంద్రంగా రూపొందుతోంది. దేశ విదేశాంగ వ్యవహారాల్లో ఇది కీలక పాత్ర పోషించనుంది.

సేవా తీర్థ్ వెనక ఉన్న భావం

పరిపాలన అనేది కేవలం అధికారాన్ని ప్రదర్శించే స్థలం కాదు, ప్రజలకు సేవలందించే కేంద్రం కావాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. 'సేవా తీర్థ్ అనేది సేవా భావాన్ని ప్రతిబింబించే పని ప్రదేశం. దేశ ప్రాధాన్యాలు, జాతీయ నీతులు ఇక్కడే రూపుదిద్దుకుంటాయి' అని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో ఇప్పుడు ఒక నిశ్శబ్దమైన కానీ లోతైన మార్పు జరుగుతోందని వారు పేర్కొన్నారు. అధికారం నుంచి సేవాభావం వైపు, ఆధిపత్యం నుంచి బాధ్యత వైపు మార్పు జరుగుతోందని వెల్లడించారు.

## సిఎంలకు ఆహ్వానం
(మొదటి పేజీ తరువాయి)

కలిసి తెలంగాణ మంత్రులు ప్రత్యేకంగా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఎవరెవరు ఏ ఏ రాష్ట్రాలకు వెళ్లాలో సిఎం నిర్ణయించారు. ఈ నెల 4వ తేదీన మంత్రులు వివిధ రాష్ట్రాలకు వెళ్లి సిఎంలకు గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖలు అందిస్తారు. జమ్మూ కాశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలకు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు సి.దామోదర్ రాజనర్సింహ, ఆంధ్రప్రదేశ్‌కు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తరప్రదేశ్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజస్థాన్‌కు పొన్నం ప్రభాకర్, చత్తీస్‌గడ్‌కు కొండ సురేఖ, పశ్చిమ బెంగాల్‌కు ధనసరి అనసూయ సీతక్క, మధ్యప్రదేశ్‌కు తుమ్మల నాగేశ్వర రావు, అస్సాంకు జూపల్లి కృష్ణా రావు, బిహార్‌కు జి.వివేక్ వెంకటస్వామి, ఒడిస్సాకు వాకిటి శ్రీహరి, హిమాచల్‌ప్రదేశ్‌కు అడ్లూరు లక్ష్మణ్ కుమార్‌కు, మహారాష్ట్రకు మొహమ్మద్ అజారుద్దీన్ వెళ్ళి సిఎంకు గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన లేఖలను అందిస్తారు. ఢిల్లీ సిఎం, కేంద్ర మంత్రులు, గవర్నర్లకు తెలంగాణ రాష్ట్ర ఎంపిలు కలిసి ఆహ్వాన లేఖలను అందిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## ఉద్యమకారులను పట్టించుకోని అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు

### కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పటికీ ఉద్యమకారులను అప్పటి మంత్రులు, ఎంఎల్‌ఎలు పట్టించుకోలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో12 వందల మంది అమలరులయ్యారని చెప్పినప్పటికీ, కేవలం 540 మంది అమరుల కుటుంబాలకు మాత్రమే సాయం అందిందన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 'తెలంగాణ అమరవీరుల స్మృతి'లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కవితతో పాటు జాగృతి నాయకులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు కనీస గౌరవం కూడా ఇవ్వలేదని, తెలంగాణ రాష్ట్రావతరణ రోజున వారికి శాలువను కూడా కప్పలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయలేదని, వారికి గౌరవం కూడా ఇవ్వలేదన్న బాధ ప్రజలలో ఉన్నదని తెలిపారు. కెసిఆర్ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను తాము సరిచేస్తామని చెప్పి అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రావతరణ రోజున ఉద్యమకారులు, వారి కుటుంబాలను గౌరవించలేదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెన్షన్లు, 250 గజాల స్థలాన్ని ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ నెల 9న ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపైన ప్రకటన చేయాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల చొప్పున భూములు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించకపోతే, జాగృతి తరఫున భూపోరాటాలు ప్రారంభిస్తామని కవిత హెచ్చరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఐసిడిఎస్ హైర్ వాహనాల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : సలావుద్దీన్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఐసిడిఎస్ విభాగం హైర్ వాహనాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఫోర్ వీల్ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో డబ్ల్యుడి, సిడబ్ల్యు డిపార్ట్‌మెంట్‌కు హైర్ వాహన సేవలను అందిస్తున్నామని, ఏప్రిల్ నుండి నవంబర్ వరకు ఉన్న పెండింగ్ బిల్లులు ఇప్పటివరకు విడుదల కాకపోవడం వల్ల తాము తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. డీజిల్, వాహన మరమ్మత్తులు, నెలవారీ ఇఎంఐలు, కుటుంబ ఖర్చులు, పిల్లల విద్యా వ్యయం వంటి అన్ని అంశాల్లో తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని, ఈ పరిస్థితి కుటుంబాల ఆర్థిక భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రితో పాటు కమిషనర్‌కి లేఖ రాసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

## కార్మికులకు వేతనాలు పెంచే వరకు పోరాటం

రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వ ఆస్పత్రులలో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ కార్మికులకు వేతనాలను పెంచే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఒక గంట నిరసన ధర్నా కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని ఫీవర్ ఆస్పత్రి, కింగ్ కోఠి ఆసుపత్రులలో జరిగిన ధర్నాలో ఎం.నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ హాస్పిటల్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కింద టెండర్లను ఆహ్వానించి, జిఒ నంబర్ 60 ప్రకారం జీతాలు చెల్లించాలని నిబంధనలో పొందుపర్చినప్పటికీ, ఇప్పటివరకు కార్మికులకు ఆ వేతనాలు అందకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. కార్మికులకు రూ.13,600 జీతం రావాల్సి ఉండగా కేవలం రూ.11వేలు మాత్రమే చెల్లించి, శ్రమదోపిడికి గురి చేస్తున్నారని, జీతానికి తగిన పిఎఫ్ చెల్లించడం లేదని, కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం నాలుగు పండగ సెలవులు, నాలుగు జాతీయ సెలవులు, సంవత్సరానికి 15 ఆర్జిత సెలవులు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ఉన్నటువంటి ధరల అనుగుణంగా నూతన టెండర్లను ఆహ్వానించి కార్మికులకు కనీస వేతనం రూ 26వేలు ఇచ్చే విధంగా నిబంధనలు పొందుపరచాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు పెంపునకు నోచుకోలేదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కనీస వేతనాల కమిటీని ఏర్పాటు చేసి, ఆ కమిటీ రూపొందించిన జీతం కూడా నేటికీ అమలులోకి తీసుకురాకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వాలకు ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన చెప్పారు. హైదరాబాద్ లాంటి మహానగరంలో కార్మికుల జీవించడానికి సరిపడా జీతం ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందులో భాగంగానే ప్రస్తుతం కనీసంగా రూ 26 వేల జీతాలు ఉండాలన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు ప్రభుత్వ ఆసుపత్రులలోనే రోజు ఒక గంట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారంకాకపోతే ఈ నెల 8వ తేదీన కోఠిలో భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రులు సక్రమంగా నడవాలంటే కార్మికుల సంఖ్యను, బెడ్ల సంఖ్యను పెంచాలని, అందుకు అనుగుణంగా కార్మికులను నియమించాలని కాంట్రాక్టు లేబర్ చట్టం ప్రకారం కార్మికులకు రావాల్సిన సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్‌కు సంబంధించి కింగ్ కోఠి ఆసుపత్రి నాయకులు పార్వతి, సంతోషి, భాగ్యలక్ష్మి ఫీవర్ ఆస్పత్రి నాయకులు సర్వేశ్వరరావు, రుద్రమ్మ, లక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటలో భారత్‌దే అగ్రస్థానం

**తిరువనంతపురం:** సముద్ర చేపల వేట ఆసియా వ్యాప్తంగా స్తబ్దుగా ఉండటంతో చేపల చెరువుల పెంపకం గణనీయంగా వృద్ధి చెందింది. గడచిన 11 సంవత్సరాలలో భారతదేశంలో రికార్డుస్థాయిలో శరవేగంగా చేపల చెరు వుల పెంపకం, వాటి ఉత్పత్తులు వృద్ధి చెందాయి. మనదేశంలో 2014లో చేపల చెరువుల ద్వారా ఉత్పత్తులు 10.50 లక్షల టన్నులు ఉండగా, 2023 నాటికి ఈ ఉత్పత్తులు దాదాపు 40 లక్షల టన్నులకు పెరిగిందని బిఓబిపి–ఐజిఓ (బంగాళాఖాత అంతర్ ప్రభుత్వ సంస్థ కార్యక్రమం) నివేదిక వెల్లడించింది. చెన్నైలో మూడు రోజులపాటు జరిగే ఉన్నతస్థాయి ప్రాంతీయ వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైన సందర్భంగా మొదటిరోజు ఈ అధ్యయన నివేదికను విడుదల చేశారు. 12 దేశాలకు చెందిన ప్రతినిధి బృందాలు ఈ వర్క్‌షాపులో పాల్గొంటున్నాయి. ఈ చేపల ఉత్పత్తులు గడచిన పదకొండేళ్ళలో మనదేశంలో ఏకంగా167 శాతం మేరకు పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా చేపల ఉత్పత్తులలో ఆసియాఖండం 70 శాతం వాటాతో ఆధిపత్యస్థానంలో కొనసాగుతోందని నివేదిక వెల్లడించింది. ఈ ఉత్పత్తులు గణనీయంగా పెరగడంవల్ల ఆసియాలో ఆహార భద్రత వచ్చింది. బిఓబిపి డైరెక్టర్ డాక్టర్ పి.కృష్ణన్ ఈ నివేదిక వివరాలను విధాన నిర్ణేతలకు, నిపుణులకు తెలియజేశారు. ఆసియాలో భారతదేశం చేపల చెరువుల ద్వారా ఈ ఉత్పత్తులను చేయడంలో ఆధిపత్యస్థానంలో ఉందని ఆయన చెప్పారు. మనదేశంలో చేపల చెరువుల ద్వారా ఉత్పత్తులకు సంబంధించిన ఉద్యోగిత 1995లో 17 శాతం ఉండగా, 2020 నాటికి 40 శాతానికి పెరిగిందని నివేదిక వెల్లడించింది.

## గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లోని ఫ్యూచర్ సిటీలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లపై ఐటి మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్లోబల్ సమ్మిట్ వేదిక వద్ద జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ నెల అయిదో తేదీలోపు పనులన్నీ పూర్తి చేసి... ఆరో తేదీన డ్రైరన్ కండక్ట్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రపం చం దృష్టిని ఆకర్షించేలా... తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఏ ఒక్క చిన్న పొరపాటు జరగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. విభాగాల వారీగా అప్పగించిన బాధ్యతలు, వాటి పురోగతిపై సమీక్ష, ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి వచ్చే డెలిగేట్స్... మన అతిథులు, వారికి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. పార్కింగ్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

### గ్లోబల్ సమ్మిట్ అతిథులకు ప్రత్యేక బాస్కెట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రముఖులకు, అతిథుల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బాస్కెట్‌లను అందజేయనుంది. డిసెంబర్ 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరగే గ్లోబల్ సమిట్‌కు ప్రపంచం నలుమూలల నుంచి కార్పొరేట్ ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, పెట్టుబడిదారులు హాజరు కానున్నారు. వీరిని తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా స్వాగతం పలకనుంది. హైదరాబాద్‌కు చేరుకున్న వెంటనే వారికి ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా సాంప్రదాయ కిట్లు, రుచికరమైన వంటకాలతో కూడిన ఫుడ్ బాస్కెట్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**కిట్‌లో ఏముంటాయంటే..**

సదస్సుకు హాజరయ్యే అతిథులకు అందించే స్పెషల్ బాస్కెట్‌లో పోచంపల్లి ఇక్కత్, 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' లోగోతో కూడిన సావనీర్ కిట్లను అందించనున్నారు. పోచంపల్లి శాలువా, చేర్యాల మాస్క్ (పెయింటిగ్స్), హైదరాబాద్ అత్తర్, హైదరాబాద్ ముత్యాలతో చేసిన ఆభరణాలు ఇందులో ఉంటాయి. అదేవిధంగా ప్రత్యేక డిజైన్‌తో సిద్ధం చేసిన కల్చరల్ ఫుడ్ బాస్కెట్‌లో మహువ లడ్డులు, సకినాలు, అప్పాలు, బదామ్‌కీ జాలి వంటి తెలంగాణ సాంప్రదాయ వంటకాలు ఉండనున్నాయి. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతి, వంటకాల ప్రత్యేకతను ప్రపంచ వేదికపై ప్రదర్శించనున్నారు.

TELANGANA RISING GLOBAL SUMMIT

### హైదరాబాద్‌లో దేశంలోనే తొలి మహిళా ఫుట్‌బాల్ అకాడమీ



ప్రజాపక్షం/హైదరాబాద్: 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో క్రీడా రంగానికి సంబంధించి కీలక అడుగు పడనుంది. దేశంలోనే తొలి మహిళా ఫుట్‌బాల్ అకాడమీ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. హంకాంగ్ తరవాత ప్రపంచంలోనే రెండో మహిళల ఫుట్‌బాల్ అకాడమీ ఇదే కావడం విశేషం. దేశంలో రెండో పురుషుల ఫుట్‌బాల్ అకాడమీ కూడా తెలంగాణలోనే ఏర్పాటు చేయనున్నారు. డిసెంబరు 8, 9 తేదీలలో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే సదస్సులో తెలంగాణ ఫిఫా ఎఐఎఫ్‌ఎఫ్ ఫుట్‌బాల్ అకాడమీలు వివరాలను ప్రకటించనున్నాయి. వీటితో పాటు హైదరాబాద్ అంతర్జాతీయ చెస్ నిర్వహణకు సంబంధించిన ప్రకటన కూడా సదస్సులో వెలువడనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది.

## మావోయిస్టు నాయకుడు లోకేటి రమేష్ లొంగుబాటు



ప్రజాపక్షం/జనగామ : సిపిఐ మావోయిస్టు అజ్ఞాత నాయకుడు దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సౌత్ బస్తర్ డివిజన్ పరిధిలోని చైతన్య నాట్య మంచ్ డివిజన్ కమిటీ సెక్రటరీ లోకెటి రమేష్ అలియాస్ అశోక్ అలియాస్ నరేందర్, అలియాస్ రాజేశ్వర్, రమేష్‌రావు మంగళవారం జనగామ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ సందర్భంగా జనగామ డిసిపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో డిసిపి రాజమహేంద్రనాయక్ మావోయిస్టు రమేష్ లొంగిపోయిన విషయాన్ని వెల్లడించారు. కామారెడ్డి జిల్లా ఇస్రోజి వాడకు చెందిన రమేష్ తండ్రి లోకొటి రాజేందర్‌రావు అలియాస్ చందర్, పడకస్వామి, ప్రభాకర్, రవి, డికెఎస్‌జడ్‌సి వెస్ట్ జోన్ బ్యూరో సెక్రటరీగా పార్టీలో పనిచేశాడన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు రమేష్ మావోయిస్టు పార్టీని వీడి పోలీసుల ఎదుట లొంగిపోవడం జరిగిందన్నారు. ఆరోగ్య సమస్యలు, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, అంతర్గత విభేదాల నేపథ్యంలో లొంగిపోవడం జరిగిందన్నారు. రమేష్‌పై రూ.8లక్షల రివార్డు ఉండగా మంగళవారం 25వేలు డిడి రూపంలో అందజేయడం జరిగిందన్నారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని డిసిపి పిలుపునిచ్చారు. ఆయుధాలు, అజ్ఞాతాన్ని వీడాలని, ఊరికి వచ్చి కన్న వారి కన్నీళ్లు తుడవాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో జనగామ ఏసిపి పండరీ చేతన్, స్టేషన్‌ఘనపూర్ ఎసిపి భీమ్‌శర్మ, రఘునాథపల్లి సిఐ శ్రీనివాస్‌రెడ్డి, జనగామ సిఐ సత్యనారాయణరెడ్డి, ఎస్‌ఐ నరేష్‌లు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తున్న వారికి ఇంక్రిమెంట్ పరిశీలించాలి : ఎక్సైజ్ కమిషనర్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎక్సైజ్ శాఖలో పని చేస్తూ క్రీడల్లో రాణిస్తున్న వారికి ప్రోత్సాహంగా ఇంక్రిమెంట్ ఇవ్వడానికి అవకాశాలపై పరిశీలించాలని అధికారులకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ సూచించారు. ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది క్రీడల్లో ప్రతిభ చూపేందుకు వారి ఆటలో తర్ఫీదుకు నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం సముచితమైని ఎక్సైజ్ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ అన్నారు. ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ సి టీమ్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ రెజ్లింగ్ క్రీడలో రాణిస్తున్న చరణ్‌కు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ రూ.75 వేల నగదు ప్రోత్సాహన్ని అందించారు. 2025లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ రెజ్లింగ్ పోటీల్లో చరణ్ రెండో స్థానంలో రాణించి సిల్వర్ మెడల్‌ను సాధించాడు. 2024–25లో జరిగిన అల్ ఇండి యా సర్వీసెస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌ల్లో కానిస్టేబుల్ చరణ్ జాతీయ స్థాయిలో మూడో స్థానం సాధించి మంచి ప్రతిభ కనబరిచాడు. 2025–26 సంవత్సరంలో జరుగనున్న అల్ ఇండియా సర్వీసెస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో బాగా రాణించాలని, రెజ్లింగ్ సాధనకు అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసుకోవడానికి ఆర్థిక సాయం అందిస్తున్నామని కమిషనర్ అన్నారు. త్వరలో జరుగనున్న ఆల్ ఇండియా సర్వీసెస్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో మంచి మెడల్స్‌ను సాధించి ఎక్సైజ్‌శాఖకు గుర్తింపు తీసుకురావాలని కమిషనర్ కానిస్టేబుల్ చరణ్‌కు సూచించారు. మంచి సాధన చేయాలని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి లేఖ రాయాలని ఇంచార్జీ అడిషనల్ కమిషనర్ ఖురేషిని కమిషనర్ అదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌తోపాటు ఇంచార్జీ అడిషనర్ కమిషనర్ ఖురేషి, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్‌లు ఉన్నారు.

## నేడు జర్నలిస్టుల మహా ధర్నా

టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ




ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గత 12 ఏళ్లుగా నిర్లక్ష్యానికి, నిరాధరణకు గురవుతున్న పాత్రికేయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ వెల్లడించారు. మాసాబ్ ట్యాంక్‌లోని సమాచార భవన్ వద్ద ఉదయం 10 గంటలకు ఈ ధర్నా ప్రారంభమవుతుందని చెప్పారు. బషీర్‌బాగ్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విరాహత్ అలీ మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన పాత్రికేయులు రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కూడా అదే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పట్టించుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని.. పోరుబాట పడతామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పాత్రికేయుల సంక్షేమం కోసం ఇచ్చిన హామీల అమలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి భారీ సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొంటారని చెప్పారు. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి కొత్త కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య బీమా పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీలు వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్యతరగతి పత్రికలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వి.యాదగిరి, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు శిగ శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి చీడపురుగు సైబర్ క్రైమ్



'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు

డిజిపి శివధర్ రెడ్డి, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయెల్

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రస్తుత కాలంలో సమాజాన్ని పట్టి పీడిస్తున్న చీడపురుగు సైబర్ క్రైమ్, గతంలో దొంగతనాలు, దారి దోపిడీలు, రాబరీ వంటివి ఉండేవి. కానీ, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఇంట్లోనే కూర్చొని కేవలం సెల్‌ఫోన్ వాడకంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి రూ. కోట్లు కొల్లగొడుతున్నారని డిజిపి శివధర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్న 6 వారాల సైబర్ అవగాహన కార్యక్రమం 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్'ను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంగళవారం అధికారికంగా డిజిపి శివధర్‌రెడ్డి, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. సైబర్ నేరాలను అరికట్టడానికి రాష్ట్ర పోలీస్ వ్యవస్థ కీలక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు టిజిసిఎస్‌బితో సమన్వయం మరింత బలోపేతం చేయాలని, రాబోయే 6 వారాల ప్రచారంలో ప్రతి జిల్లాలో, ప్రతి విభాగంలో, ప్రతి పోలీస్ స్టేషన్‌లో క్రమబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. శిఖా గోయెల్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యంత బలమైన, డేటా ఆధారిత సైబర్ నేర ప్రతిస్పందన వ్యవస్థను నిర్మించిందని పేర్కొన్నారు. టిజిసిఎస్‌బి పూర్తిస్థాయి బ్యూరోగా ఏర్పడినప్పటి నుండి రూ.2.44 లక్షల ఎన్‌సిఆర్‌పి ఫిర్యాదులు అందాయని, మొత్తం 58,244 ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం జరిగిందన్నారు. రూ.350 కోట్లకు పైగా సైబర్ మోస బాధితులకు రిఫండ్ చేయడం వంటి విశేష ఫలితాలు సాధించిందని తెలిపారు. 1930 హెల్ప్‌లైన్ అప్‌గ్రేడ్, పుట్ ఆన్ హోల్డ్(పిఒహెచ్) వ్యవస్థ బలోపేతం, హైకోర్టుతో కలిసి రూపొందించిన రిఫండ్ ప్రాసెస్ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని తెలిపారు. 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' అవగాహన కార్యక్రమం ప్రజలతో నేరుగా కలిసే ఒక భారీ ఉద్యమమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా, విద్యాసంస్థల కోసం రూపొందించిన స్టూడెంట్ ప్రొగ్రాం ఫర్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సిబుల్ సైబర్ స్పేస్ (ఎస్‌పిఎఆర్‌సి) సైబర్ క్లబ్స్‌ను ప్రారంభించారు. ఎస్‌బిఐతో కలిసి బ్యాంకింగ్ సిబ్బంది, సున్నిత వర్గాల కోసం సైబర్ రిఫెండర్స్ అవగాహన కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్‌కు సంబంధించిన పోస్టర్లు, పాటలు, జింగిల్స్, అవగాహన చిత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నతాధికారులు అభిలాషా బిష్త్, సందీప్ శాండిల్య, విసి.సజ్జనార్, అవినాష్ మహంతి, విజయ్‌కుమార్, వి.బి.కమలాసన్ రెడ్డి, ఎఆర్.శ్రీనివాస్, కె.రమేష్‌నాయుడు, అభిషేక్ మహంతి, అరవింద్ బాబు, వైవిఎస్.సుధీంద్ర, నాగలక్ష్మి, సాయిశ్రీ,భాగస్వామ్య శాఖల ప్రతినిధులు, విద్యార్థులు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బిఐ) ప్రతినిధులు, విద్యార్థులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సిపిలు, ఎస్‌పిలు, వర్చువల్‌గా పాల్గొన్నారు.

## తెలంగాణ రైతులకు తీరని నష్టం



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశంలో అత్యధికంగా విత్తనోత్పత్తి చేసే రాష్ట్రం తెలంగాణ అని,కేంద్ర విత్తన ముసాయిదా చట్టం ద్వారా నష్టపోయేది తెలంగాణ రైతులేననివ్యవసాయ రంగ నిపుణులు, వ్యవసాయ, రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విత్తన ముసాయిదా చట్టం బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమే రూపొందించారని విమర్శించారు. విదేశీ కంపెనీ విత్తనాలకు బారులు తీశారని, రాష్ట్రాల అధికారాలను తగ్గించి, పూర్తిగా వ్యవసాయ రంగాన్ని కేంద్రం తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 'విత్తన ముసాయిదాచట్టం 2025'పైన తెలంగాణ వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని బిఆర్‌కె మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నాయకులు, అధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ రంగ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

**మల్టీనేషనల్ కంపెనీ ప్రయోజనాలే కనిపిస్తున్నాయి...: కోదండరెడ్డి**

కేంద్రం ప్రవేశపెడుతున్న విత్తన బిల్లులో బహుళ జాతి కంపెనీల ప్రయోజనాలే కనిపిస్తున్నాయని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. విత్తనం రైతు హక్కు అని, ప్రస్తుతం ఆ విత్తనం, విత్తన కంపెనీల చేతుల్లోకి వెళ్లిందన్నారు. కేంద్రం ప్రవేశపెడుతున్న విత్తన చట్టంలో విత్తనాల ధరలపై నియంత్రణ లేదని, సెల్ఫ్ సర్టిఫికేషన్ తోనే కంపెనీలు అమ్ముకునే అవకాశం కల్పించడం పద్ధతి కాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. పర్యావరణవేత్త దొంతి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ ముసాయిదా విత్తన చట్టంలో రైతుల హక్కులు, వారి రక్షణను పొందుపర్చాల్సిందేనని అన్నారు. రైతుల ప్రయోజనాలకు, దీర్ఘకాలిక భద్రతకు తిలోదకాలు ఇచ్చారు.

**విత్తనాల ఎగుమతికి ముందే నాణ్యత, సాగు పరీక్షలు జరగాలి: డాక్టర్ సోమ మర్ల**

రిటైర్డ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సోమ ఎస్. మర మాట్లాడుతూ విత్తన రకాలు ఎగుమతి చేసే దేశాల వ్యవసాయ, అక్కడి వాతావరణ పరిస్థితులకు భారతదేశంలోని దిగుమతిదారుల పరిస్థితులు చాలా భిన్నంగా ఉంటాయన్నారు. ఈ విత్తనాల నాణ్యత, సాగును భారతదేశానికి చెందిన ప్రభుత్వ రంగ పరిశోధన సంస్థలు, ఐసిఎఆర్, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు పరీక్షలను నిర్వహించాలని సూచించారు. దిగుమతుల ముసుగులో జన్యుపరంగా దిగుమతి చేసుకున్న బ్రీడింగ్ మెటీరియల్‌ను ఎటువంటి పరీక్షలు లేకుండా ఉపయోగిస్తే భారత వ్యవసాయానికి హానికరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ముసాయిదా చట్టంలో రైతులకు ప్రయోజనం కలిగే అంశాలు లేవని, వాటిని రాష్ట్ర ప్రభుత్వమే ప్రతిపాది ంచాలన్నారు. ధరల నియంత్రణ, పరిహారం అంశాన్ని రాష్ట్రమే నిర్వహించాలన్నారు. కిసాన్ కాంగ్రెస్ నాయకుడు పత్తి కృష్ణా రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయం పద్ధతిలో విత్తనాలు ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి మారిపోయిందన్నారు. హార్టికల్చర్ వైస్ చాన్సలర్ రాజిరెడ్డి మాట్లాడుతూ సీడ్ కంపెన్సేషన్ ఎన్ని రోజుల్లో వస్తుందో ముందే చెప్పాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్ట్ తరహా ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి దేవభక్తుల సంధ్య, కోశాధికారి డి.జి. నరేంద్ర ప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త రామంజనేయులు, కిసాన్ కాంగ్రెస్ నేతలు నల్లమల్ల వెంకటేశ్వరరావు హాజరయ్యారు.

కేంద్ర విత్తన ముసాయిదా చట్టంపై సమావేశం

ఈ బిల్లు విదేశీ కంపెనీల కోసమేనని విమర్శ

### రైతు వ్యతిరేకం: పశ్యపద్మ

కేంద్రం ప్రవేశపెట్టిన 'విత్తన ముసాయిదా బిల్లు 2025' బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా రైతులకు వ్యతిరేకంగా ఉన్నదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అన్నారు. రైతు సంక్షేమం, సామాజిక న్యాయం దిశగా బిల్లును సవరించాలని, ఈ బిల్లులో అనేక సెక్షన్స్‌లలో సవరణలు అవసరమని, రైతు రక్షణను బలోపేతం చేయడం, విత్తన కంపెనీల జవాబుదారితనాన్ని పెంచడం, రైతు హక్కులను రక్షించే పిపివి ఆర్‌ఎఫ్ చట్టాన్ని పరిరక్షించే అంశంపైన దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. నకిలీ, నాసిరకం విత్తనాలతో పంట దెబ్బతిన్నప్పుడు పరిహారం, విత్తన ఖర్చులు, దిగుబడి నష్టం, ఎరువులు, తిరిగి సాగు చేసుకునేందుకు అయ్యే అన్ని ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకుని రైతుకు చెల్లించాలని సూచించారు. పరిహారం చెల్లింపును కూడా నిర్దిష్టమైన కాలపరిమితిని బిల్లులో చేర్చాలన్నారు. నకిలీ విత్తనాలను నిరోధించేందుకు నకిలీ విత్తనాలను సరఫరా చేసిన వారిపై రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు జరిమానా, 5 ఏళ్ల ఖైదు పడేలా బిల్లును సవరించాలని పశ్యపద్మ తెలిపారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
NIT No. 23/DB/EE/Alwal Circle/GHMC/2025-26, తేది: 02.12.2025
పని పేరు: GHMC, అల్వాల్ సర్కిల్-27, వార్డు నెం.133, మచ్చబొల్లారంలోని లయోలా కాలేజ్ రోడ్‌లోని సాయిబాబానగర్ కమాన్ వద్ద ఆర్‌సిసి వరద నీటి డ్రెయిన్ పైప్‌లైన్ పునర్నిర్మాణం. అంచనా వ్యయం: రూ.15.50 లక్షలు, ప్రారంభ తేది : 03.12.2025న మ.03.00గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 06.12.2025న మ.03.00గం.ల వరకు. ఇఇ అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అల్వాల్ సర్కిల్-27, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11633-PP/CL/ADVT/1/2025-26, Date: 02-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవికి పితృవియోగం

**ప్రజాపక్షం /హైదరాబాద్:** తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సోనీ బాలాదేవి తండ్రి ఎ.చౌబాసింగ్ (85) సోమవారం మణిపూర్ లోని ఇంపాల్ లో తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఈ సందర్భంగా, ఎల్. బి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది వారి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు.



## ఆర్‌టిసి ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.2,072 కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలి

### టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఆర్‌టిసికి ఉన్న రూ.2,702 కోట్ల బకాయిలను తక్షణమే చెల్లించాలని టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు,ప్రధాన కార్యదర్శిఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. కాంగ్రె స్ అధికారం చేపట్టిన వెంటనే 6 గ్యారెంటీల హామీలలో భాగంగా మహాలక్ష్మి ప థకం కింద ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం ద్వారా జీరో టికెట్లకు గాను ఆర్‌టిసికి ప్రతి నెల రూ.350 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం ఇచ్చే డబ్బులలో ప్రతి నెల కోత పెడుతూ అరకొర నిధులను విడుదల చేస్తుండడంతో మూలిగే నక్క పైన తాటి కాయ పడ్డట్టుగా ఆర్‌టిసిని ఆర్థికంగా కుంగదీస్తూ మరింత అప్పుల ఊబిలోకి నెట్టివేస్తోందని ఆగ్ర హం వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం 2 సంవత్సరాలుగా ఆర్‌టిసిలో విజయవంతంగా అమలు జరుగుతోందని, ఇందుకు సంబంధించి చెల్లించాల్సిన సొ మ్ము సుమారు రూ.2,072 కోట్లను ఇవ్వకుండా, ఆ భారాన్ని ఆర్టీసి మీదనే ప్రభుత్వం రుద్ది చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. దీంతో ఆర్‌టిసి ఉద్యోగులకు చెల్లించాల్సిన 2017 వేతన సవరణ బకాయిలు, అలాగే 2021, 2025 వేతన సవరణలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్‌టిసికిబకాయి పడ్డ డబ్బులను వెంటనే విడుదల చేసి ఇచ్చిన మాట నిలుపుకోవాలని కోరారు. ఆర్‌టిసి సంస్థకు రూ.8,700 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ. 6,620 కోట్లే విడుదల చేసి మొత్తం చెల్లించినట్లుగా ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు.మహాలక్ష్మి పథకం అమలు సజావుగా అవుతున్నదని సంబరాలు చేసుకుంటున్న ప్రభుత్వం ఇందుకు అవసరమయ్యే బస్సులను సమకూర్చడంలో గాని, సిబ్బందిని నియమించడంలో గాని, ఈ పథకం వల్ల ఎదురయ్యే ఇబ్బందులను నివారించడంలో గాని పూర్తిగా విఫలం అయిందని అన్నారు.అదేవిధంగా ఆర్‌టిసి రిటైరైన ఉద్యోగులు క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో పొదుపు చేసుకున్న మొత్తాలకు చెల్లించాల్సిన వడ్డీ 15 నెలలుగా చెల్లించకపోవడంతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్టీసిపై సవతి ప్రేమను విడనాడి తక్షణమే రూ.2,072 కోట్ల విడుదల చేసి ఆర్‌టిసికి చెల్లించి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలని వారు కోరారు.

## డ్రగ్స్ మాఫియా దోషులను కఠినంగా శిక్షించాలి : జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య వంతం చేసి, పోరాడుతున్న సిపిఐ(ఎం) యువజన సంఘం నాయకుడు పెంచలయ్యను డ్రగ్స్ మాఫియా అతి దారుణంగా హత్య చేయడాన్ని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఖండించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన డ్రగ్స్ మాఫియా డాన్ కామాక్షిని, ఆమె భర్తను, వారికి సహాయపడిన అనుయాయులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్ మాఫియాను అరికట్టడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పూర్తిగా విఫలమవుతున్నాయని, ప్రభుత్వాలు, అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో ఈ రాష్ట్రాల్లోని పట్టణాలు, గ్రామాల వరకు విచ్చలవిడిగా డ్రగ్స్ సరఫరా జరుగుతున్నదని ఆయన ఆరోపించారు.

# అగ్రికల్చర్ రైజింగ్ సాగులో సరికొత్త రికార్డులు

- వరి సాగులో పంజాబ్‌ను దాటేసిన తెలంగాణ
- రెండేండ్లుగా స్థిరంగా వ్యవసాయ రంగం వృద్ధి
- రైతు సంక్షేమానికి రూ.లక్ష కోట్లకు మించి ఖర్చు చేసిన ప్రజా ప్రభుత్వం



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** సుస్థిర పాలన, రైతులకు లాభం చేకూర్చే విధానాలు, విస్తరణ ఫలితాలతో రాష్ట్రంలో వ్యవసాయం ఏటేటా వర్ధిల్లుతోంది. గడిచిన రెండేండ్లలో తెలంగాణ దేశమందరి దృష్టిని ఆకర్షించేలా పంటల సాగులో కొత్త రికార్డులు నెలకొల్పింది. వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో పంజాబ్‌ను దాటేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువలో (జిఎస్‌విఎ) వ్యవసాయం వాటా 6.7 శాతం పెరిగింది. ప్రస్తుత ధరల ప్రకారం వ్యవసాయ రంగం వాటా గత ఏడాది రూ.1,00,004 కోట్లు నమోదవగా, 2024–25 అంచనాల ప్రకారం రూ. 1,06,708కు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం అధికారవర్గాల సమాచారం ప్రకారం సర్కారు అందిస్తున్న ప్రోత్సాహంతో రాష్ట్రంలో పంటల సాగు విస్తీర్ణం పెరిగింది. అంతకంతకు రైతులకు ఆర్థిక భద్రత చేకూరింది. 2023–24 సీజన్‌లో 209.62 లక్షల ఎకరాల్లో అన్ని పంటలు సాగు చేయగా, 296.17 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. 2024–25 సీజన్‌లో సాగు విస్తీర్ణం ఏకంగా 220.77 లక్షలకు పెరిగింది. దిగుబడి 320.62 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. తెలంగాణలో ప్రధాన పంట అయిన వరి 2023–24లో 118.11 లక్షల ఎకరాలలో సాగు జరిగింది. 2024–25లో అది 127.03 లక్షల ఎకరాలకు పెరిగింది. ధాన్యం దిగుబడి 260.88 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి ఈ ఏడాది వానాకాలం, యాసంగిలో కలిపి 284.16 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలో అగ్రగామిగా నిలిచింది. పత్తి సాగు విస్తీర్ణం ఇంచుమించుగా రెండేళ్లు ఒకే విధంగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పత్తి కప్పాల ఉత్పత్తి 3.89 లక్షల టన్నులు పెరిగింది. 26.35 లక్షల టన్నుల నుంచి 30.24 లక్షల టన్నులకు చేరింది. తొలి రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. రైతుల మేలుకోరే పథకాలకు భారీ బడ్జెట్ కేటాయించింది. తెలంగాణ రైతులను దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలనే సంకల్పంతో రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసింది. రూ.54,280 కోట్లతో వివిధ పథకాలను అమలు చేసింది. దేశంలోనే వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా గతంలో ఎన్నడూ లేని విధంగా 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది.

### 25,35,964 రైతు కుటుంబాలకు రుణ విముక్తి

దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు ఒకే సారి రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసింది. దాదాపు 25 లక్షల (25,35,964) రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేసింది. తొలి ఏడాదిలోనే రూ. 20,616 కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డి అమల్లోకి తెచ్చిన వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు పథకాన్ని నిరాటంకంగా ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తున్నది. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్తుకు ప్రతి ఏడాది దాదాపు రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో రైతులకు పంటల పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా పంపిణీలోనూ రికార్డు వేగం నమోదు చేసింది. ఎకరానికి రూ.12 వేల చొప్పున రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు పంపిణీ చేసింది. మొత్తం 1,57,51,000 ఎకరాలకు 69,86,548 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నిధులు జమ చేసింది. ఈ ఏడాది వానాకాలం పంటలకు రికార్డు వేగంతో రైతు భరోసా నిధులు పంపిణీ చేసింది. గతంలో ఎన్నడూ లేనంత వేగంగా కేవలం 9 రోజుల్లోనే రూ.8744 కోట్లు జమ చేసింది.

### రైతు బీమాతో రైతుకు ధీమా

రైతుకు ఆపద వస్తే రైతు కుటుంబాలు ధీమాగా ఉండేలా రైతు బీమాను ప్రభుత్వం అమలు చేసింది. ఇందులో భాగంగా రైతులు ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షల బీమా పరిహారం ఆ బాధిత కుటుంబానికి అందిస్తోంది. 42.16 లక్షల మంది రైతుల కుటుంబాల పేరుతో ప్రభుత్వం జీవిత బీమా కంపెనీకి రైతు బీమా ప్రీమియం చెల్లించింది. గతంలో ఒక్కో రైతుకు రూ.3400 చొప్పున చెల్లించిన ప్రీమియంను ప్రభుత్వం ఎల్ఐసితో సంప్రదింపులు చేసి ఈసారి రూ.3225కు తగ్గించింది. ప్రకృతి విపత్తులతో, క్రిమికీటకాలతో పంటలు నష్టపోతే రైతులు ఇబ్బంది పడకుండా నష్ట పరిహారం అందేలా పంటల బీమాను పునరుద్ధరించింది.

### 16 కేంద్ర పథకాలు పునరుద్ధరించిన రాష్ట్ర ప్రభుత్వం

వ్యవసాయానికి సంబంధించి గత ప్రభుత్వం నిలిపేసిన 16 కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను కట్టుదిట్టంగా నిర్వహించింది. గతంలో కంటే ఎక్కువ కొనుగోలు కేంద్రాలు నెలకొల్పింది. రైతులు నెలల కొద్దీ ఎదురు చూడకుండా డబ్బులను వేగంగా చెల్లించి రికార్డు నెలకొల్పింది. ప్రస్తుత సీజన్‌లో 8380 కేంద్రాలు ఏర్పాటు చేసి ఇప్పటికే 38.72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. డిసెంబర్ 2వ తేదీ దాదాపు రూ.10162 కోట్ల ధాన్యం కొనుగోలు చేసింది. సెంటర్లలో ధాన్యం అమ్మిన రైతులకు రెండు రోజుల్లోనే డబ్బులు చెల్లిస్తోంది.

### సన్న వడ్లకు రూ.500 బోనస్ అమలు

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించింది. కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు అమ్మిన రైతులకు మద్దతు ధరకు అదనంగా బోనస్ చెల్లించింది. దీంతో రాష్ట్రంలో సన్నరకాల వరి సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ సీజన్‌లో ఇప్పటికే సన్నాలు అమ్మిన రైతులకు రూ.314 కోట్ల బోనస్ చెల్లించింది.

### ‘ధరణి’ స్థానంలో ‘భూభారతి’

గత ప్రభుత్వం హయంలో రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన ‘ధరణి’ వెబ్ పోర్టల్‌ను రద్దు చేసి రైతులకు తమ భూములపై హక్కులు కల్పించే ‘భూభారతి’ చట్టం అమల్లోకి తెచ్చింది. భూభారతి కొత్త పోర్టల్‌తో భూముల సమస్యలు, వివాదాలు చాలావరకకు పరిష్కారమయ్యాయి. రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించేందుకు, అధికారులు నేరుగా క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి పరిస్థితులు తెలుసుకునేందుకు రైతు నేస్తం పథకాన్ని ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రమంతటా 1600 రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను అమర్చనుంది. అన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు ఉండేలా టిజిపిఎస్‌సి ద్వారా 144 మంది వ్యవసాయ అధికారుల నియామకాలు చేపట్టింది. ఉద్యానవన శాఖలో 18 మంది హార్టికల్చర్ ఆఫీసర్లను నియమించింది. ఆయిల్ పామ్ కస్టమ్స్ సుంకం సంబంధించిన సమస్యలు పరిష్కరించటం ద్వారా ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు రూ.2000 అదనపు లబ్ధి చేకూరే నిర్ణయం తీసుకుంది.

### నాణ్యమైన విత్తనాలకు ‘తెలంగాణ సీడ్ యాక్ట్’

వ్యవసాయ రంగం అభివృద్ధి సలహాలు, సూచనల కోసం కోదండరెడ్డి సారథ్యంలో వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేసింది. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు ప్రత్యేకంగా తెలంగాణ సీడ్ యాక్ట్‌ను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. మే నెలలోనే ఈ బిల్లు ముసాయిదా తయారీకి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. మెరుగైన విత్తనాలను పండించడం, స్థానికంగా అవసరం మేరకు వాడుకుని, మిగిలిన వాటిని ఎగుమతి చేసే స్థాయికి రైతులు ఎదిగేలా ఈ బిల్ ఉపయోగపడనుంది. భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెనుకాడలేదు. గత ఏడాది మార్చి, సెప్టెంబర్‌లో వడగండ్లు, వర్షాలతో నష్టపోయిన 94462 మంది రైతులకు రూ.95.39 కోట్ల పరిహారం అందించింది. ఇటీవల మార్చి, ఏప్రిల్ నెలలలో వచ్చిన భారీ వర్షాలకు నష్టపోయిన 36449 మంది రైతులకు రూ.44.19 కోట్ల పరిహారం అందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

# కేంద్రం నిధులు తొక్కిపట్టినా అభివృద్ధి ఆగదు

- బెంగాల్‌లో రెండు కోట్లమందికి ఉద్యోగాలిచ్చాం
- ఎన్నికల వేళ 14 ఏళ్ళ ప్రభుత్వ విజయాల
- నివేదిక ప్రకటించిన మమతాబెనర్జీ



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ గ్రామీణాభివృద్ధికి సంబంధించిన కీలక పథకాల నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయకుండా తొక్కిపట్టినప్పటికీ రాష్ట్రంలో అభివృద్ధి వేగం ఆగదని, తమ ప్రభుత్వం 14 సంవత్సరాల పాలనలో రెండోకోట్ల మందికి ఉద్యోగాలు ఇచ్చిందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఎన్ని ఆటంకాలు పెట్టినాగానీ అభివృద్ధిపథంనుండి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దారితప్పి వెళ్ళదని ఉద్ఘాటించారు. వివిధ రంగాలలో పశ్చిమ బెంగాల్ ఈనాడు మనదేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శ నమూనాగా నిలిచిందని చెప్పారు. ప్రత్యేకించి గ్రామీణ అభివృద్ధిలో, ముఖ్యంగా సూక్ష్మ ,చిన్న,మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధిలో దేశంలో ద్వితీయస్థానంలో ఉందని, విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తోందని చెప్పారు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు వస్తున్న తరుణంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ 14 సంవత్సరాల పరిపాలనా విజయాల నివేదికను ప్రకటించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కల్పించడంలో దేశంలోనే పశ్చిమ బెంగాల్ ప్రథమస్థానంలో ఉందని, గ్రామీణప్రాంత గృహ నిర్మాణంలో, గ్రామాలలో రహదారుల నిర్మాణంలో ప్రథమస్థానంలో ఉందన్నారు. గడచిన 14 సంవత్సరాలలో రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో ఆరు రెట్లు నిధుల కేటాయింపు పెంచామని చెప్పారు. ‘‘కేంద్రం సహకరించకపోయినాగానీ ఆ పథకాలను కొనసాగిస్తున్నాం, రాష్ట్రంలోనే వనరులను సమీకరించుకుని వాటికి కేటాయిస్తున్నాం, ఈనాడు ఇప్పుడు మళ్ళీ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు వస్తున్నారు, కనీసం ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌కు ఇవ్వాల్సిన బకాయిలను ఇస్తుందా?’’ అని ఆమె ప్రశ్నించారు. బిహార్‌లో కొత్తగా పదవీ స్వీకారం చేసిన ప్రభుత్వంపై మమతా బెనర్జీ విమర్శలు గుప్పించారు. ‘‘బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వం మహిళలకు రూ.10,000 వంతున పంపిణీ చేసింది, కానీ పశ్చిమ బెంగాల్‌లో లక్ష్మిర్ భాండార్ పథకం కింద గడచిన ఐదేళ్ళుగా ఏటా రూ.60,000 లు ఇస్తున్నాం, ప్రస్తుతం ఈనాడు రాష్ట్రంలో 2.20 కోట్ల మంది మహిళలు లక్ష్మి భాండార్ పథకం కింద సహాయం పొందుతున్నారు, బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఖాద్యసథి ఆహార భద్రతా పథకం కింద లక్షకోట్ల రూపాయలకు పైగా ఖర్చుచేసింది, ఈ నిధులను తొమ్మిదికోట్లమందికి పంపిణీ చేశాం, ఇంటింటికీ రేషన్ సరుకులను సబ్సిడీపై సరఫరా చేశాం, దీనికోసం రూ.1,717 కోట్లు కేటాయించాం’’ అని ప్రభుత్వ విజయాలను వివరించారు.

# ప్రాసిక్యూటర్ న్యాయం కోసం పనిచేసే బాధ్యతనూ గుర్తించాలి

- ‘సుప్రీం’ కీలక వ్యాఖ్యలు
- హత్యకేసులో దోషులుగా తేలిన ముగ్గురి నేరారోపణలను పక్కన పెట్టిన ‘అపెక్స్ కోర్టు’
- సిఆర్‌పిసి సెక్షన్ 313ను పాటించలేదని ఆరోపించిన పిటిషనర్లు



**న్యూఢిల్లీ :** న్యాయస్థానంలో అధికారిగా వ్యవహరించే ప్రాసిక్యూటర్‌కు నిందితుడిని దోషిగా నిర్ధారించడమే లక్ష్యంగా కాకుండా, న్యాయం కోసం పనిచేయాల్సిన బాధ్యత కూడా ఉంటుందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఒక హత్య కేసులో దోషులుగా తేలిన ముగ్గురు వ్యక్తుల నేరారోపణలను పక్కన పెడుతూ న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సిఆర్‌పిసి) సెక్షన్ 313ను పాటించలేదని పిటిషనర్లు ఆరోపించారు. సిఆర్‌పిసి కోడ్ 1973లోని ఈ నిబంధన కోర్టుకు సమర్పించిన సాక్ష్యాలకు సంబంధించిన నిందితుడిని పరిశీలించే అధికారాన్ని కోర్టుకు ప్రసాదిస్తుంది. నిందితులకు శిక్షపడేలా చేయాలనే కోరికతో ఈ సెక్షన్ కింద నిందితుల విచారణను నిర్వహించడంలో కోర్టుకు సహాయం చేయాల్సిన బాధ్యతను ప్రాసిక్యూటర్ పక్కన పెట్టడం కూడా మాకు అంతే బాధను కలిగించిందని ధర్మాసనం వెల్లడించింది. ‘ప్రాసిక్యూటర్ కోర్టు అధికారి. న్యాయం కోసం పనిచేయాల్సిన బాధ్యత ఆయన విధి. వారు రా ష్ట్రం తరపున డిఫెన్స్ లాయర్‌గా మాత్రమే వ్యవహరించలేరు. నిందితులకు శిక్షపడేలా చేయడమే వా రి ఏకైక లక్ష్యం ’అని ధర్మాసనం చెప్పింది. హత్యకేసులో తమను దోషులుగా నిర్ధారిస్తూ పాట్నా హైకోర్టు జారీ చేసిన ఆదేశాలను సవాల్‌చేస్తూ ము గ్గురు నిందితులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు విచారించింది. న్యాయమైన విచారణకు చర్చించలేని అవసరాలలో ఒకటి, నిందితులకు వారిపై ఉన్న కేసు, ప్రాసిక్యూషన్ వాదనలను తోసిపుచ్చడానికి తగినంత అవకాశం ఉండాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. నిందితు ల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం ధ ర్మాసనం స్పందిస్తూ ప్రాథమిక చట్టాలను పాటించడంలో ఘోర వైఫల్యం, ఇది ఒక దయనీయమైన పరిస్థితిని వెల్లడిస్తుందని వ్యాఖ్యానించింది. ‘ముగ్మురు వ్యక్తులు అందరూ ఇచ్చిన స్టేట్‌మెంట్ల సంబంధిత ఒకదానికొకటి కార్బన్ కాపీలు ఒక పండితుడైన ట్రయల్ జడ్జి చేతుల్లో నుండి ఎలా బయట పడతాయో అనే విషయాన్ని మనం అర్థం చేసుకోవడంలో విఫలం అవుతున్నాం’ అని ధర్మాసనం అసంతృప్తిని వ్యక్తం చేసింది.


## బిహార్ స్పీకర్‌గా బిజెపి నేత ప్రేమ్ కుమార్

**పాట్నా:** బిహార్ అసెంబ్లీ స్పీకర్‌గా బిజెపి సీనియర్ నాయకుడు ప్రేమ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్పీకర్ పదవికి ప్రేమ్ కుమార్ పేరు ఒక్కటే ప్రతిపాదనకు వచ్చినట్లు అసెంబ్లీ తాత్కాలిక స్పీకర్ నరేంద్ర నారాయణ్ యాదవ్ సభకు చెప్పారు. దీంతో ప్రేమ్ కుమార్‌ను సభ మూజువాణీ ఓటు ద్వారా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రేమ్ కుమార్ గాయ టౌన్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి రికార్డుస్థాయిలో 18వ సారి శాసనసభ్యుడుగా విజయం సాధించారు. స్పీకర్‌గా గెలిచిన తర్వాత ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఆయనను వెంటపెట్టుకుని స్పీకర్ స్థానం వద్దకు తీసుకువెళ్ళి ఆ ఉన్నతాసనంపై కూర్చోబెట్టారు. నితీశ్ కుమార్ తోపాటు ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ కూడా ప్రేమ్ కుమార్‌ను స్పీకర్ స్థానం వద్దకు సగౌరవంగా తోడ్కొనివెళ్ళారు.కొత్తగా ఎన్నికైన స్పీకర్‌కు సభ్యులు అందరూ లేచి నిలబడి గౌరవపూర్వకంగా అభినందనలు తెలియజేయాలని నితీశ్ కుమార్ కోరారు. ఐతే ఆయన మాట మన్నించకుండా కొంతమంది ప్రతిపక్ష నాయకులు కూర్చునే ఉండటంతో ముఖ్యమంత్రి కోపగించుకుని విమర్శించారు. ఈ సందర్భంగా, బిజెపి, జెడి యు నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఆయన ప్రజాజీవితంలో సాధించిన విజయాలు, ఆయన గొప్పతనాన్ని ప్రశంసించారు.

# విలీనంపై నేడో రేపో సర్కార్ గెజిట్ నోటిఫికేషన్

- టీక్యూర్ తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్
- మూడు రోజుల్లో వార్డుల పునర్విభజన ముసాయిదా నోటిఫికేషన్
- ఇప్పటికే పూర్తయిన 25 వేల ఓటర్ల క్లస్టర్‌ల మ్యాపింగ్ ప్రక్రియ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిలో 20 మునిసిపాలిటీలు, 7 కార్పొరేషన్‌ల విలీనానికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ నెడో రేపో వెలువడనుంది. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్‌పై రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేసిన విషయం తెల్సిందే. గెజిట్ నోటిఫికేషన్ వెలువడిన మూడు రోజులలో వార్డుల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఈ ముసాయిదాపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం తుది నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన వెంటనే, కలవబోయే స్థానిక సంస్థలు జిహెచ్‌ఎంసిలో విలీనమైనట్లు పరిగణించనున్నారు. ఈనెల 26వ తేదీ నుంచి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)లో సుదీర్ఘంగా వార్డుల పునర్విభజన ప్రక్రియను కొనసాగుతోంది. 25 వేల ఓటర్లతో క్లస్టర్‌లుగా మ్యాపింగ్‌తో సహాటౌన్‌ప్లానింగ్,ఎన్నికల యంత్రాంగం సిద్ధం చేసింది. ఓటర్ల పరిమితికి అనుగుణంగా క్లస్టర్‌ల అనుసంధానించడం ద్వారా వార్డుల ఏర్పాటు ప్రక్రియ సులభతరంగా మారనుంది. ప్రస్తుతానికి 27 స్థానిక సంస్థలు విలీనమైనా జిహెచ్‌ఎంసి ఒకే సంస్థగా ఉండనుంది. జిహెచ్‌ఎంసిని విభజించాలనుకుంటే ఆ పని కొంతకాలం తర్వాతే జరగే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



### టీక్యూర్‌కు చట్టబద్ధత కల్పన..

విలీనమవుతున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్న ప్రాంతాన్ని ప్రస్తుతం తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ (టీక్యూర్)గా పిలుస్తున్నప్పటికీ, దీనికి చట్టబద్ధత లేదు. తాజాగా గెజిట్ నోటిఫికేషన్‌తో టీక్యూర్‌కు చట్టబద్ధత కల్పించనున్నారు. దీంతో ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) వరకు ఉన్న ప్రాంతాన్ని ఇకపై టీక్యూర్‌గానే వ్యవహరించనున్నారు. ఈ పరిధిలో జనాభా దాదాపు 1.30 కోట్లు ఉన్నట్లు అధికారులు అంచనగా ఉంది. విలీనం, వార్డుల పునర్విభజనకు సంబంధించి చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. విలీనం తర్వాత కూడా పరిపాలనా వ్యవస్థ వార్డులు, సర్కిళ్లు, జోన్‌లుగానే కొనసాగనున్నాయి. విలీనమవుతున్న సంస్థలతో సహా, జిహెచ్‌ఎంసిలోని అన్ని వార్డుల పునర్విభజనకు సంబంధించిన కసరత్తు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

### బడ్జెట్‌పై తాత్కాలిక సందిగ్ధత..

ప్రతి సంవత్సరం రాబోయే ఆర్థిక సంవత్సరానికి నాలుగు నుండి ఐదు నెలల ముందుగానే జిహెచ్‌ఎంసి బడ్జెట్‌ను రూపొందించడం ఆనవాయితీగా వస్తోంది. కొత్తగా 27 స్థానిక సంస్థలు విలీనమవుతున్నందున, ఆ ప్రాంతాల్లో పనులు చేపట్టాల్సింది కూడా జిహెచ్‌ఎంసినే. ప్రస్తుత పాలకమండలికి (150 వార్డుల పరిధిలోని) కొత్తగా కలిసే సంస్థలకు నిధులు కేటాయించేందుకు సాంకేతికంగా అధికారం లేదు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతానికి జిహెచ్‌ఎంసి పరిధికి మాత్రమే కొత్త బడ్జెట్‌ను రూపొందించనున్నారు. కొత్తగా విలీనమయ్యే వాటికి సంబంధించిన నిధుల కేటాయింపుపై ప్రభుత్వం నుంచి అనుమతి పొందడం లేదా చట్టబద్ధంగా ఇబ్బందులు లేకుండా తగిన పరిష్కారం చూస్తామని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ప్రస్తుత జిహెచ్‌ఎంసి పాలకమండలి గడువు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీతో ముగియనుంది. కావున, ఆ తర్వాతే కొత్తగా విలీనమైన ప్రాంతాలకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపుపై తగిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురు కానందున, ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సి ఉంది.



## జాతీయ కాలుష్య నిరోధక దినోత్సవం టిజి పిసిబి అవగాహన


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ కాలుష్య నిరోధక దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) ప్రజల్లో పర్యావరణ అవగాహన పెంచేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించింది. కాలుష్యం ప్రభావంపై సందేశాలు కలిగిన పోస్టర్‌లతో ఆటో ప్రచార కార్యక్రమం నిర్వహించి, చెత్త దహనం, వాహన ఉద్గారాలు, వాయు నాణ్యత, ప్లాస్టిక్ వ్యర్థాల సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నేషనల్ హై స్కూల్, బెగంపేట్‌లో విద్యార్థుల కోసం పర్యావరణ క్విజ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణపై తమ అవగాహనను ప్రదర్శించారు. కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, పర్యావరణ హిత పద్ధతులను అనుసరించాలని టిజిపిసిబి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో టిజిపిసిబి చీఫ్ ఇంజనీర్ బి.రఘు పాల్గొన్నారు.

## సిఎం వ్యాఖ్యలు ఖండించిన బండి సంజయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందువులను, హిందూ దేవుళ్లను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌కు మద్దతు ఇస్తోం దని, హిందూ సమాజాన్ని విభజించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు.

## యుద్ధాన్ని కోరుకోవడంలేదు

### యూరప్ సిద్ధపడితే మేం రెడీ :పుతిన్



**మాస్కో:** యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను యూరప్ నాయకులు అడ్డుకుంటున్నారని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. యూరప్‌తో యుద్ధాన్ని రష్యా కోరుకోవడంలేదని అన్నారు. మాస్కోలో మంగళవారం రష్యా బ్యాంకింగ్ రంగం, ద్రవ్యోల్బణంపై ఒక వాణిజ్య వేదికమీద చర్చలో ప్రసంగించిన తర్వాత తిరిగి వెళ్ళిపోతుండగా పాత్రికేయులు ఆయన వెంటపడి ఉక్రేన్ శాంతి చర్చల గురించి ప్రశ్నలు అడిగారు. ఉక్రేన్ శాంతి చర్చల్లో యూరోపియన్ యూనియన్ జోక్యం, భాగస్వామ్యం గురించి పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు పుతిన్ స్పందిస్తూ, యూరప్‌తో రష్యా యుద్ధం కోరుకోవడంలేదని, ఒకవేళ వారు యుద్ధాన్నే కోరుకుంటే పోరాటం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ‘‘యూరప్‌కు శాంతియుత ఎజెండా లేదు, వారు కయ్యానికి కాలు దువ్వుతారు, పైగా యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తుంటే ఆ ప్రయత్నాలను వారు అడ్డుకుంటున్నారు, యుద్ధాన్ని రెచ్చగొడుతున్నదే వారు, అలాంటప్పుడు వాళ్ళు ఉక్రేన్‌లో యుద్ధాన్ని ఆపేయమని అడగడం ఆమోదయోగ్యం కాదు, యూరప్‌తో మేం యుద్ధాన్ని కోరుకోవడంలేదు, వారు అంకు సిద్ధంగా ఉంటే పోరాటానికి మేం ఇప్పుడే సిద్ధంగా ఉన్నాం’’ అని పుతిన్ చెప్పారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## పానాసోనిక్ బ్రాండ్ అంబాసిడర్‌గా ధోని

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ పానాసోనిక్ ఎక్స్‌ప్రెస్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా మంగళవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో క్రికెట్ లెజెండ్ మహేంద్ర సింగ్ ధోనిని తమ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. సంస్థ యొక్క ఎయిర్‌కండిషనర్ (హెచ్‌విఎసి) విభాగానికి ధోని ప్రతినిధిగా వ్యవహరించనున్నారని కంపెనీ ఈ సందర్భంగా అధికారికంగా వెల్లడించింది. కంపెనీ ప్రతినిధుల ప్రకారం, ధోని యొక్క శాంత స్వభావం, విశ్వసనీయత, స్థిరత్వం, పనితీరుపై నిబద్ధత వంటి లక్షణాలు పానాసోనిక్ బ్రాండ్ విలువలతో అనుసంధానంగా ఉన్నాయని తెలిపారు. వినియోగదారులలో నమ్మకాన్ని మరింత పెంచడం లక్ష్యంగా ఈ భాగస్వామ్యాన్ని ముందుకు తెచ్చినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన ఎంఎస్ ధోని మాట్లాడుతూ, పానాసోనిక్ అనేది భారతీయ కుటుంబాల్లో దశాబ్దాలుగా ఉపయోగిస్తున్న నమ్మకమైన బ్రాండ్ ఈ సంస్థతో అనుబంధం నాకు గౌరవం అని చెప్పారు. పానాసోనిక్ 2027 నాటికి దేశంలోని ఎయిర్‌కండిషనర్ మార్కెట్లో తన వాటాను రెట్టింపు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ధోనితో భాగస్వామ్యం చేయడం వ్యూహాత్మక నిర్ణయమని సంస్థ తెలిపారు.

### కర్నాటక మాజీ ముఖ్యమంత్రి
## యడ్యూరప్పకు ఊరట
పోక్సో కేసు విచారణపై 'సుప్రీం' స్టే




**న్యూఢిల్లీ :** కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి సీనియర్ నేత బిఎస్ యడ్యూరప్పకు సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఆయనపై దాఖలైన పోక్సో కేసు విచారణపై స్టే విధించింది. కర్నాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను యడ్యూరప్ప సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, ఫిర్యాదుదారుడికి నోటీసులు జారీ చేసింది. ఈ అంశంలో మళ్లీ కర్నాటక హైకోర్టు విచారించాలని ఆదేశించాలా? వద్దా? అన్న అంశానికి మాత్రమే నోటీసులు జారీ చేసినట్లు బెంచ్ స్పష్టం చేసింది. పోక్సో చట్టం కింద చార్జిషీట్‌ను ట్రయల్ కోర్టు పరిగణనలోకి తీసుకోవడాన్ని సమర్థిస్తూ.. విచారణకు హాజరు కావాలని ఆదేశించిన కర్నాటక హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాల్ చేస్తూ యడ్యూరప్ప స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు సిజెఐ నేతృత్వంలోని బెంచ్ విచారణ జరిపింది. ఈ కేసులో ఏం జరుగలేదని చూపించే కీలకమైన ఆధారాలను హైకోర్టు విస్మరించిందని యడ్యూరప్ప తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఆయన నాలుగు సార్లు సిఎంగా పని చేశారన్నారు. 2024 మార్చి 14న ఓ మహిళ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదైంది. సహాయం కోసం యడ్యూరప్ప ఇంటికి వెళ్లిన సమయంలో తన 17 సంవత్సరాల కుమార్తెను లైంగికంగా వేధించారని, డబ్బు ఇచ్చి ఈ వ్యవహారాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారని సదరు మహిళ ఆరోపించింది. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జూలై 4, 2024న ట్రయల్ కోర్టు యడ్యూరప్పతో పాటు మరో ముగ్గురిపై కేసును అణగదొక్కేందుకు ప్రయత్నించారని, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారంటూ అభియోగాలను నమోదు చేసింది. ఆ తర్వాత కర్నాటక హైకోర్టు కేసును పునః పరిశీలించాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది. ఫిబ్రవరి 18న ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు యడ్యూరప్పతో పాటు ముగ్గురిని మార్చి 15న తన ఎదుట కావాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, కోర్టు ఇచ్చిన ఆదేశాలతో పాటు ఫిర్యాదు సైతం కొట్టివేయాలని యడ్యూరప్ప హైకోర్టులో సవాల్ చేశారు. తనపై వచ్చిన ఆరోపణలన్నీ రాజకీయ ప్రేరేపితమేనని మాజీ ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే, ఇటీవల కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించడంతో మాజీ సిఎం సుప్రీంకోర్టు తలుపు తట్టారు.




### ప్రధానాంశాలపై చర్చించకుండా
## మోదీ పారిపోతున్నారు
• ఇండియా కూటమి నేతలు మండిపాటు • పార్లమెంట్ వెలుపల 'సర్'కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

**న్యూఢిల్లీ :** ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)కు వ్యతిరేకంగా, ఎన్నికల సంస్కరణలపై చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు ప్రతిపక్ష నాయకులు మంగళవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో నిరసన తెలిపారు. ఈ అంశంపై రాహుల్ గాంధీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. పార్లమెంట్ భారత ప్రజలకు చెందినదని ప్రధాని చెబుతున్నప్పటికీ, ప్రజల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను చర్చించకుండా ఆయన నిరంతరం తప్పుకుంటారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కంటే పెద్ద ప్రజా సమస్య ఏముంటుందని నిరసన తర్వాత రాహుల్‌గాంధీ హిందీలో ఫేస్‌బుక్ పోస్ట్ చేశారు. సర్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి పార్లమెంట్ భవనం వెలుపల బలమైన నిరసన నిర్వహించిందన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి సర్‌పై తీవ్రమైన చర్చ పార్లమెంటులో జరగాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. ప్రతి పౌరుడి హక్కులు ఓటులో ఉంటాయి, దేశంలోని పేద, బహుజన సమాజం ఓట్లను కత్తిరించడానికి, ఎన్నికలను ఏకపక్షంగా చేయడానికి సర్ ఒక ఆయుధమని రాహుల్‌గాంధీ అన్నారు. మోదీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్ కలిసి సర్ ద్వారా ఓట్ల దొంగతనం అమలు చేస్తున్నాయని నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. 'ఇది లక్షలాది మంది దళిత, వెనుకబడిన, గిరిజన, అణగారిన సోదరసోదరీమణుల ఓటు హక్కులను హరించడానికి ఒక వ్యవస్థీకృత ప్రయత్నం. అన్ని ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ఎన్నికల కమిషన్ వాటిలో దేనికీ సమాధానం ఇవ్వడం లేదు. ప్రభుత్వం కమిషన్‌ను బహిరంగంగా సమర్థిస్తోంది' అని ఆమె నిరసన తర్వాత ఎక్స్‌లో హిందీలో పోస్ట్ చేశారు. 'ఇది ప్రజాస్వామ్యాన్ని మరియు రాజ్యాంగాన్ని నాశనం చేయడానికి, నియంతృత్వాన్ని స్థాపించడానికి చేసిన కుట్ర. ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ జరగడానికి మేము అనుమతించము' అని ప్రియాంక గాంధీ చెప్పారు. డిఎంకెకు చెందిన కె కనిమోజి, టిఆర్ బాలు, సిపిఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ పార్లమెంటు మకర్ ద్వార్ ముందు జరిగిన నిరసనలో పాల్గొన్న ఇతర ప్రతిపక్ష నాయకులలో ఉన్నారు. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో సర్‌కు వ్యతిరేకంగా నాయకులు పోస్టర్లు, ప్లకార్డులను పట్టుకున్నారు. 'స్టాప్ సర్–స్టాప్ ఓటు చోరీ' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌ను కూడా వారు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఇది రాజకీయ ప్రతీకారం
నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్‌ఐఆర్ నమోదుపై ఖర్గే ధ్వజం



**న్యూఢిల్లీ :** నేషనల్ హెరాల్డ్ కేసులో కొత్త ఎఫ్‌ఐఆర్ నమోదు చేయడంపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. ఇది రాజకీయ ప్రతీకారం అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం, ఇడి కలిసి కొత్త ఆరోపణలు లేక ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని పాత కేసులను తిరిగి తెరపైకి తీసుకువస్తున్నాయని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. '12 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా గాంధీ కుటుంబంపై కొత్త ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ఎందుకంటే మోదీ ప్రభుత్వం, ఇడి వద్ద కొత్త ఆరోపణలు లేవు. వాస్తవాలు తక్కువగా ఉన్నప్పుడు నాటకీయ అంశాలు రంగంలోకి దిగాయి. రాజకీయ ప్రతీకార చర్య, పాత ఆరోపణలు తీసుకురావడం అన్నీ ప్రత్యర్థులను ప్రత్యర్థులను వేధించే ప్రయత్నం. ఇది రాజకీయ ప్రతీకార చర్య. దీనిని న్యాయవ్యవస్థ కచ్చితంగా గుర్తిస్తుందని మేం విశ్వాసిస్తున్నాం' అని ఖర్గే పేర్కొన్నారు. అటు నేషనల్ హెరాల్ కేసులో ఇడి దాఖలు చేసిన చార్జిషీటును పరిగణనలోకి తీసుకునే విషయంపై ఢిల్లీ కోర్టు తన నిర్ణయాన్ని డిసెంబర్ 16కు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్ పత్రికను ప్రచురిస్తున్న అసోసియేటెడ్ జర్నలిస్ట్స్ లిమిటెడ్(ఎజెఎల్ )కు చెందిన సుమారు రూ.2 వేల కోట్ల విలువ చేసే ఆస్తుల్ని నిందితులు తమ హస్తగతం చేసుకున్నారని ఇడి ఆరోపిస్తోంది. ఈ కేసులో కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్, సుమన్ దూబే, శ్యామ్ పిట్రోడాలతోపాటు యంగ్ ఇండియన్ అనే ఒక ప్రైవేటు కంపెనీ కుట్రకు, మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఇడి ఆరోపిస్తోంది.

### సమస్యల వలయంలో
## గుజరాత్ రాష్ట్రం
డ్రగ్స్,అక్రమ మద్యం,రైతుల కష్టాలు
డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై రాహుల్ విమర్శ




**న్యూఢిల్లీ:** డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం, రైతుల కష్టాలతో గుజరాత్ రాష్ట్రం కునారిల్లిపోతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ బిజెపి పాలనపై తీవ్రస్థాయి లో విమర్శలు చేశారు. గుజరాత్‌లో ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ ''జన్ ఆక్రోశ్ యాత్ర'' కొనసాగుతున్న తరుణంలో రాహుల్‌గాంధీ మంగళవారం గుజరాత్ రాష్ట్ర సమస్యలను ప్రధానంగా ప్రస్తావించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా హిందీలో ఒక పోస్టింగ్ పెట్టారు. తమ యాత్రలో ఈ విధంగా ఎన్నో సమస్యలు పార్టీ దృష్టికి వస్తున్నాయని ప్రజలు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా రైతులు తమ సమస్యలను ఈ యాత్రలో కాంగ్రెస్‌పార్టీ దృష్టికి తీసుకువస్తున్నారని ఎక్స్ వేదికగా తెలియజేశారు. వరదలవల్ల రైతుల పంటలు నాశనమయ్యాయని, వారి జీవితాలు తలక్రిందులయ్యాయని పేర్కొన్నారు. ప్రజల బాధలను, వారి సమస్యలను కాంగ్రెస్‌పార్టీ తెలుసుకుంటుందని, గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వం వైఫల్యాలను, వారి అవినీతిని దేశ ప్రజల దృష్టికి తీసుకువస్తామని పేర్కొన్నారు. గుజరాత్‌లో ప్రత్యేకించి రైతులు, మహిళలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజు రోజుకూ మాదక ద్రవ్యాల ప్రమాదం పెరిగిపోతోందని, అక్రమ మద్యం వరదలా ప్రవహిస్తోందని, నేరాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని మహిళలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. గుజరాత్ ప్రజా జీవితంలో అభద్రత లోతుగా విస్తరిస్తోందన్నారు. ''మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ వంటి మహోన్నత నాయకులు నడయాడిఇన ప్రాంతం గుజరాత్, సత్యం, నైతికత, న్యాయం వంటి ఉన్నత విలువలకు నిలయం గుజరాత్. కానీ గడచిన కొద్ది సంవత్సరాలుగా ఆ రాష్ట్రంలో యువకుల భవితవ్యం చీకటి ప్రపంచంలోకి జారుకుంది. మాదక ద్రవ్యాలు, నేరాలు రాజ్యమేలుతున్నాయి'' అని విమర్శించారు. గుజరాత్‌లో మహిళలు పెద్దసంఖ్యలో వీధుల్లోకి వస్తున్నారు, న్యాయం కావాలని కోరుతున్నారు, ఎందుకంటే నేరస్థులు అధికార శక్తుల రక్షణ పొందుతున్నారు, మహిళలు, సాధారణ ప్రజలు నిర్లక్ష్యానికి గురవుతున్నారు, కష్టాలపాలవుతున్నారు'' అని రాహుల్‌గాంధీ ఆ పోస్టింగ్‌లో విమర్శించారు. ''ఇన్ని జరుగుతున్నాగానీ, బిజెపి ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోంది. ఎందుకని బిజెపి మంత్రి ఈ విషయాలన్నింటినీ దాచిపెడుతున్నారు? గుజరాత్ ద్రోహులను ఎందుకు కాపాడుతున్నారు? అని రాష్ట్రం ప్రశ్నిస్తోంది'' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. ''ఇటీవల గుజరాత్‌లో వరదలు బీభత్సం సృష్టించాయి. దారుణ విలయం సృష్టించాయి, పంటలు నాశనం కావడంతో వరదలవల్ల వేలాది కుటుంబాలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు సహాయ పథకాలు ఎప్పటికీ ఆగవని, అవి నిరంతయారంగా కొనసాగుతూనే ఉంటాయని రేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నసమయంలో చెప్పారు, కానీ ఈనాడు గుజరాత్ రాష్ట్రం డబుల్ ఇంజిన్ ప్రభుత్వ పరిపాలనలో సమస్యల వలయంలో చిక్కుకుని కునారిల్లిపోతోంది, ఆ రాష్ట్రానికి చెందిన నేటి ప్రధానమంత్రి వారిని పట్టించుకోవడంలేదు, వారికి తగినంత సహాయం అందజేయడంలేదు, కనీసం వారిపట్ల సానుభూతి కూడా చూపించడంలేదు'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు.

### అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే...
## అప్పుడే శివకుమార్ సిఎం
• ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటన • శివకుమార్ నివాసంలో సిఎం అల్పాహారం



**బెంగళూరు :** తనకు, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ మధ్య ఎలాంటి విభేదాలు లేవని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య పునరుద్ఘాటించారు. ఇద్దరమూ సోదరులం మాదిరిగా ఐక్యంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నామని, భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. నాయకత్వ అంశంపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి ఇద్దరమూ కట్టుబడి ఉంటామని, అధిష్ఠానం నిర్ణయించినప్పుడు శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని సిద్ధరామయ్య ప్రకటించారు. అధికారక పోరు నేపథ్యంలో ఇద్దరూ ఇప్పటికే బ్రేక్‌ఫాస్ట్ మీట్ కాగా, ఐక్యతకు నిదర్శనంగా, సిద్ధరామయ్య మంగళవారం శివకుమార్ నివాసానికి అల్పాహారం కోసం వెళ్లారు. అల్పాహారం తర్వాత మీడియాతో మాట్లాడుతూ తామిద్దరం, మొత్తం పార్టీ ఐక్యంగా ఉన్నామని పేర్కొన్నారు. 'ఈ అవగాహన ఎల్లప్పుడూ ఉంటుంది. ఎటువంటి తేడాలు లేవు. డికె శివకుమార్, నేను ఐక్యంగా ఉన్నాము; మేము ప్రభుత్వాన్ని ఐక్యంగా నడుపుతాము. భవిష్యత్తులో కూడా మేము ప్రభుత్వాన్ని ఐక్యంగా నడుపుతాము' అని సిద్ధరామయ్య అన్నారు. నాయకత్వ అంశంపై, శనివారం సిఎం నివాసంలో నిర్వహించిన మునుపటి అల్పాహార సమావేశంలో నిర్ణయించినట్లుగా, తామిద్దరం హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. అయితే ఈ విషయంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారో ఇప్పటివరకు హైకమాండ్ నుండి ఎటువంటి సమాచారం లేదు. ఒక ప్రశ్నకు సమాధానంగా సిఎం స్పందిస్తూ హైకమాండ్ మమ్మల్ని పిలిస్తే, కచ్చితంగా వెళ్లి వారిని కలుస్తామని, తమ ఇద్దరినీ ఆహ్వానించే కార్యక్రమంలో తాను ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్‌ను కలుస్తానన్నారు. శివకుమార్ ఎప్పుడు సిఎం అవుతారని అడిగినప్పుడు, 'హైకమాండ్ చెప్పినప్పుడు' అని బదులిచ్చారు. శివకుమార్ తనను అల్పాహారానికి ఆహ్వానించారని, అల్పాహారం తర్వాత 8 నుండి బెళగావిలో ప్రారంభమయ్యే శాసనసభ సమావేశం, అనుసరించాల్సిన వ్యూహం గురించి, అలాగే రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించడానికి ఢిల్లీలో కర్ణాటక ఎంపిల సమావేశాన్ని నిర్వహించడంపై చర్చించామని ఆయన అన్నారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ గురించి ప్రశ్నించగా, దానిపై హైకమాండ్ నిర్ణయం తీసుకోవాలని సిద్ధరామయ్య అన్నారు. మీడియా నివేదికల ప్రకారం, ప్రతిపక్ష బిజెపి, జెడి(ఎస్) ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నాయని, అనేక అంశాలను లేవనెత్తుతున్నాయని, ప్రభుత్వం వాటిని దూకుడుగా ఎదుర్కొంటుందని సిఎం అన్నారు. తమ ప్రభుత్వం రైతు అనుకూలమన్నారు. రాష్ట్రంలో చెరకు, మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి పరిపాలన తీసుకున్న చర్యలను ఆయన హైలైట్ చేశారు. ఈ విషయంలో కేంద్రం తగినంతగా చేయడం లేదని ఆయన ఆరోపించారు. కాగా, ముందుగా, సిద్ధరామయ్య డిప్యూటీ సిఎం సదాశివనగర్ నివాసానికి వెళ్లారు. అక్కడ ఆయనను శివకుమార్, ఆయన సోదరుడు, మాజీ కాంగ్రెస్ ఎంపి డికె సురేష్, కునిగల్ ఎమ్మెల్యే హెచ్‌డి రంగనాథ్ (శివకుమార్ బంధువు) స్వీకరించారు. వారు కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఇందులో ఇడ్లీ నాటుకోడి చికెన్‌తో సహా వెజ్, నాన్‌వెజ్ వంటకాలు ఏర్పాటు చేశారు. శివకుమార్ శాఖాహారిగా ఉన్నప్పటికీ, చికెన్‌తో అల్పాహారంగా మాంసాహారం ఉండేలా చూసుకున్నారని సిద్ధరామయ్య చెప్పారు.



### కాశ్మీర్‌లోని ఎత్తయిన ప్రాంతాలలో
## హిమపాతం

**శ్రీనగర్ :** కాశ్మీర్‌లోని చాలా చోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రత తగ్గి ఘనీభవన స్థానం కంటే తక్కువగా స్థిరపడింది. అయితే ఈ వారం చివరిలో ఎత్తయిన ప్రాంతాలలో తేలికపాటి హిమపాతం నమోదవుతుందని వాతావరణ శాఖ అంచనా వేసిందని అధికారులు మంగళవారం తెలిపారు. శ్రీనగర్‌లో సోమవారం రాత్రి కనిష్ఠంగా మైనస్ 2.5 డిగ్రీల సెల్సియస్ నమోదైంది, ఇది మునుపటి రాత్రి మైనస్ 1.9 డిగ్రీల సెల్సియస్ నుండి తగ్గిందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, దక్షిణ కాశ్మీర్‌లోని షోపియన్ పట్టణం లోయలో అత్యంత శీతల ప్రదేశం, కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 5 డిగ్రీల సెల్సియస్ అని వారు తెలిపారు. లోయకు ప్రవేశ ద్వారం పట్టణం, ఖాజిగుండ్‌లో కనిష్ఠంగా మైనస్ 2.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది, ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారాలో పాదరసం మైనస్ 3.1 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడింది. దక్షిణ కాశ్మీర్‌లోని కోకర్‌నాగ్‌లో కనిష్ఠంగా మైనస్ 0.6 డిగ్రీల సెల్సియస్ నమోదైందని అధికారులు తెలిపారు. దక్షిణ కాశ్మీర్‌లోని పహల్గామ్ టూరిస్ట్ రిసార్ట్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 2.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కాగా, ఉత్తర కాశ్మీర్‌లోని గుల్‌మార్గ్ స్కీయింగ్ రిసార్ట్‌లో సున్నా డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం వరకు వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది, అయితే గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారుజామున ఎత్తైన ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాలలో స్వల్పంగా మంచు కురిసే అవకాశం ఉంది. శ్రీనగర్–కార్గిల్ రహదారి వెంబడి జోజిలా పాస్ సమీపంలో ఆదివారం రాత్రి స్వల్పంగా తాజా హిమపాతం నమోదైంది. డిసెంబర్ 6–7 తేదీల్లో వాతావరణం సాధారణంగా పొడిగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది, అయితే డిసెంబర్ 8న ఎత్తైన ప్రాంతాలలోని కొన్ని ప్రదేశాలలో స్వల్పంగా మంచు కురిసే అవకాశం ఉంది.

## శాంతికోసం మతాలు ఐక్యంగా వ్యవహరించాలి
హింస– అసహనాలపై పోరాటానికి
పోప్ లియో పిలుపు



**బీరూట్:** హింస–అసహనాలపై పోరాటం చేయాలని, శాంతి కోసం మతాలన్నీ ఐక్యంగా వ్యవహరించాలని పోప్ లియో–14 మతగురువులకు పిలుపు ఇచ్చారు. మానవ జాతి భవిష్యత్‌కు ఎదురయ్యే ప్రమాదాల గురించి హెచ్చరి క చేశారు. లెబనాన్‌లో శాంతి సాధన–అభివృద్ధి కోసం జ రుగుతున్న కృషిని, ప్రయత్నాలను సంరక్షించి మద్దతు ఇ వ్వాలని కోరారు. టర్కీలో పర్యటన అనంతరం పోప్–14 హోలీమాస్ సెలబ్రేషన్స్‌కోసం లెబనాన్‌కు వెళ్ళారు. బీరూ ట్ పోర్టు వద్ద 2020 ఆగస్టులో జరిగిన భారీ పేలుడు, వి ధ్వంసం సృష్టించిన ప్రదేశాన్ని సందర్శించారు. ఈ పేలుడు ఘటనలో 218 మంది మరణించగా 7,000 మంది గాయపడ్డారు. మూడు లక్షలమంది నిరాశ్రయులయ్యారు. 15 బిలియన్ డాలర్ల మేరకు ఆస్తినష్టం జరిగింది. పోప్ కొద్దిసే పు అక్కడ మౌనంగా నిలబడి ప్రార్థనలు చేశారు. బీరూట్ లో పర్యటన చేశారు. సెయింట్ ఛార్బల్ టోంబ్‌ను సందర్శించారు. లక్షమంది ప్రజలతో కలిసి సామూహిక ప్రార్థనల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు. సెంట్రల్ మార్టిర్స్ స్క్వేర్‌లో అన్ని మతాలకు చెంది న మత గురువులు, ప్రముఖులతో సమావేశమయ్యారు. 1975–90 మధ్యకాలంలో జరిగిన అంతర్యుద్ధంలో బీ రూట్ తూర్పు(క్రైస్తవ)–పశ్చిమ (ముస్లిం) ప్రాంతాలుగా వి డిపోయిన గ్రీన్‌లైన్ వద్ద ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలలో పోప్ లియో–14 మాట్లాడుతూ, రక్తపాతం అల్లకల్లోలంతో నిండిన లెబనాన్‌లో శాం తియుత సహజీవనానికి పిలుపు ఇచ్చారు. యువతరం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆశాభావ దృక్పధాన్ని కోల్పోకూడదన్నారు. ప్రపంచంలో యువతరం తమ కలలు నెరవేర్చేకోవాలని, అందుకోసం సానుకూలమైన,ఆశాభావ దృక్పధాన్ని కోల్పోకూడదని హితవు చెప్పారు. పశ్చిమ ఆసియాలో సంఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ, మానవతావాదంపై మానవాళికున్న ఉమ్మడి దృక్పథం ఆశలు రేకెత్తించిందని అన్నారు. పశ్చిమ ఆసియాలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న హింసాత్మక పరిణామాలను ప్రపంచం దీనముఖంతో పరిశీలిస్తూ ఉండిపోయిందని, దేవుడు మానవాళికి ఇచ్చిన శాంతి అనే గొప్ప వరాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ఏ మత ఆలయంలో గంట మోగినా ఎక్కడ ప్రార్థన జరిగినా మానవాళి అభ్యున్నతి కోసం ఆ ప్రార్థనలన్నీ ఏకం కావాలన్నారు. సిరియాలో అలవైట్–డ్రూజ్ వర్గాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ సమావేశంలో ఈ రెండు వర్గాలకు చెందిన ప్రతినిధులు ప్ర సంగించారు. సమాజానికి శాంతి, గౌరవం, రక్షణ అవసరమని అలవైట్ ప్రతినిధి మొమ్మద్ సలేహ్ అన్నారు. మధ్యప్రాచ్యంలో ఉన్న అలవైట్ సమాజాన్ని ప్రార్థనల సమయం లో గుర్తుంచుకోవాలని సవినయంగా పోప్‌కు ఆయన విజ్ఞ ప్తి చేశారు. మత గురువుగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పురాతన బైబిల్ భూమిలో పోప్ తన మొదటి పర్యటన చేశారు.

## చొరబాటుదారులకు 'రెడ్‌కార్పెట్' పరవాలా?
• రోహింగ్యాల అక్రమ వలసలపై 'సుప్రీంకోర్టు' గరం
అదృశ్యమైన రోహింగ్యాలను తీసుకురావాలని దాఖలు చేసిన పిటిషన్‌పై సిజెఐ సూర్యకాంత్ బెంచ్ పదునైన వ్యాఖ్యలు • 16కు విచారణ వాయిదా

**న్యూఢిల్లీ :** భారతదేశంలో నివసిస్తున్న రోహింగ్యాల చట్టపరమైన స్థితిని మంగళవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశ పౌరులు పేదరికంతో సతమతం అవుతుండగా 'చొరబాటుదారులకు' 'రెడ్‌కార్పెట్ స్వాగతం' ఇవ్వాలా అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఇక్కడ అధికారుల కస్టడీ నుంచి కొంతమంది రోహింగ్యాలు అదృశ్యమయ్యారని ఆరోపిస్తూ హక్కుల కార్యకర్త రీటా మంచంద దాఖలు చేసిన హెబియస్ కార్పస్ (వ్యక్తిని తీసుకురావాలని) పిటిషన్ విచారణ సందర్భంగా ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పదునైన వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ ఈ నెల 16కు వాయిదా పడింది. మే నెలలో కొంతమంది రోహింగ్యాలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ప్రస్తుతం వారెక్కడ ఉన్నారనే విషయమై తమకు ఎలాంటి సమాచారం లేదని పిటిషన్ తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు. 'వారికి భారతదేశంలో ఉండటానికి చట్టపరమైన హోదాలేకపోతే, మీరు చొరబాటుదారు అయితే, ఉత్తర భారతదేశం వైపు మనకు చాలా సున్నితమైన సరిహద్దు ఉంది. ఎవరైనా చొరబాటుదారు వస్తే మీకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి మేము వారికి రెడ్ కార్పెట్ స్వాగతం పలకాలా' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అడిగారు. వారిని వెనక్కి పంపించడంలో సమస్య ఏమిటి?' అని కూడా సిజెఐ ప్రశ్నించారు. భారతదేశం చాలా మంది పేదలు ఉన్న దేశం అని, మనం తప్పకుండా వారిపై దృష్టి పెట్టాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు. 'ముందుగా మీరు లోపలకు ప్రవేశిస్తారు. చట్టవిరుద్ధంగా సరిహద్దు దాటుతారు. మీరు సొరంగం తవ్వుతారు. కంచె దాటి భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తారు. అప్పుడు మీరు చెబుతారు. ఇప్పుడు నేను ప్రవేశించానని. మీ చట్టాలు నాకు వర్తిస్తాయి. మేం అర్హులం. నాకు ఆశ్రయం పొందే హక్కు ఉంది. నా పిల్లలు ఇక్కడ విద్యకు అర్హులు. మనం చట్టాన్ని ఈ తరహాలోనే సాగదీయడాన్ని మనం కోరుకుందామా?' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించారు. 2020లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రస్తావించిన పిటిషనర్ రోహింగ్యాలను ఈ ప్రక్రియ ప్రకారం మాత్రమే బహిష్కరించాలని కోరారు. మన దేశంలో పేదలు కూడా ఉన్నారని, వారు ఈ దేశ పౌరులుగా ఉన్నారని, అలాంటప్పుడు వారు కొన్ని ప్రయోజనాలు, సౌకర్యాలు పొందేందుకు అర్హులు కాదా?, మనం వారిపై ఎందుకు దృష్టి పెట్టకూడదని?, ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవేశించినట్లయితే మనం వారికి థర్డ్ డిగ్రీ పద్ధతులు వర్తింపచేయకూడదా?, మీరు హెబియస్ రిట్ వేసి వారిని తిరిగి వెనక్కి తీసుకురావాలని కోరుతున్నారా? అంటూ సిజెఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. స్వదేశానికి తిరిగి పంపించాలని కోరితే అది లాజిస్టికల్ సమస్యలకు దారితీయవచ్చని ధర్మాసనం పేర్కొంది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ఈ పిటిషన్‌ను బాధిత వ్యక్తి దాఖలు చేయలేదని, పిటిషనర్‌కు అలాంటి పిటిషన్‌ను దాఖలు చేయడానికి ఎలాంటి అర్హత లేదని ధర్మాసనానికి తెలియజేశారు. జులై 31న దేశంలోని కొన్ని రోహింగ్యాలకు సంబంధించిన పిటిషన్ల బ్యాచ్‌ను విచారిస్తున్న సుప్రీంకోర్టు రోహింగ్యాలకు సంబంధించిన కేసుల్లో మొదట పరిష్కరించాల్సిన ప్రధాన సమస్య వారు శరణార్థులా లేదా అక్రమ ప్రవేశకులా అనే అంశమని పేర్కొంది. అది నిర్ణయించిన తర్వాత పర్యవసానంగా ఇతర సమస్యలు కూడా తలెత్తవచ్చని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది. రోహింగ్యాలకు సంబంధించిన పిటిషన్లలో పరిశీలన కోసం తలెత్తిన విస్తృత సమస్యలను ధర్మాసనం పరిగణనలోనికి తీసుకుంది. ధర్మాసనం ఈ పిటిషన్లను మూడు గ్రూపులుగా విభజించింది. ఒకటి రోహింగ్యాలకు సంబంధించినది, మరొకటి రోహింగ్యాలకు సంబంధించినది కాదని, మరొకటి వేరే విషయానికి సంబంధించినదని వర్గీకరించింది. మూడు గ్రూపుల విషయాలను విడివిడిగా నిర్ణయిస్తామని, వరుసగా బుధవారాలలో ఈ పిటిషన్ల విచారణను నిర్ణయిస్తామని తెలిపింది. అక్రమంగా ప్రవేశించిన వారి విషయంలోనూ, వారిని బహిష్కరించే రాష్ట్రాల బాధ్యతపై అది సూత్రాలను మాత్రమే నిర్దేశించగలదని ధర్మాసనం సూచించింది. పిటిషనర్ మహమ్మద్ ఇస్మాయిల్, ఇతరులు ప్రస్తావించిన విషయం ప్రామాణికతను ధర్మాసనం ప్రశ్నించింది. రోహింగ్యాల బహిష్కరణను నిలిపివేయడానికి నిరాకరించింది. గతంలో ఇలాంటి ఉపశమనాన్ని కోర్టు తిరస్కరించిందని వివరించింది. మే 8న రోహింగ్యా శరణార్థి దేశం భారత చట్టాల ప్రకారం విదేశీయులని తేలితే, వారిని బహిష్కరిస్తామని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది.

ప్రజాపక్షం
బుధవారం, 03 డిసెంబరు

# 'సర్'పై స్తంభించిన పార్లమెంటు


భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) ఏకపక్షంగా, నిరంకుశంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రక్షాళన (ప్రత్యేక ముమ్మర రివిజన్ – ఎస్ఐఆర్) కార్యక్రమం రెండ్రోజులుగా పార్లమెంటు ఉభయసభల సమావేశాలను స్తంభింపజేసింది. 'ఓట్ చోరీ'గా ఆరోపించబడుతున్న ఎన్నికల కమిషన్ నిర్వాకాన్ని తక్షణం చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబడుతున్నాయి. ప్రభుత్వం తమకు అభ్యంతరం లేదంటూనే ఇప్పుడు కాదు తర్వాత చూదాం అంటున్నది. సభా వ్యవహారాల సలహా కమిటీ తొలి సమావేశంలో ప్రభుత్వం 'వందేమాతర గీతం–150 ఏళ్లు'పై చర్చను ప్రతిపాదించిందని, అందువల్ల దానికన్నా ముందు 'సర్'పై చర్చ కూడదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు అడ్డంగా వాదించారు. వందేమాతరంపై చర్చను ప్రతిపక్షాలు వ్యతిరేకించనప్పుడు దానికి పోటీపెట్టటంలోనే ప్రభుత్వ ఉద్దేశం వెల్లడవుతున్నది. వందేమాతరం జాతీయ మనోభావాలతో ముడిపడివున్న అంశం. ఆ గీతం రచన 150వ వార్షిక దినాన్ని ప్రభుత్వం ఘనంగానే జరిపింది. 'సర్' వర్తమానానికి సంబంధించి వేధిస్తున్న సమస్య. ఎన్నికల ఫలితాలను పాలకపార్టీకి అనుకూలంగా తారుమారుచేస్తున్న ప్రక్రియగా ప్రతిపక్షాలు ఆందోళన చేస్తున్న సమస్య. ప్రతిపక్షాల పోరాటాన్ని త్రోసిరాజని బిహార్‌లో నిర్వహించిన 'సర్' అనేక లక్షలమంది ఓట్లు తొలగించింది, చేర్పులు చేసింది. ఇది ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపిందని అనుమానిస్తున్నాయి. ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో – కొద్ది మాసాల ముందుగా ఇసిఐ ఈ కార్యక్రమం చేపట్టటం, తమ నివాసార్హతను, పౌరసత్వాన్ని డాక్యుమెంట్ల ఆధారంగా నిరూపించుకునే బాధ్యతను పౌరులపై పెట్టటమే దాని ఉద్దేశ్యాలను శంకింపజేస్తున్నది. బిహార్ అనుభవంతో ఇసిఐ 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత రాష్ట్రాల్లో 'సర్'కు ఉత్తర్వు చేసింది. వాటిలో 4 రాష్ట్రాలు, 1 యుటిఐ 2026 తొలి అర్ధభాగంలో ఎన్నికలకు వెళ్లనున్నాయి. అది విధించిన టైమ్ షెడ్యూలును పాటించలేక కేరళ, బెంగాల్ రాష్ట్రాల్లో పలువురు బూత్ లెవల్ పోలింగ్ ఆఫీసర్లు (బిఎల్ఒలు) మరణించారు. వ్యవధి పొడిగించాలని పశ్చిమ బెంగాల్ బిఎల్ఒలు పెద్దగా ఆందోళనకు దిగాక, పార్లమెంటు కూడా ప్రారంభమవుతున్న సందర్భంలో ఇసిఐ మేలుకుని ఒక వారం రోజులు వ్యవధి పొడిగించింది. కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో ఇసిఐ పై కేసులు వేశారు.

పార్లమెంటు శీతాకాల సమావేశాలను కేవలం డిసెంబర్ 1 నుంచి 19వ తేదీవరకు మాత్రమే నిర్వహిస్తూ, 15సిట్టింగ్‌లకు పరిమితం చేసింది ప్రభుత్వం. 11 ముఖ్యమైన బిల్లులు ఆమోదించాలని ఎజండాగా పెట్టుకుంది. అటువంటప్పుడు ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న 'సర్' చర్చను వెంటనే చేబట్టి తమ ఎజండాలోకి వెళ్లవచ్చు. చర్చ లేకుండానే – గందరగోళం మధ్య బిల్లులకు ఆమోదం పొందే అలవాటునే ప్రభుత్వం ఇప్పుడూ అనుసరించవచ్చు.

ఇసిఐ రాజ్యాంగం ద్వారా ఏర్పడిన స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ. ఓటర్ల జాబితాల సవరణ, సజావుగా, స్వేచ్ఛగా ఎన్నికల నిర్వహణ దాని బాధ్యత. ఎన్నికల షెడ్యూలు ప్రకటించాక యావత్ అధికార యంత్రాంగం దాని అజమాయిషీలో పనిచేస్తుంది. నిజాయితీ, నిష్పాక్షికత దానికి భూషణాలు. అదే ప్రశ్నార్ధకమవుతున్నప్పుడు మొత్తం ఎన్నికల ప్రక్రియ క్రమంగా విలువ కోల్పోతుంది. ఒకనాటి ఏకసభ్య ఎన్నికల కమిషన్‌ను త్రిసభ్య కమిషన్‌గా మార్చి, ప్రజాస్వామ్యయుతం చేయాల్సిన కమిషనర్‌ల నియామకాన్ని మోదీ ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకుంది. ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రతిపక్ష నాయకుడితో కూడిన ఎంపిక కమిటీ నుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి ప్రధానికి తోడుగా హోంమంత్రిని చేర్చుతూ చట్టం చేయటంలోనే మోదీ ప్రభుత్వ స్వార్ధచింతన సంశయాత్మకం.

హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి వారు ఓటర్ల జాబితాలను తారుమారుచేసిన ఉదంతాలను ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధి సంపూర్ణ ఆధారాలతో దేశం ముందు ఉంచినా ప్రధాన ఎన్నికల కమిషన్ దర్యాప్తు జరిపించి నిజాలు నిగ్గుతేల్చలేదు. తదుపరి బిహార్ వంతు. ఇప్పుడు తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లలో ప్రభుత్వాల మార్పుపై గురిపెట్టి 'సర్'ను ఆదేశించారని ప్రతిపక్షాలు అనుమానిస్తున్నాయి. ఎన్నికలు రెండు–మూడు సంవత్సరాల దూరంలో ఉన్న రాష్ట్రాల్లో ఇసిఐ 'సర్' నిర్వహించుకుంటూ క్రమంగా దేశం మొత్తాన్ని కవర్ చేయవచ్చు. అప్పుడు తగిన వ్యవధి ఉంటుంది – ఓటర్లపై, బిఎల్ఒలపై ఒత్తిడి ఉండదు. తద్విరుద్ధంగా ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల్లో ఐదారు మాసాల ముందు ఈ ప్రక్రియ ప్రారంభించటమే అనుమానాలకు తావిస్తున్నది. దానిపై తమ అభిప్రాయాలతో ప్రభుత్వాన్ని పార్లమెంటులో నిలదీసే హక్కు ప్రతిపక్షాలకు ఉంది. ప్రభుత్వం సమయం వృధాచేయకుండా సానుకూలంగా స్పందించాలి. వందేమాతరం, సర్‌లపై చర్చపై ప్రభుత్వం–ప్రతిపక్షం అంగీకారానికి రావటం శుభపరిణామం.

# నయా ఫాసిజం దిశగా భారతదేశ పాలన



మన్నవ హరిప్రసాద్
అడ్వొకేట్
8247728296

ఈనాడు గతంలో ఎన్నడూ లేనంతగా ఫాసిజంపైన చర్చ సాగుతున్నది. అదేవిధంగా భారత రాజ్యాంగం భారత పౌరులకు ఇచ్చిన హక్కులపై చర్చ సాగుతున్నది. దానికి కారణం గత 11 సంవత్సరాలకు పై గా భారతదేశాన్ని పరిపాలిస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వం అనుసరిస్తున్న హిందుత్వ మత తత్వ, కార్పొరేటు కాషాయ విధానాలు కారణం.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ గా 1949 నవంబరు 26వ తేదీన భారత రాజ్యాంగ సభ ఆమోదించిన రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగమైన భారతీయ జనతా పార్టీ గత 11 సం.గా నిరాటంకంగా మూడోసారి అధికారంలోకి రావడం జరిగింది. రాజ్యాంగం ఆమోదించిన మరుసటి రోజే అంబేద్కర్‌చే రూపొందించబడిన భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తున్నామని, త్రివర్ణ జాతీయపతాకాన్ని వ్యతిరేకిస్తున్నామని, కాషాయ జెండా జాతీయ జెండాగా ఉండాలని ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక ఆర్గనైజర్‌లో, అంతేకాకుండా భారత రాజ్యాంగంగా 'మనుస్మృతి' ఉండాలని ఉంది అని రాసింది. స్వతంత్ర పోరాటంలో ఎటువంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్ బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఏమీ అనలేదు. దాని నాయకుడు వీర్ సర్కార్ ప్రభుత్వానికి అనేక లొంగుబాటు ఉత్తరాలు రాశాడు. లౌకిక విలువల కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీని హత్య చేసింది. త్రివర్ణజెండాను వాజ్‌పేయ్ ప్రధానమంత్రిగా అయినంతవరకు ఎగురవేయలేదు. ప్రజల మత విశ్వాసాలను నిరంతరం రెచ్చగొట్టి అయోధ్యలో రామ జన్మభూమి రథయాత్రతో అమాంతం సీట్లు పెంచుకున్న బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే హిందుత్వం వైపు ప్రయాణం కట్టింది.

భారత రాజ్యాంగ పరిషత్ 1949 నవంబరు 26న ఆమోదించిన 'భారత రాజ్యాంగం' భారత ప్రజలు తమకు తాము సమర్పించుకున్నారని ప్రవేశికలో రాసుకోవడం జరిగింది. భారత రాజ్యాంగం సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర, గణతంత్ర రాజ్యమని పొందుపరచుకోవటం జరిగింది. లౌకిక, సామ్యవాద అనే పదాలు 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో చేర్చడం జరిగింది. పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక రాజకీయ న్యాయం, ఆలోచన, వ్యక్తీకరణ, నమ్మకం, విశ్వాసం పట్ల స్వేచ్ఛ, పౌరులందరికీ హోదా, అవకాశాలు అన్నిటిని కూడా అందరకు సమానంగా ఇవ్వబడతాయి. ప్రతివ్యక్తికి హుందాతనానికి, జాతి ఐక్యతకు సౌభ్రాతృత్వానికి, రాజ్యాంగం హామీ ఇస్తున్నది. భారత రాజ్యాంగం పౌరులందరికీ ప్రాథమిక హక్కులు ఇచ్చింది. భారతదేశ పాలన ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా ఉండాలని రాజ్యాంగంలో స్పష్టపరుచుకున్నాం.

కొన్ని ప్రాథమిక హక్కులు, జీవించే హక్కు, స్వేచ్ఛ, భావ స్వాతంత్రం, నమ్మకాలపట్ల విశ్వాసం, వాటికి సంబంధించి ఏపరిస్థితుల్లో ఉల్లంఘించరాదని భారత అత్యున్నత న్యాయస్థానం ఏకే గోపాలన్ కేసులో(1950,AIR,SC 27) స్పష్టపరిచింది. భారత రాజ్యాంగంలో ఆర్థికల్స్ 14 నుండి 18 వరకు పౌరుల సమానత్వ హక్కును వివరించాయి. అదేవిధంగా 19 నుండి 22 వరకు పౌరుల స్వేచ్ఛగురించి సవివరంగా వివరించాయి. ఆర్టికల్ 14 రాజ్యాంగం ముందు అందరూ సమానమే అని, అందరికీ చట్టప్రకారంగా సమాన హక్కులు ఇవ్వబడతాయని, వ్యక్తి స్వేచ్ఛకు, వ్యక్తి స్వాతంత్ర్యానికి, వ్యక్తి రక్షణకు ఆర్టికల్ 21 రక్షణ నిచ్చింది. ఆర్టికల్ 22 ప్రకారం కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మినహా ఏ వ్యక్తిని అక్రమ నిర్బంధం, అరెస్టు చేయరాదని స్పష్టం చేసింది. వారి ఇష్టమైనటువంటి మత స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని ఆర్టికల్స్ 25 నుండి 28 వరకు స్పష్టంగా రాజ్యాంగంలో పొందుపరిచారు. మాట్లాడే భావ వ్యక్తీకరణ హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, సభలను నిర్వహించుకునే హక్కు, ఉద్యమించే హక్కు, నివసించే హక్కు, ఇష్టమైన చట్టబద్ధమైన వృత్తి చేసుకునే హక్కు రాజ్యాంగంలోని ఆర్థికలు 19 స్పష్టపరిచింది. 1978లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా లౌకిక, సామ్యవాద పదాలను రాజ్యాంగ ప్రవేశికలో చేర్చారు. అదేవిధంగా ప్రాథమిక హక్కుల నుండి ఆస్తి హక్కును ఆర్టికల్ 19 క్లాస్ 1, ఉప క్లాసు(యఫ్) నుండి తొలగించారు. ఆర్టికల్ 31లో చెప్పినటువంటి ఆస్తి హక్కును పూర్తిగా తొలగించి కేవలం చట్టబద్ధమైన హక్కుగానే ఉంచారు.

మన రాజ్యాంగంలో ఇన్ని మంచి విషయాలు ఉండగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్లు రాజ్యాంగం అమలు చేసేవారు చెడ్డవారైతే రాజ్యాంగం చెడ్డగానే ఉంటుందని మనకు గత 11 సంవత్సరాల నుండి నరేంద్ర మోదీ పాలన వలన తెలుస్తున్నది.

అధికారంలోకి 2014లో రావటానికి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ చేయని వాగ్దానమంటూ లేదు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తానన్నాడు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బును తీసుకొచ్చి ఒక్కొక్కరి బ్యాంకు ఎకౌంట్లో పది లక్షలు జమచేస్తానన్నాడు అన్ని రకాల పంటలకు మద్దతు ధర ఇస్తానన్నాడు. తెలంగాణ నుండి విడిపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పది సంవత్సరాల పాటు ప్రత్యేక హోదా ఇస్తానన్నాడు. ఒకటి ఏమిటి ఏ రాష్ట్రానికి వెళితే ఆ రాష్ట్రానికి సంబంధించిన సకల సమస్యలను పరిష్కరిస్తానని చేయని వాగ్దానం అంటూ లేదు.

కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండు దఫాలుగా అంచెలంచెలుగా రాజ్యాంగ స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ వచ్చాడు. రాజకీయ ప్రత్యర్థులపై ఇడి, ఇన్కమ్ టాక్స్, మొదలకు డిపార్ట్మెంట్లను ప్రయోగించి ప్రత్యర్థులను లొంగదీసుకుంటున్నారు. జీఎస్టీ(వస్తువుల సేవల పన్ను) పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలను మున్సిపాలిటీల స్థాయికి దిగజార్చాడు. కోటి ఉద్యోగాల మాటే లేదు. నల్ల డబ్బును వెలికి తీస్తానని నోట్ల డిమానిటైజేషన్ పేరుతో ధనికుల నల్లడబ్బును తెల్ల డబ్బుగా మార్చుకోవటానికి అవకాశం ఇచ్చాడు. రెండవసారి అధికారంలోకి వచ్చిన తరువాత మరింతగా రెచ్చిపోయి పౌరసత్వ సవరణ చట్టం (సిఏఏ), జాతీయ ప్రజా పట్టిక(యన్‌పిఆర్), జాతీయ పౌర పట్టిక( ఎన్‌సిఆర్), జమ్మూ కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పించిన 370,35ఎ ఆర్టికల్స్ రద్దు, కార్పొరేట్లకు వ్యవసాయరంగాన్ని అప్పజెప్పే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకురావడం, వందల సంవత్సరాలుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లకు తీసుకొచ్చి అమలుకు పూనుకోవడం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్), ఓట్ల చోరీ, ప్రశ్నించే వారిపై ఉపా (యుఏపిఏ)లాంటి నల్ల చట్టాలను ప్రయోగించడం, జాతీయ బ్యాంకులను ప్రైవేటు చేయడం, ఎల్ఐసి ని ఆశ్రిత కార్పోరేట్ ఆదాయానికి అప్పజెప్పటం, రైల్వేలు, పెట్రోలు, ఇంధన వనరులు, విమానాలు, విమానాశ్రయాలు, విశాఖ ఉక్కు లాంటి పరిశ్రమలు, ఒకటి ఏమిటి అన్ని రంగాలను అంబానీ, ఆదాని లాంటి ఆశ్రిత కార్పొరేట్ పెట్టుబడిదారులకు భారత ఆర్థిక వ్యవస్థను అప్పచెబుతున్నారు. భారత రాజ్యాంగంలో 'ప్రవేశిక' లో చెప్పిన లౌకిక రాజ్యాంగ వ్యవస్థ అనే విషయాన్ని త్రోసిపుచ్చి సాక్షాత్తు ప్రధానమంత్రి అయోధ్యలో రామాలయం నిర్మాణం ప్రారంభోత్సవములు అంతా తానే నిర్వహించాడు. నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని కూడా ప్రక్కన పెట్టాడు. మావోయిస్టుల ఏరివేత పేరుతో ఛత్తీస్ఘడ్‌లో మావోయిస్టు నాయకులను, కార్యకర్తలను, ఎన్కౌంటర్ల పేరుతో 400 మంది మావోయిస్టులను చంపారు. ఈ లెక్క అంత సరైనది కాకపోవచ్చు. ఉజ్జాయింపు మాత్రమే. ప్రభుత్వ లెక్కల ప్రకారం గత 25 సంవత్సరాలలో 6140 మంది నక్సలైట్లను చంపినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. హోం మంత్రి అమిత్ షా 2026 మార్చి చివరి నాటికి మావోయిస్టు రహిత భారతదేశం ఏర్పడుతుందని పదేపదే ప్రకటిస్తున్నారు. ఛత్తీస్‌గడ్, ఆంధ్ర, ఒరిస్సా, బెంగాల్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లోని అటవీ ప్రాంతాల్లోని సహజ వనరులను బాక్సైట్, అల్యూమినియం, ఐరన్ మొదలగు సహజ వనరులను కార్పొరేట్ పెట్టుబడిదారులకు అప్పగించటమే ప్రభుత్వ పనిగా ఉన్నది. భారత రాజ్యాంగాన్ని ప్రతి నిమిషం ఉల్లంఘిస్తున్నారు. మావోయిస్టులను అణచివేసే పేరుతో రాజ్యం గిరిజనులను, వారికి మద్దతుగా ఉన్నవారిని కాల్చి చంపుతున్నది. హక్కుల కార్యకర్తలను 'ఉపా'లాంటి చట్టాలు పెట్టి నిర్బంధిస్తున్నది. స్టాన్ స్వామి లాంటి వారు జైల్లోనే మగ్గి చనిపోయారు.

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఇటలీ ముస్సోలినీ, జర్మన్ హిట్లర్‌ల ఫాసిజాన్ని సాంప్రదాయ ఫాసిజమని, నేడు ప్రపంచంలో వివిధ దేశాల్లో ఉన్నటువంటిది నయా ఫాసిజమని వ్యాఖ్యానిస్తున్నారు. భారతదేశంలోని పాలన కూడా నేడు నయా ఫాసిజం రూపం తీసుకున్నదని, ప్రపంచంలో ఎక్కడైనా సరే ఫాసిజం యొక్క ప్రధాన లక్షణం మెజార్టీ మతాన్ని ఆధారం చేసుకుని, ఆమతాన్ని ఆశ్రయించి, జాతీయోన్మాదాన్ని ప్రజల మధ్య రెచ్చగొట్టి, మైనార్టీ మతాలపై విద్వేషాన్ని రగిల్చి, మెజార్టీ శ్రామిక ప్రజలను దోపిడీ చేస్తూ, వారి బ్రతుకులకు కారణం పూర్వజన్మ సుకృతం అనే దైవచింతన భావన విశిష్ట ప్రచారంలో పెట్టి, శ్రామికుల సృష్టించే అదనపు విలువే 'పెట్టుబడి' అనే అంశాన్ని మభ్యపెట్టి పెట్టుబడిదారులకు, ఆశ్రిత పెట్టుబడిదారులకు, కార్పొరేట్ పెట్టుబడిదారులకు సంపదను వారి వద్ద కేంద్రీకరించడమే నయా ఫాసిస్టు లక్షణం అని రాజకీయార్థిక శాస్త్రవేత్తలు నిర్వచిస్తున్నారు.

గత 11 సంవత్సరాలుగా ఈ దేశాన్ని భారతీయ జనతా పార్టీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా పాలన సాగిస్తున్నది. భారతీయ జనతా పార్టీ అనేది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం యొక్క రాజకీయ విభాగం. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లేదా ఆర్ఎస్ఎస్ తనకు తాను సాంస్కృతిక సంస్థనని చెప్పుకుంటుంది. 1925 సెప్టెంబరు 27న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని కేశవ్ బలరాం హెగ్డేవార్ స్థాపించారు. దాని ప్రధాన కేంద్రం నాగపూర్. హెగ్డేవారు రాజకీయ గురువు డాక్టర్ బి ఎస్ మూంజె. దేశస్థి ఋగ్వేద బ్రాహ్మణ కుటుంబంలో బి ఎస్ మూంజే (బాలకృష్ణ శివరాం మూంజే) బిలాస్ పూర్‌లో జన్మించారు. బాల గంగాధర్ తిలక్ మరణానంతరం కాంగ్రెస్ పార్టీని వీడాడు. హిందూ మహా సభను స్థాపించాడు. 1927 నుండి 1937 వరకు అఖిల భారత హిందూ మహాసభ అధ్యక్షుడుగా ఉన్నాడు. 1937లో వినాయక దామోదర్ సావర్కార్ కు హిందూ మహాసభ బాధ్యతలు అప్పజెప్పాడు. నాగపూర్‌లో డైలీ మహారాష్ట్ర అనే మరాఠీ వార్తాపత్రికను కూడా నడిపాడు. ముస్లింలు మెజార్టీ ఉన్న ప్రాంతాల్ని ప్రోవిన్సులుగా ఏర్పాటు చేయడానికి వ్యతిరేకించాడు. డాక్టర్ బి.ఎస్.మూంజె 1930, 1931 సంవత్సరాల్లో లండన్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశాల్లో గాంధీ మహాత్ముడు ప్రబోధించిన లేదా వాదించిన లౌకికతత్వం మరియు అహింసా సిద్ధాంతాలను గట్టిగా వ్యతిరేకించాడు. 1931లో ఇటలీ ఫాసిస్టు నియంత ముస్సోలినీ ఏర్పాటుచేసిన అకాడిమియా ఫర్నెసి, ఇతర సైనిక స్కూళ్లను సందర్శించి వాటిని అధ్యయనం చేసి వచ్చాడు. ఇటలీ నుండి ఇండియాకు వచ్చి ప్రభుత్వాన్ని బలపరిచే పారా మిలిటరీ స్కూల్లను భోన్సాలోనూ, నాశిక్‌లోను 1937లో స్థాపించాడు.

ఆర్ఎస్ఎస్ లక్ష్యం భారతదేశాన్ని హిందూ దేశంగా మార్చాలని. అందుకు తన రాజకీయ సాధనమైన భారతీయ జనతా పార్టీ ద్వారా ఎన్నికల వ్యవస్థను ఉపయోగించుకొని ఫాసిస్టు తరహా పరిపాలన సాగిస్తున్నది. దీనినే మనం నయా ఫాసిజం అంటున్నాం. ఈ దేశంలో ఉన్న హిందుయేతర మతాలు ముస్లింలు, క్రైస్తవులు, రాజకీయంగా కమ్యూనిస్టులు వారి ప్రధాన శత్రువులు. జైన, బౌద్ధ, సిక్కు మతాలను వారు హిందూమతంలో అంతర్భాగంగా భావిస్తారు. భారతదేశం భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న జాతులు, భిన్న సంస్కృతులు, భిన్న భాషలు కలిగిన దేశం. ఫాసిజం నుండి భారత రాజ్యాంగాన్ని, శ్రామిక వర్గాన్ని, రక్షించుకోవాల్సిన కర్తవ్యం, అవసరం మన భుజస్కందాల మీద ఉన్నది.

# ఒత్తిడి రాజకీయాలతో ప్రజాస్వామ్య స్ఫూర్తి కనుమరుగు

స్థానిక సంస్థల ఎన్నికలంటేనే గ్రామస్థాయిలో ప్రజాస్వామ్యానికి పండుగ. అయితే, ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ వ్యవస్థను కొందరు ప్రభావశీల వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం వాడుకుంటూ, బలహీన అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా విత్‌డ్రా చేయిస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని ఫలితంగా, గ్రామ స్వరాజ్యం అనే మూల సిద్ధాంతమే ఇప్పుడు పెద్ద ప్రశ్నార్థకం అవుతోంది.

సాధారణంగా, నామినేషన్ల ఉపసంహరణ అవకాశం, పోటీ చేయాలనే ఉద్దేశం లేనివారికి లేదా అనివార్య కారణాల వల్ల తప్పుకోవాలనుకునే వారికి ఒక వెసులుబాటు. కానీ, ఇక్కడ ఉద్దేశం మంచిదైనా, అమలు తీరు మాత్రం గందరగోళంగా మారిందనేది ఓటర్ల అభిప్రాయం. 'ఎన్నికల్లో అందరికీ సమాన అవకాశం ఉండాలి. కానీ ఇప్పుడు డబ్బు, అంగబలం ఉన్నవారికే విజయం దక్కుతోంది. ఉపసంహరణ గడువు ముగిసే వేళ అసలు నిజాలు బయటకు రావట్లేదు' అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామినేషన్ల ఘట్టం ముగిసిన కొద్ది రోజుల్లోనే, ఊహించని విధంగా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ నుంచి వెనక్కి తగ్గడం గ్రామాల్లో చర్చనీయాంశమైంది. ఈ సామూహిక ఉపసంహరణల కారణంగా అనేక గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దీనివల్ల, ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన ''ఓటు హక్కు'' కు విలువ లేకుండా పోతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రజలకు ప్రత్యామ్నాయ ఎంపికలు లేకుండా పోతున్నాయి. ప్రస్తుత అభ్యర్థులపై వ్యతిరేక అభిప్రాయాలు ఉన్నా, తమకు నచ్చని నాయకుడిని ఎన్నుకునే పరిస్థితి లేకపోయినా, ఓటువేసే అవకాశం కోల్పోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తోంది. 'భయంతోనా? ఒత్తిడితోనా? లేక డీల్‌తోనా? ఎవరికీ అర్థం కావడం లేదు' అని ప్రజలు ఒక్క కంఠంగా ప్రశ్నిస్తున్నారు.

ఈ బలవంతపు ఉపసంహరణలు కేవలం తాత్కాలిక ఎన్నికల సమస్య మాత్రమే కాదు, గ్రామ పాలన యొక్క దీర్ఘకాలిక నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఒత్తిడికి లొంగి గెలిచిన అభ్యర్థులు ప్రజలకు జవాబుదారీగా ఉండకపోవచ్చు, దీనివల్ల గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కుంటుపడే అవకాశం ఉంది. ఎన్నికల అధికారులు మాత్రం ఉపసంహరణ ప్రక్రియ మొత్తం క్రమబద్ధంగానే జరుగుతుందని ప్రకటిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, వెల్లువెత్తుతున్న ఆరోపణలు చూస్తుంటే, వారి వివరణపై ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడాలంటే, ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకోవాలి. ఉపసంహరణ ఫారమ్ సమర్పించే సమయంలో అభ్యర్థి వీడియో రికార్డింగ్‌తో కూడిన ప్రమాణ స్వీకారం (Affidavit) తీసుకోవడం, ఒత్తిడికి గురైన అభ్యర్థులు గోప్యంగా ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయడం వంటి కట్టుదిట్టమైన చర్యలను అమలు చేయాలి. ఎన్నికల నిబంధనలను అతిక్రమించి అభ్యర్థులను బెదిరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే, గ్రామస్థాయి రాజకీయాల్లో పారదర్శకత నెలకొంటుంది. లేదంటే, 'గ్రామ స్వరాజ్యం' అనేది కేవలం పుస్తకాల్లోని పదానికే పరిమితమైపోయే ప్రమాదం ఉంది.

వెంకగారి భూమయ్య,
9848559863

# సమాన హక్కుల కోసం ఒక రోజు

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ప్రతి సంవత్సరం డిసెంబరు 3న జరుపుకుంటారు. 1981లో ఐక్యరాజ్యసమితి ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది. ప్రత్యేక అవసరాలు ఉన్న వ్యక్తుల హక్కులు, గౌరవం, వారు ఎదుర్కొనే సమస్యలపై ప్రపంచానికి అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ సంవత్సరం థీమ్ సామాజిక పురోగతికి వికలాంగుల చేర్పు, అంటే ప్రతి వ్యక్తికి సమాజంలో సమాన అవకాశాలు కల్పించడం. ఈ సంవత్సరం కార్యక్రమాలు దోహా, ఖతార్‌లో జరిగిన సామాజిక అభివృద్ధి ప్రపంచ సదస్సు నుంచి ప్రేరణ పొంది మరింత విస్తృతంగా నిర్వహించబడుతున్నాయి. ఆ సదస్సులో ప్రపంచ నాయకులు అందరినీ చేర్చుకునే న్యాయమైన సమాజాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. దేశాల స్థిర అభివృద్ధికి ప్రత్యేక అవసరాలు ఉన్న వ్యక్తులకు సమాన అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యమని వారు గుర్తు చేశారు. అయితే వాస్తవంగా, ప్రపంచవ్యాప్తంగా వారి జీవితాల్లో ఇంకా అనేక అవరోధాలు ఉన్నాయి. విద్య, ఉపాధి, వేతనాలు, సహాయక పరికరాలు, చేరుకోలేని వాతావరణం వంటి సమస్యలు రోజూ వారికి అడ్డంకులుగా మారుతున్నాయి. కాబట్టి పేదరికాన్ని తగ్గించడం, మంచి ఉపాధికి అవకాశాలిచ్చే విధానాలు తయారుచేయడం, సమాజంలో అందరికీ సమాన స్థానం కల్పించడం అత్యవసరం.




డిసెంబరు 3న న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం జరుగుతుంది. ఇందులో సభ్యదేశాల ప్రతినిధులు, UN అధికారులు, హక్కుల కోసం పనిచేసే ఉద్యమకారులు, యువజనాలు పాల్గొని వారికి ఎదురయ్యే సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు కనుగొనే దిశగా చర్చిస్తారు.

2006లో ఆమోదించబడిన వ్యక్తుల వికలాంగుల హక్కుల కన్వెన్షన్ (Convention on the Rights of Persons with Disabilities) కూడా ప్రతి వ్యక్తి రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో సమాన అవకాశాలు పొందాలని స్పష్టంగా చెబుతుంది. అడ్డంకులను తొలగించడం, గౌరవంతో జీవించే వాతావరణం కల్పించడం దేశాల బాధ్యతగా భావిస్తుంది. 2030 సుస్థిరాభివృద్ధి అజెండా కూడా ఎవరూ వెనుకబడకూడదు అనే సిద్ధాంతంపై ఆధారపడింది. ఆరోగ్యం, విద్య, సేవలు, మరియు మౌలిక వసతులు అందరికీ చేరేలా చూడాలని ఇది చెబుతుంది. ఈ చర్యలు సమాజంలో నిజమైన సమానత్వాన్ని కల్పిస్తాయి.

అంతర్జాతీయ వికలంగుల దినోత్సవం మనకు ప్రత్యేక అవసరాలు ఉన్నా, లేకపోయినా ప్రతి వ్యక్తికి విలువ ఉందని గుర్తు చేస్తుంది. వారికి అడ్డుగా నిలిచే అవరోధాలను తొలగించడం, సౌకర్యవంతమైన జీవితంకోసం మద్దతు కల్పించడం, ఉద్యోగం నుంచి కళల వరకు అన్ని రంగాల్లో అవకాశాలు ఇవ్వడం మనందరి బాధ్యత. ఈ రోజు ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు అందే ప్రపంచాన్ని నిర్మించాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది.

డా. కృష్ణ కుమార్ వేపకొమ్మ
ప్రొఫెసర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్)
vepakrish1956@gmail.com

# 'స్వయం శిక్షణ ప్రయోగ్' ద్వారా పాడి పరిశ్రమ పురోగతి

గ్రామీణ పాడి విలువ గొలుసులను బలోపేతం చేయడం, కల్తీని నివారించడం, మహి ళా రైతులను అసంఘటిత పాడి రైతులను సాధికారత చేయడం వైపు ఒక విప్లవాత్మక అడుగుగా, 'స్వయం శిక్షణ ప్రయోగ్' దేశంలోని నీటికొరత ఉన్న ప్రాంతాలలో 100 సోలార్ ఆధారిత పాల చిల్లింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్న ప్రతిష్టాత్మక ప్రణాళికను ప్రకటించింది. ఈ ప్రాజెక్టు చిన్న, మధ్యమ తరగతి రైతులకు శీతల కేంద్రాలు ఏర్పాటు చేయడం, నిల్వ సౌకర్యాన్ని అందించడానికి, అనిశ్చితమైన విద్యుత్ సరఫరాపై ఆధారపడ టం తగ్గించడానికి, అలాగే శుభ్రమైన పునరుత్పాదక శక్తి వినియోగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో ప్రోత్సహించడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రతి చిల్లింగ్ యూనిట్ కోసం అధిక సామర్థ్యం కలిగిన సోలార్ వ్యవస్థలను సరఫరా, ఏర్పాటు మరియు కమిషన్ చేయగల అర్హతగల తయారీదారులు, వెండర్ల ను స్వయం శిక్షణ ప్రయోగ్ ఆహ్వానిస్తోంది. ప్రతి కేంద్రంలో 2.6 KWp సోలార్ ప్యానెల్స్, 5 KVA ఇన్వర్టర్ (డ్యూయల్ ట్రాకర్లతో), 5 కిలోవాట్స్ ఆఫ్‌గ్రిడ్ పవర్ కంCRషనింగ్ యూనిట్ ఉంటాయి. ఇవన్నీ కేవలం 120 చదరపు అడుగుల చిన్న ప్రదేశంలో అమర్చబడతాయి. వెండర్లకు కనీసం ఐదేళ్ల అనుభవం, దృఢమైన సాంకేతిక నైపుణ్యం, నాణ్యత హామీ, స్వయం శిక్షణ ప్రయోగ్ యొక్క స్థిరత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయగల సామర్థ్యం అవసరం.

1998లో లాతూర్ భూకంపం అనంతరం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా ప్రారంభమైన స్వయం శిక్షణ ప్రయోగ్, సంవత్సరాలకొద్దీ దేశంలోని అత్యంత ప్రభావవంతమైన మహిళా నాయకత్వ సంస్థగా ఎదిగింది. మహారాష్ట్రలోని కరువు ప్రభావిత మరాఠ్వాడ ప్రాంతాన్ని కేంద్రీకరించుకుని, ఏడు రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న SSP ఇప్పటివరకు 3,274 గ్రామాల్లో 30 జిల్లాలను ఆవరించి, 3.5 లక్షలకు పైగా మహిళా నాయకులను సాధికారత చేసి, 60 లక్షల మందికి పైగా ప్రజల జీవితాల ను ప్రభావితం చేసింది. వాతావరణ అనుకూల వ్యవసాయం, శుభ్రమైన శక్తి, నీరు, శానిటేషన్, ఆరోగ్యం, పోషణ, మహిళా వ్యాపారాభివృద్ధి ఎస్ఎస్‌పి ప్రధాన రంగాలు.

**పాడి పరిశ్రమలో సోలార్ శక్తి**

పాల ఉత్పత్తి దాదాపు 2.76 కోట్ల గ్రామీణ భారతీయుల ఆదాయానికి ప్రధాన మూలం. అయితే అనిశ్చితమైన విద్యుత్, సరైన చల్లని నిల్వ అందుబాటులో లేకపోవడం వంటి సవాళ్ల కారణంగా రైతులు నష్టపోతున్నారు. చాలామంది ఖరీదైన, కాలుష్యకరమైన డీజిల్ జనరేటర్లపై ఆధారపడాల్సి వస్తోంది. స్వయం శిక్షణ ప్రయోగ్ ప్రవేశపెట్టిన ఈ సోలార్ చిల్లింగ్ హబ్‌లు ఈ సమస్యలను నేరుగా పరిష్కరిస్తాయి. ప్రతి కేంద్రం సంవత్సరానికి సుమారు ఆరు టన్నుల కార్బన్ డైయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించే సామర్థ్యం కలిగి ఉండటంతో పాటు నిరంతర చిల్లింగ్ సౌకర్యం, ఆపరేటింగ్ ఖర్చు లు తక్కువ, మహిళా రైతులకు మెరుగైన మార్కెట్ ప్రాప్యతను అందిస్తుంది. అంతేకాక, ఈ కార్యక్రమం మహిళల డిజిటల్ సాక్షరత వ్యాపార నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా వారికి పాడిరంగంలోని పోటీ మార్కెట్లో భాగస్వామ్యం చేసే అవకాశాలను సృష్టిస్తుంది.



ఈ ప్రాజెక్టు కోసం ఎంపికైన వెండర్ 100 సోలార్ పాల చిల్లింగ్ యూనిట్లను సరఫరా చేసి, వాటిని ఏర్పాటు చేసి, పూర్తిస్థాయి ఆపరేషన్ స్థాయికి చేరవేయాలి. స్థానిక ఆపరేటర్లు, సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, సంపూర్ణ సాంకేతిక మాన్యువల్స్ అందించడం, అన్ని పరికరాలు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూడటం వెండర్ బాధ్యత. సమయపాలనతో డెలివరీ, బహుళ ప్రదేశాల్లో ఇన్‌స్టలేషన్ పర్యవేక్షణ, కనీసం ఐదేళ్ల వారంటీ , నిర్వహణ సేవలు అందించాలి. చెల్లింపు నాలుగు దశల్లో జరుగుతుంది ఒప్పందం సంతకం సమయంలో, పరికరాల డెలివరీ సమయంలో, ఇన్‌స్టలేషన్ పూర్తయ్యే సమయంలో, మూడు నెలల విజయవంతమైన ఆపరేషన్ తరువాత అభిరుచి చూపిన దరఖాస్తుల ఆధారంగా ముగ్గురు వెండర్లను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరిని సాంకేతిక నైపుణ్యం, నాణ్యత హామీ, స్థిరత్వ పద్ధతులు, ఆర్థిక ప్రతిపాదనల పోటీ సామర్థ్యాల ఆధారంగా పరిశీలిస్తారు.

**భారత పాడి రంగంలో సాంకేతిక పురోగతులు**

చల్లని నిల్వ సదుపాయాల అభివృద్ధితో పాటు, పాల నాణ్యత పరీక్షల్లో పారదర్శకత, న్యాయం కల్పించే సాంకేతిక పరిష్కారాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, పాల నాణ్యతలో అసమానతలు,మాన్యువల్ కాలిబ్రేషన్ తప్పులు, కొవ్వు/ఎస్ఎన్ఎఫ్ కొలతల్లో నిర్దిష్టత లేకపోవ డం వంటి సమస్యలు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్నాయి. చాల క్లౌడ్ బేస్డ్ సంస్థలు అభివృద్ధి చేసిన ఐటి ఆధారిత స్మార్ట్ మిల్క్ అనలైజర్లు ఈ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆన్లైన్ కాలిబ్రేషన్, బ్లూటూత్, క్లౌడ్ కనెక్టివిటీ, భద్రతాయుత లాగ్ మేనేజ్మెంట్, ప్రిడిక్టివ్ మెయింటెనెన్స్ వంటి లక్షణాలతో ఇవి పాల పరామితుల కొలతలో అత్యంత నిర్దిష్టతను నిర్ధారిస్తున్నా యి. దీంతో రైతులకు న్యాయమైన చెల్లింపులు, డేటా ఆధారిత నిర్ణయాలు, విలువ ఆధారిత పాడి ఉత్పత్తు ల నాణ్యతలో పెరుగుదల సాధ్యమవుతోంది.

స్వచ్ఛ శక్తి పరిష్కారాలను ఆధునిక డిజిటల్ పరికరాలతో కలిపిన స్వయం శిక్షణ ప్రయోగ్ కార్యక్రమం గ్రామీణ మహిళా రైతుల పాడి వ్యవస్థను పూర్తిగా మార్చగలదు. ఈ ప్రాజెక్టు ఆదాయాన్ని పెంచడం, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించడం, పాలు విలువ గొలుసులో పారదర్శకతను పెంపొందించడం వంటి ప్రయోజనాలను అందిస్తుంది. భారత గ్రామీణ పాడి రంగానికి నాయకత్వం వహిస్తున్న వేలాది మంది మహిళల జీవితాలను మార్చే ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి వినూత్న సోలార్ తయారీ సంస్థలను స్వయం శిక్షణ ప్రయోగ్ ఆహ్వానిస్తోంది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు,
9989988912

## 5 నామినేషన్ల కేంద్రాలు ఏర్పాటు

ప్రజాపక్షం/వీపనగండ్ల:మండలంలోని 14 గ్రామపంచాయితీలకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఐదు ప్రత్యేక కేంద్రాల్లో నామినేషన్లను స్వీకరించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. నేటి నుండి 5వ తేది వరకు నామినేషన్లు స్వీకరణ ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. నామినేషన్లు స్వీకరించనున్న కేంద్రాలు గ్రామాల వారిగా గోవర్ధనగిరి కేంద్రంలో గోవర్ధనగిరి, గోపాల్ దిన్నే, రంగవరం గ్రామాలు, కల్వరాల కేంద్రంలో కల్వరాల, పుల్గర్‌చర్ల గ్రామాలు వీపనగండ్ల కేంద్రంలో వీపనగండ్ల , సంగినేనిపల్లి గ్రామాలు, తూముకుంట కేంద్రంలో తూముకుంట, సంపత్ రావుపల్లి, నాగర్లబండ తండా గ్రామాలు, బొల్లారం కేంద్రంలో బొల్లారం, వల్లభాపురం తాండా, కొర్లకుంట గ్రామాలకు చెందిన నామినేషన్లు స్వీకరిస్తారని, 6వ తేదీన నామినేషన్ల పరిశీలన, 9న నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 17న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహణ, అనంతరం 2 గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభించి ఫలితాలను వెల్లడిస్తామని, అదే రోజు ఉపసర్పంచు ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

## బోరు బావి నుండి ఉబికి వస్తున్న పాతాళగంగ



ప్రజాపక్షం/వీపనగండ్ల: వర్షాలు సమృద్ధిగా పడటంతో నదులు పొంగిపోర్లుతూ రిజర్వాయర్లు, చెరువులు, కుంటలలో జలకళ సంతరించుకున్నాయి. వ్యవసాయ బోరు బావులలో నీటి ఊటలు కూడా పెరిగాయి. మండల కేంద్రమైన వీపనగండ్ల ఊరు చెరువు వెనుక రైతు ముంత మాందాపురం రాముడు చెందిన వ్యవసాయ బోరు బావి నుంచి మోటార్ ప్రమేయం లేకుండానే బోరుబావి నుంచి నీరు ధారాళంగా పైకెగసి, స్వయంగా ఊటల్లా ఉబుకుతూ బయటకు రావడం అరుదైన విషయమని గ్రామస్థులు చెబుతున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవటం వల్ల నీటి ఊటలు పెరిగి బోరుబావిలో నుంచి పాతాళగంగా పైకి ఉబికి వస్తుందని రైతు ముంత మాందాపురం రాముడు ఆనందం వ్యక్తం చేశారు.

## ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య



ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలోని విద్యానగర్ భగత్‌సింగ్‌కాలనీలో మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మాధవి(33) అనే మహిళ కుటుంబ కలహాలతో సోమవారం అర్ధరాత్రి తన ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనస్థలాన్ని పరిశీలించారు. మృతురాలి భర్త గౌతమ్ తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం మాధవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ ఇసుక టిప్పర్ పట్టివేత



ప్రజాపక్షం/కల్వకుర్తి : అక్రమ ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకొని వెల్దండ మండల పోలీస్‌స్టేషన్‌కు తరలించడం జరిగిందని కల్వకుర్తి రవాణ శాఖ అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఓవర్‌లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్నారని చలాన్ రాయడం జరిగిందన్నారు. ఓవర్‌లోడ్‌తో ఇసుకను రవాణా చేస్తే ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అనుమతి పొంది ఇసుక రవాణా చేసుకోవాలన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ




ప్రజాపక్షం/నారాయణపేట్ : పోస్టల్ బ్యాలెట్ శిక్షణను అధికారులు వినియోగించుకుని, పోస్టల్ బ్యాలెట్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో పోస్టల్ బ్యాలెట్‌పై శిక్షణ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అధికారుల పోస్టల్ బ్యాలెట్ వినియోగం, లెక్కింపు తదితర అంశాలపై కలెక్టర్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామికి పంబాభిషేకం



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ అయ్యప్ప స్వామి దేవాలయం పదవ వార్షికోత్సవం పురస్కరించుకుని అశోక్ గౌడ్, గురుస్వామి తాళంపల్లి అనిల్ గురుస్వామి ఆధ్వర్యంలో నూతనంగా పునరుద్ధరించబడిన కోనేటికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం కలశాలలో పవిత్ర జలాలను తీసుకుని పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి దేవాలయానికి స్వాములు మేళతాళాలతో కలశ ఊరేగింపుగా బయలుదేరారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప ఆలయ పదవ వార్షికోత్సవం పురస్కరించుకుని 2,3,4 తేదీలలో ఆలయంలో విశేష పూజలు ఉంటాయని, ఈ పవిత్ర జలాలతో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు.

## పొరపాట్లకు తావుండొద్దు



ప్రజాపక్షం/నారాయణపేట్ : నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సాధారణ ఎన్నికల పరిశీలకురాలు సీతాలక్ష్మి సూచించారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి దామరగిద్ద మండలంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎన్నికల పరిశీలకురాలు మంగళవారం దామరగిద్ద మండలం విఠలాపూర్ గ్రామ పంచాయతీలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని , మొదటి అంకమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. వీరి వెంట స్థానిక అధికారులు వెంకటేష్ డిప్యూటీ ఎస్‌ఓ, నటరాజ్ తదితరులు ఉన్నారు.

## 72వ సారి రక్తదానం

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : సాటి మహిళకి సమయానికి రక్తదానం చేశామని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు తెలిపారు. వివరాల్లోకి వెళితే పాలమూరు జిల్లా కేంద్రానికి చెందిన హేమలత ఆపరేషన్ కోసం నేహాషాయిన్ హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యింది. డాక్టర్స్ నిర్ధారణ చేసి వెంటనే ఆమెకు బి పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలి అని నిర్ధారించడంతో కుటుంబ సభ్యులు బ్లడ్ కోసం యువశక్తి ఫౌండేషన్ ని ఆశ్రయించడంతో వెంటనే స్పందించిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధు రక్తదానం చేశారు. కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ సేవలకుకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు, ఫౌండేషన్ మెంబర్ శివ, ఆంజనేయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సైబర్ భద్రతపై అవగాహనకు ''ఫ్రాడ్ కో ఫుల్ స్టాప్''




ప్రజాపక్షం/నారాయణపేట్: రాష్ట్రంలో సైబర్ నేరాలను నియంత్రించడం, ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపు కోసం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రాడ్ కో ఫుల్ స్టాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. డిజిపి సూచనల మేరకు రాష్ట్రంలోని అన్ని యూనిట్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజు రోజుకు కొత్త పద్ధతుల్లో జరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏ. మెసేజ్, కాల్, లింక్, క్యూఆర్ కోడ్‌పై నమ్మకం పెట్టుకునే ముందు రెండు సార్లు ఆలోచించాలి. బ్యాంక్, పోలీస్, ప్రభుత్వ శాఖల పేరుతో వచ్చే స్కామ్ కాల్స్‌కు లోనుకావద్దు. ఎవరూ ఒటిపి, పిన్, బ్యాంక్ వివరాలు అడగరు. ఇలాంటి వాటిని అడిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కి ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరగాళ్లు ఎంత తెలివిగా వ్యవహరించినా, ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటే మోసపోవడం జరగదని తెలిపారు. అందరూ సైబర్ భద్రతా నియమాలు పాటించాలి. యువత, విద్యార్థులు సైబర్ ఎథిక్స్ నేర్చుకొని తమ కుటుంబాలకు, సమాజానికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నల్లపు లింగయ్య, మహేష్, ఐటీ కోర్ ఎస్సై సురేష్, జిల్లా సైబర్ సెక్యూరిటీ టీమ్, శ్రీ దత్త బీయిడి కళాశాల, మెడికల్ కళాశాల విద్యార్థులు, పాల్గొని సైబర్ నేరాల నివారణపై సూచనలు అందుకున్నారు. తరువాత ''ఫ్రాడ్ కో ఫుల్ స్టాప్'' ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సైబర్ నేరాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించి తమ తోటి విద్యార్థులకు ఫ్యామిలీ మెంబర్స్‌కు అవగాహన కల్పించాలని కోరారు. మనకు ఈజీగా ఏదైనా వస్తుందంటే దాని వెనుక కచ్చితంగా సైబర్ నేరం దాగి ఉందని గుర్తుంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాల నుండి దూరంగా ఉండటానికి మన మైండ్ సెట్‌ని మార్చుకోవాలని తెలిపారు.

## ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బంది కేటాయింపు

### కలెక్టర్ బదావత్ సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలను ఎన్నికల నిబంధనలకు లోబడి నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటి, రెండోవిడతలో నిర్వహించే 13 మండలాల్లో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి సంబంధించి మొదటి, రెండోవ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజ్యలక్ష్మి , అదనపు కలెక్టర్ దేవసహాయం పర్యవేక్షణలో ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో జిల్లాకు సంబంధించిన ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బందికి సంబంధించిన మొదటి, రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి బదావత్‌సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన మొదటి విడత ఎన్నికలకు సంబంధించిన ఆరు మండలాల్లోని 1326 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే 3502 మంది పిఓ, జిపిఓ సిబ్బందిని ఏడు మండలాల్లో రెండోదశ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొత్తం 1412 పోలింగ్‌కేంద్రాలకు సంబంధించి 4106 మందిని రెండోవిడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని ఎన్నికల అధికారి తెలిపారు. 1412 పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసి సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగింది. పిఓలు, ఓపిఓలు ఉన్నారని తెలిపారు. మొదటివిడతలో జరిగే ఎన్నికలకు 1326 పోలింగ్‌కేంద్రాలు, రెండోవిడతలో జరిగే ఎన్నికలకు 1412 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటికి ప్రిసైడింగ్, ఓపిఓలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఒక్కో మండలంవారిగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్‌విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ప్రతి విడతలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికలకు 20శాతం అదనంగా సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని, సిబ్బందికి ఎన్నికల నిబంధనలపై పూర్తిస్థాయిలో శిక్షణలో అందజేయడం జరిగిందన్నారు.

## డిపిఆర్ లేని ఎత్తిపోతల పథకాన్ని ఏవిధంగా పూర్తి చేస్తారు?



నారాయణపేట జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యేలు ఎస్.రాజేందర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి

ప్రజాపక్షం/మక్తల్: డిపిఆర్ లేని మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని ఏవిధంగా పూర్తి చేస్తారని నారాయణపేట జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమీషన్లు దండుకోవడానికి మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రారంభించారని ఇప్పటివరకు డిపిఆర్ కూడా లేదని ముందు 1600 కోట్లు అని ఇప్పుడు రెండు వేల ఎనిమిది వందల కోట్లు అని తరువాత 4200 కోట్లని ఇప్పుడేమో 5400 కోట్లకు ప్రాజెక్టును ప్రారంభించామన్నారని ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు ఎన్ని డబ్బులు డ్రా చేసిండ్రు ప్రజలకు చెప్పాలని బిల్లులు మాత్రం తీసుకుని కమీషన్ల డబ్బులు తీసుకున్నారని ఇక్కడ ఉన్న మంత్రి మాట్లాడుతూ ఒక్క లక్ష ఇరవై ఐదు వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని అనడం ఆస్యాస్పదమని ఎస్.రాజేందర్ రెడ్డి అన్నారు. ఇప్పటివరకు జిల్లాల్లో ఉన్న ప్రాజెక్టులలో తట్టెడు మన్ను కూడా తీయలేదన్నారు. గత 10 సంవత్సరాలలో గురుకులాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారో ఈ రెండు సంవత్సరాలలో ఎన్ని ఇంతమంది విద్యార్థులు ఉన్నారో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. నారాయణపేటకు అగ్రికల్చర్ కాలేజీ తీసుకుని వస్తే ఆ కాలేజి ని వనపర్తిలో పెట్టిన మాట వాస్తవం కదా అని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు నారాయణపేట జిల్లాలో ఎన్ని రోడ్లు వేశారని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెచ్చింది. గత ప్రభుత్వమని ఆరు గ్యారంటీలు, 425 హామీలు అమలు చేయకుండా విజయోత్సవ సంబరాలు ఏవిధంగా జరుపుకుంటారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిట్టెం సుచరిత రెడ్డి, బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ అన్వర్, నాయకులు నరసింహరెడ్డి, జుట్ల సాగర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బాదేపల్లి పిఎసిఎస్ చైర్మన్

### అందరం కలిసి జడ్చర్ల అభివృద్ధికి పాటు పడుదాం : ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



ప్రజాపక్షం/జడ్చర్ల: ప్రతి గ్రామం ప్రతి తాండాకు రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయమని , రండి తెలంగాణలో నెంబర్ వన్ నియోజకవర్గంగా జడ్చర్లను తీర్చిదిద్దుతాం అని జడ్చర్ల శాసనసభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ పాత, కొత్త అన్న తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుల్లా భావించి, అందరం కలిసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జడ్చర్ల అభివృద్దే తమ ధ్యేయమని, కాంగ్రెస్ పార్టీకి బలం చేకూర్చడం ద్వారా నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలబెడతామని స్పష్టం చేశారు. జడ్చర్లకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేసుకుని, జడ్చర్లను రెవెన్యూ డివిజన్‌గా, కొల్లూరు గ్రామాన్ని మండలంగా అభివృద్ధి చేయడం, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి తండాకు నాణ్యమైన రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అవసరమైన అన్ని వసతులను అందించడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. అందరూ కలిసి నడిస్తేనే జడ్చర్ల వేగంగా అభివృద్ధి చెందుతుంది. వివిధ పార్టీల నుంచి ముందుకు వచ్చే ప్రతి నాయకుడు, యువకుడు, కార్యకర్త కాంగ్రెస్ పార్టీలో చేరి జడ్చర్ల అభివృద్ధి యజ్ఞంలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించాలి



కలెక్టర్ విజయేందిర బోయి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: గ్రామ పంచాయితీ ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వి.సి కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ కోడ్ పాటించాలని కోరారు. జిల్లాలోని మొత్తం 3674 పోలింగ్ కేంద్రాలకు గాను మూడు దశల్లో 999 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు గా గుర్తించామని తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు సజావుగా సాగేందుకు పూర్తిస్థాయి భద్రత కోసం, వెబ్‌కాస్టింగ్, సీసీటీవీ కెమెరాలు, సూక్ష్మ పర్యవేక్షకులు (మైక్రో అబ్జర్వర్లు) వీటితో పాటు కట్టుదిట్టమైన పోలీస్ భద్రతను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో, రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేస్తూ, వారి సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుంటామని అన్నారు. ఇప్పటి వరకు మొదటి దశ నామినేషన్ల స్క్రూటినీ పూర్తి అయిందని తెలిపారు. రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్ఓ) వద్ద తిరస్కరించబడిన వారు అప్పిల్‌కు వెళ్లవచ్చని, అయితే ఆర్‌డిఓ వద్ద అప్పీల్ తిరస్కరించబడితే అది తుది నిర్ణయం అవుతుందని స్పష్టం చేశారు. అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు వారి తుది జాబితాలోని పేర్ల అక్షర క్రమం ఆధారంగా కేటాయిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పిసిఈఓ ఇంచార్జి డిపిఓ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ , సిపిఎం, ఏఐఎంఐఎం తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఎన్నికలను సక్రమంగా నిర్వహించే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదే**

గ్రామ పంచాయతీ ఎన్నికలను క్షేత్రస్థాయిలో సక్రమంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ప్రధాన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జడ్.పి సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అనేక దశల్లో అధికారులు పనిచేసినా, క్షేత్రస్థాయిలో ఎన్నిరల నిర్వహణలో కీలక పాత్ర ప్రిసైడింగ్ అధికారులదేనని ఆమె వివరించారు. కేటాయించిన డ్రిస్టిబ్యూషన్ సెంటర్లకు అధికారులు తప్పకుండా సమయానికి హాజరై, సంబంధిత గ్రామ పంచాయతీకి సంబంధించిన స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను అప్రమత్తం సంప్రదించాలన్నారు. వారికి కేటాయించిన ఎలక్షన్ మెటీరియల్‌ను సక్రమంగా తనిఖీ చేసి, బ్యాలెట్ పేపర్లలో తమ ప్రిసైడింగ్ స్టేషన్‌కు సంబంధించిన వివరాలు సరిగా ఉన్నాయా లేదా పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటరెడ్డి, డిపిఓ నిఖిత, జిల్లా అసిస్టెంట్ నోడల్ అధికారులు బాలు యాదవ్ బైకని, దుంకుడు శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్లు శ్రీకాంత్, సాయిబాబా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## తలకిందులుగా రహదారి సూచిక

ప్రజాపక్షం/వీపనగండ్ల: ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యంతో ఏ దారి ఎటు పోతుందో తెలిపే సూచిక బోర్డు సరిగ్గా లేకపోవడంతో వాహనదారులు అయోమయానికి గురైతున్నారు. వీపనగండ్ల మండల కేంద్రం నుంచి వల్లభాపూర్ వెళ్లే రోడ్డులో సంగినేనిపల్లి కల్వరాల ఆర్‌అండ్‌బి ప్రధాన రోడ్డు ప్రధాన చౌరస్తా వద్ద అధికారులు సంగినేనిపల్లికి వెళ్లే రోడ్డు సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఆ బోర్డు తలక్రిందులుగా వేలాడుతుండడంతో ఆ గ్రామం ఎటువైపు ఉందో తెలియక వాహనదారులు తికమక పడుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు ఆ చౌరస్తా వద్ద నాలుగు గ్రామాలకు వెళ్లే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని, తలకిందులుగా వేలాడుతున్న సూచిక బోర్డును సరిచేయాలని, వాహనదారులు అధికారులను కోరుతున్నారు.

## వనపర్తి జిల్లా సివిల్ సప్లయ్ అధికారిపై లోకాయుక్తలో ఫిర్యాదు



ప్రజాపక్షం/వనపర్తి టౌన్: వనపర్తి జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్ పై రాష్ట్ర లోకాయుక్తలో బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డా.రాచాల యుగంధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. మంగళవారం బషీర్ బాగ్‌లోని లోకాయుక్తకు ఫిర్యాదు చేసిన అనంతరం రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై ఆధారాలతో సహా లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యంత్రాలు, విద్యుత్ కనెక్షన్ లేని రైస్ మిల్లులకు సైతం బియ్యాన్ని కేటాయించడంతో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్‌పై ఏప్రిల్ నెలలో జిల్లా కలెక్టర్, విజిలెన్స్ డిజి, సివిల్ సప్లయ్ కమిషనర్‌కు కూడా ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ ఆయనపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. తనకు అనుకూలంగా ఉండే మిల్లర్లకు మాత్రమే ధాన్యం కేటాయిస్తూ నిబంధనలను పాటిస్తున్న మిల్లులకు బియ్యం కేటాయించకుండా వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. అధికారి అవినీతికి సహకరిస్తున్న ఉన్నతాధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు గాలి గల్ల సాయిబాబా, చింటు తదితరులు ఉన్నారు.

## డిసిసి అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకున్న సంజీవ్ ముదిరాజ్



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం టీపీసీసీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ చేతుల మీదుగా సంజీవ్ ముదిరాజ్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సంజీవ్ ముదిరాజ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు జర్నలిస్టుల మహాధర్నా



ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించే వరకు టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో మహాధర్నకు సంబంధించిన కరపత్రాన్ని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవరావు, బి.రాజు, జాతీయ కౌన్సిల్ నెంబర్ ప్రశాంత్ రాష్ట్ర హౌసింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాస రావు, జిల్లా కోశాధికారి మన్యం, జిల్లా ఉపాధ్యక్షులు నా కొండ యాదవ్, కమల్ రెహమాన్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ రాజు, జిల్లా నాయకులు పికిలి రాము, రవికాంత్, టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, సిల్ మార్తి ఆంజనేయులు, నాయకులు విష్ణు, సురేష్, ఫారుక్ పటేల్, దాచ హరీష్ కుమార్, మహేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట ఆర్‌డిఓపై ఫిర్యాదు

ప్రజాపక్షం/అచ్చంపేట : తమకు న్యాయం చేయడంలేని రెండు సంవత్సరాలనుండి దరఖాస్తు చేసుకున్న పట్టించుకోవడంలేదని మానవహక్కుల కమిటికి రైతు ఫిర్యాదు చేసిన సంఘటన అచ్చంపేటలో జరిగింది. రైతు వెంకటేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఐనోల్ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డికి తమ గ్రామంలో భూమికలదు. ఇట్టిభూమిని ఆర్‌డిఓ బినామిలకు కట్టబెట్టాలని చూస్తున్నాడన్నారు. ఈవిషయంపై భూమి తనదే అన్నట్లు రికార్డులద్వారా తెలియజేశారు. కోర్టుకుకూడా వెళ్లి భూమి తమదే అన్నట్లు కోర్టునుంచికూడా ఆర్డర్ తీసుకొచ్చామని తెలిపారు. ప్రతికోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. రాజకీయ నాయకులకులొంగి ఆర్‌డిఓ మాధవి తమకు న్యాయం చేయకుండా వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు.

**ఆర్‌డిఓ వివరణ :** ఈవిషయంపై ఆర్‌డిఓ మాధవి మాట్లాడుతూ తమకు ఎవరిపై వివక్షతలేదని అక్రమంగా పట్టాలు ఇవ్వాల్సిన అవసరంలేదని ఆమె తెలిపారు. గత 40సంవత్సరాలకుపైగా గిరిజనులే మోకపై ఉంటూ సాగుచేసుకుంటున్నారని ఈకేసుపై విచారణజరిపి మూడుసార్లు నోటిసులు జారీచేశామని తెలిపారు. హెచ్ఆర్‌సి తమను వివరణకోరితే తామూ తగిన సమాచారం ఇవ్వనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రస్థాయిలో వైష్ణవి విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** విద్యార్థి విజ్ఞాన్ మంథన్ జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వైష్ణవి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పరీక్షకు అర్హత సాధించారు. ఈ పరీక్ష లెవల్ 1, లెవల్ 2 స్థాయిలలో ఇప్పటి వరకు పరీక్ష నిర్వహించగా ఈ రెండు లెవల్స్‌లో విజయం సాధించిన విద్యార్థులు మాత్రమే రాష్ట్ర స్థాయి పరీక్షకు అర్హత సాధిస్తారు. సూర్యాపేట నుండి ఒకే ఒక పాఠశాల నుండి ఇంత మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పరీక్షకు అర్హత సాధించడం జిల్లాలోనే మొదటిసారి అని పాఠశాల ప్రిన్సిపాల్ శైలజ, కరస్పాండెంట్ కళాధర్, డైరెక్టర్ హర్షిత్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత తల్లిదండ్రుల సహకారం ఫలితంగానే ఈ విజయం సాధ్యమైందని వారు వివరించారు.

## కలిసి వచ్చే పార్టీలతో సిపిఐ పొత్తు



**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మండలంలో కలిసొచ్చే పార్టీలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పోటీ చేస్తుందని చండూరు మండల కార్యదర్శి నల్లరాజు సతీష్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని పుల్లెంల గ్రామంలో సిపిఐ శాఖ కార్యదర్శి శివర్ల లింగస్వామి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ మండల కార్యదర్శి నల్లరాజు సతీష్ కుమార్ హాజరై మాట్లాడుతూ గ్రామపంచాయితీ ఎన్నికల్లో సిపిఐ కలిసి వచ్చే పార్టీలతో పొత్తు కుదుర్చుకొని పోటీ చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొద్దు వెంకటేశ్వర్లు, మండల కార్యవర్గ సభ్యులు బరిగెల వెంకటేశ్ , సిహెచ్ ఊషయ్య, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, ఇరిగి సంజీవ, ఎండి కరీం , మందడి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 31 వరకు 30 పోలీస్ యాక్ట్

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/సూర్యాపేట :** శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 02.12.2025 నుండి ఈనెల 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాతో ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజాజీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారితీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, అసత్యాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణాసంచా, డిజెలు ఉపయోగించవద్దని స్పష్టం చేశారు.

## మహిళలపై హింసకు వ్యతిరేక పోరాటం సమష్టి బాధ్యత



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం సహాయం కౌన్సిలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మహిళలపై హింస అంశంపై లైన్స్ క్లబ్ సహకారంతో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నల్లగొండ పట్టణ వైద్యులు డాక్టర్ రాజేశ్వరి,డాక్టర్ మంజుల,డాక్టర్ విశ్వజ్యోతి విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మంగళవారం జరిగిన ఈ సదస్సు లో డా రాజేశ్వరి మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు అనేక రూపాలలో హింసను ఎదుర్కొంటున్నట్లు ముఖ్యంగా డిజిటల్ హింస నానాటికి పెరిగిపోతున్న క్రమాన్ని వివరించారు. మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రక్షణ సదుపాయాలను న్యాయపరమైన సలహాలు సూచనలు అందించే మహిళ పోలీస్ స్టేషన్, సఖి సెంటర్, న్యాయ సదన్ సేవలను వివరించారు. డాక్టర్ విశ్వ జ్యోతి మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా యువతులు మంచి పౌష్టికాహారం వ్యాయామాలు తో శారీరక మానసిక ఆరోగ్య కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ స్వీయ క్రమశిక్షణ,నిరంతర పరిశ్రమతో ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయం సెంటర్ కోఆర్డినేటర్ డా సూరం శ్వేత, డాక్టర్ లక్ష్మీప్రభ,డాక్టర్ వై ప్రశాంతి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా అరుణప్రియ, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు,లయన్స్ క్లబ్ సభ్యులు ఏదుల్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో స్థానిక ఎన్నికలు





**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్ రాజు అన్నారు. మంగళవారం తిరుమలగిరి మండల కేంద్రస్థులకు, రంగుండ్ల గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఎన్నికలు జరిగే సమయంలో అందరూ సమన్వయంతో ఉండాలని కోరారు. పోలీసులు ఎన్నికల వేళ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఇలాంటి ప్రలోభాలకు బెదిరింపులకు లోను కాకుండా ఎన్నికల విధానాన్ని గౌరవించాలని సూచించారు. ఎన్నికల చిన్నపాటి వివాదాలు పెద్దగా మారే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గ్రామాలలో ఆశాంతి వాతావరణం నెలకొనేలా చేసే ప్రయత్నాలను కఠినముగా ఎదుర్కొంటామని, చట్టాన్ని అతిక్రమించే వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వీధికుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

**ప్రజాపక్షం/నందికొండ:** వీధికుక్కల దాడిలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలైన ఘటన నందికొండ మునిసిపాలిటీ పైలన్ కాలనీ లోచోటుచేసుకుంది మంగళవారం సాయంత్రం జరిగి నఈ ఘటన స్థానికులను కలవరపరిచింది. పాఠశాల లనుండి ఇంటికి వెళుతున్న షేక్ అక్రమ్‌పై వీధి కుక్కలు అకస్మాత్తుగా దాడి చేయడంతో అతడు కుక్కల బారి నుండి తప్పించుకునే ప్రయత్నంలో కింద పడిపోవటంతో అతని చేతులు, కాళ్ళు తలపై గాయాలు ఏర్పడ్డాయి ఇదే అదనుగా కుక్కలు దాడికి ప్రయత్నించే సమయంలో వెంటనే అక్కడున్న స్థానికులు కుక్కలను తరిమి బాలుడిని రక్షించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వీధి కుక్కల సమస్యను అదుపులో పెట్టేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తరచూ జరుగుతున్న కుక్క ల దాడులపై అధికారుల స్పందన లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించి, తక్షణం ఇక్కడ కుక్కల నియంత్రణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**కుక్కల దాడులు జరిగాకే మేల్కొనే అధికారులు**

ప్రజల్లో ఆగ్రహం వీధి కుక్కల దాడులు వరుసగా జరుగుతున్నప్పటికీ, అధికారులు మాత్రం సంఘటనలు జరిగాకే స్పందించడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. తాజాగా పాఠశాలకు వెళ్తున్న విద్యార్థి తీవ్రంగా గాయపడిన ఘటన మరోసారి మున్సిపల్ వ్యవస్థ నిర్లక్ష్యాన్ని వెలుగులోకి తెచ్చింది. నిత్యం కుక్కలు ఇబ్బంది పెడుతున్నాయని చిన్నపిల్లలు, వృద్ధులు భయంతో బయటకి రావట్లేదని ఏదైనా ప్రమాదం జరిగాకే అధికారులు స్పందిస్తున్నారని. గతంలో ఒక బాలికకు కుక్కల దాడిలో రాబిస్ వ్యాధి సోకి ఇప్పటికీ మృత్యువుతో పోరాడుతూనే ఉందని అయినా సరే అధికారులు ముందస్తు చర్యలు తీసుకునే ఆలోచనే లేదని స్థానికులు మండిపడుతున్నారు.



# ప్రసూతి వార్డులో పురుషులా..?

### సూపరింటెండెంట్‌పై కలెక్టర్ ఆగ్రహం
### ఆసుపత్రిలో సిసి కెమెరాలు నిరంతరం పనిచేయాలి
### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రసూతి వార్డులో పురుషులు ఉండడం ఏంటని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటిండెంట్‌ను ప్రశ్నించారు. అలాగే వార్డులో ఉన్న వారందరినీ వెంటనే బయటికి పంపాలని చెప్పారు. మంగళవారం ఆమె నల్లగొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు ,చిన్నపిల్లల వార్డు, ఐసీయూ తదితర వార్డులలో తనిఖీలు నిర్వహించారు. కాగా ప్రసూతి వార్డులో పురుషులు ఉండడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే అందరిని బయటకు పంపించాలని, పురుషులను ప్రసూతి వార్డులోకి ఎందుకు అనుమతించారని డ్యూటీ డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, ఇదే విషయంపై జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరిండెంట్ పై సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ప్రసవించిన మహిళలకు సహాయకులు ఎక్కువ మంది ఉండడం వల్ల చిన్న పిల్లలకు ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదం ఉందని ,అందువల్ల ఎక్కువ మంది ఉండకుండా, కేవలం ఒక్కరు మాత్రమే సహాయకులుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రతి వార్డులో ఉన్న సీసీ కెమెరాలు, ఆరు బయట వాహనాలు నిలిపే చోట ఇతర ముఖ్యమైన స్థలాలలో ఉన్న సీసీ కెమెరాలను ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న అన్ని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేయాలని ,ముఖ్యంగా ప్రధాన గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాలు 24 గంటలు పని చేసేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వర్గాలను ఆదేశించారు. ప్రత్యేకించి ఆటోలు నిలిపే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటిండెంట్ అరుణకుమారి,డాక్టర్ వందన, డాక్టర్ నగేష్ ఉన్నారు.

# తప్పలకు తావులేకుండా నామినేషన్ల స్వీకరణ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/కోదాడ:** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణలో అధికారులు జాగ్రత్త వహించాలని, తప్పులకు తావులేకుండా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్ అన్నారు. మంగళవారం అనంతగిరి గ్రామ పంచాయితీ కార్యలయంలో ఆమినాబాద్, క్రిష్టపురం, అనంతగిరి, కోదాడ మండల పరిధి గుడిబండ క్లస్టర్ పరిధి అడ్లూరు, అల్వాలపురం, గుడిబండ, తొగర్రాయి నామినేషన్ల స్వీకరణను పరిశీలించి మాట్లాడారు. అభ్యర్థులు 5 గంటల తరువాత కార్యలయంలో నామినేషన్లు వేసేందుకు వచ్చిన్నట్లయితే వారికి టోకెల్లు జారీచేయాలని అధికారులకు సూచించారు. వీరి వెంకట ఆర్డీవో సూర్యానారాయణ, తహసీల్దార్ వాజీద్ అలీ, ఎంపీడీఓ ఇసాక్‌అహ్మద్, హరిసింగ్, ఆర్ఓలు ఉన్నారు.

**నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్**

**ప్రజాపక్షం/అనంతగిరి :** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జాగ్రత్తగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ కార్యాలయంలోని నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చిన వారితో మాట్లాడి కేంద్రంలో అన్ని వసతులు ఉన్నాయో లేవో తెలుసుకున్నారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం సందర్శించి టిపోల్లో నామినేషన్ వేసిన అభ్యర్థుల జాబితాను ఎంట్రీ చేస్తున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఓ సూర్యనారాయణ, తహశీల్దార్ హిమబిందు, ఎంపిడిఓ హరిసింగ్, ఎంపిఓ సుష్మా, ఎస్ఐ నవీన్ కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

# సైబర్ నేరాల నివారణపై పోలీస్ శాఖ కృషి: ఎస్‌పి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంచేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పేరుతో 42 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో కళాశాల విద్యార్థినులు, విద్యార్థులకు ఆన్‌లైన్ జూమ్ మీటింగ్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. అనంతరం విద్యార్థులతో సైబర్ నేరాలకు మోసపోకూడదని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణపై పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఈ కార్యక్రమం డిసెంబర్ 2 నుండి జనవరి 12 వరకు ప్రతి వారం ఒక్క ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాల రూపంలో చేపట్టబడుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతీ రోజూ సుమారు రూ.2 వేల కోట్లు సైబర్ మోసాల ద్వారా నష్టం జరుగుతోందని తెలిపారు. దీనిని నివారించగల మార్గం ప్రజల్లో అవగాహన పెంపుదలేనని చెప్పారు. చదువుకున్న యువత సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుంటే తమ కుటుంబ సభ్యులకు, పరిసరాల్లోని ప్రజలకు కూడా తెలియజేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సైబర్ నేరగాళ్లు లోన్ అప్స్, ఆన్లైన్లో లింక్స్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఫ్రాడ్ కాల్స్, ఓటీపీ స్కామ్స్, డిజిటల్ అరెస్ట్ వాట్సాప్/ట్విట్టర్ లింక్స్, ఆన్లైన్ స్క్రాచ్ కార్డ్స్, ఏపీకే ఫైల్స్ వంటి పద్ధతులతో మోసాలను చేస్తున్నారు కాబట్టి ఏ అనుమానాస్పద లింకులు, ఫైళ్ళు క్లిక్ చేయవద్దని సూచించారు.ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, అదేవిధంగా ఎన్‌సిఆర్ పి పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ తక్షణ చర్య తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రమేష్, సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీ నారాయణ,డిఎస్‌పి శివరాం రెడ్డి,టు టౌన్ సీఐ రాఘవరావు,వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్ఐ విష్ణు, టూ టౌన్ ఎస్ఐ సైదులు, కళాశాల విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలకు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలి

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలి కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోయాయని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ తుఫాన్‌లో మునుగుతుంటే మేము ప్రకృతి అనుకున్నాం తప్ప ఆంధ్రప్రదేశ్‌ను తప్పుపట్టడం లేదు. అక్కడెక్కడో చెట్లు ఎండిపోతే మా దిష్టి తగిలిందని నిందించడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తుఫాను వస్తె తెలంగాణలో కొన్ని ప్రాంతాలు మునిగిపోయినప్పటికీ అది ప్రకృతి వైపరీత్యం కింద భావించామే తప్పా మేము ఆంధ్రప్రజలను తప్పు పట్టలేదన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల భావంతో ఉండే రాష్ట్రాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిసి దేశంలో ఉన్నతంగా ఎదగాలని కోరుకోవలసిన ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాంటి వివక్షపూరిత మాటలు మాట్లాడటవద్దని, విజ్ఞతగా వ్యవహరించాలని సూచించారు. మిత్రపక్షంకు బాధ్యత వహిస్తున్న తెలంగాణ బీజేపీ నాయకత్వం పవన్ వ్యాఖ్యలపై స్పందించాలని డిమాండ్ చేశారు. రెండు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు కలిగేలా పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ఉన్నందున వాటిని సంహరించుకొని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించాలని కోరారు.

## మూడవ విడత నామినేషన్‌లకు సర్వం సిద్ధం : కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి :** సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరిగే మూడవ విడత నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు చౌటుప్పల్, నారాయణపూర్, అడ్డగూడూర్, మోత్కూర్, గుండాల, మోటకొండూర్ మండలాలకు సంబంధించి 124 గ్రామపంచాయతీలు, 1086 వార్డులకు జరిగే మూడవ విడత నామినేషన్ ప్రక్రియకి సంబంధించి అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. 5 గంటలకు నామినేషన్ కేంద్రం గేటు మూసివేయాలని, నామినేషన్ కేంద్రంలో ఉన్న అభ్యర్థుల నుండి మాత్రమే నామినేషన్లు స్వీకరించాలని, ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించరని నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారికి మా త్రమే అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల సంఘం జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని, నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు.

## 7న ఐఎంఎ మెగా వైద్యశిబిరం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ఈనెల 7వ తేదీన సూర్యాపేట పట్టణంలోని వినూత్న గ్యాస్ట్రో న్యూరో హాస్పటల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే ఉచిత వైద్య శిభిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐఎమ్ఏ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ కోరారు. మంగళవారం వినూత్న హాస్పటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా ఉదరకోశ వ్యాధులకు, నరాలకు సంబంధించిన వ్యాధులపై అతిపెద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని అనేక రకాల ఖరీదైన పరీక్షలను ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మలబద్ధకం, రక్తవిరోచనాలు, తలనొప్పి, ఫిట్స్, కడుపు నొప్పి, నరాలకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారు ఈనెల 7న ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందవచ్చన్నారు. ఈ శిభిరానికి ఈనెల 5, 6 తేదీలలో పేర్లు నమోదు చేసుకోవాలని అన్నారు. త్వరలో క్యాన్సర్ రాకుండా ఉండేందుకు క్యాన్సర్ డిటెక్షన్ క్యాంప్‌ను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎమ్ఏ అధ్యక్షుడు డాక్టర్ ఆనంద్ దాండ్గే, కార్యదర్శి డాక్టర్ రమేష్ నాయక్, డాక్టర్ రామకృష్ణ, వినూత్న హాస్పటల్ వైద్యులు రిజ్వాన్ మహమ్మద్, వి ఉదయ్ సిబ్బంది పాల్గొన్నారు.



## బరిలో దిగేందుకు క్యూ కట్టిన ఆశావహులు

### గ్రామపంచాయతీ ఎన్నికల్లో భారీ ఎత్తున స్పందించిన అభ్యర్థులు
### కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గ్రామపంచాయతీ ఎన్నికల్లో తమ సత్తా చాటేందుకు భారీ ఎత్తున ఆశావహులు నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు భారీగా క్యూలో నిలబడి తమ భవితవ్యాన్ని తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 30న ప్రారంభం కాగా డిసెంబర్ 2 మంగళవారంతో ముగియనుంది. నామినేషన్ల ప్రక్రియకు చివరి రోజు కావడంతో గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థులతోపాటు వార్డు సభ్యులు సైతం పోటీ పడి అధిక సంఖ్యలో నామినేషన్లలో పాల్గొనడం విశేషం. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగే ఎన్నికల్లో ఎక్కవ శాతం యువత ఎన్నికల్లో బరిలో దిగుతుండడం విశేషం. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో మొత్తం పది మండలాలు ఉండగా గ్రామపంచాయతీలు 282 ఉన్నాయి. మొత్తం 1,77,564 మంది ఓటర్లు ఉండగా, అధికారులు 93 క్లస్టర్లుగా విభజించి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. మొత్తం 2418 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 917 ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తొలి రెండు రోజులు మందకొడిగా సాగిన నామినేషన్ల పర్వం చివరి రోజు మంగళవారం ఊపందుకుంది. దీంతో పోలింగ్ అదికారులు ఒక్కసారిగా అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి రావడంతో ఒత్తిడికి గురైనట్లు తెలిసింది. అదేవిధంగా అర్ధరాత్రి వరకు ఈ నామినేషన్లు ప్రక్రియ కొనసాగుతుండడంతో కొన్ని పోలింగ్ క్లస్టర్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం కలిగినట్లు దీంతో నామినేషన్ల స్వీకరణ సమయం అర్ధరాత్రి వరకు కొనసాగుతుందని సమాచారం.

## ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి

### యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** స్థానిక సంస్థలు సర్పంచ్ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులందరు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు తెలిపారు. ఆయన మంగళవారం గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా మోటకొండూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంను ఆయన సందర్శించారు. తహసిల్దార్, యంపిడిఒ, ఎస్ఐ తదితర సిబ్బందితో ఎన్నికల సామాగ్రి విషయంలో సూచనలు, సలహాలు చేశారు. నామినేషన్లు వేసినప్పటి నుండి ఫలితాలు వెలువడే వరకు అన్ని విధాలుగా బాధ్యత వహించి గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రతి విషయము సజావుగా జరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇందిర, సబ్ రిజిస్టర్ తాసిల్దార్ నాగదివ్య, ఎస్సై అశోక్, ఎంపీవో చంద్రశేఖర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా లేఅవుట్ ప్రక్రియ



కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** లేఅవుట్ ప్రక్రియ పనులను నియమ నిబంధనలకు లోబడి పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు . మంగళవారం ఆమె తన చాంబర్లో లే ఇరిగేషన్,మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులు తహసిల్దార్లతో లేఔట్లపై సమావేశం నిర్వహించారు. లేఔట్లకు సంబంధించిన భూసేకరణ అనుమతులను జాగ్రత్తగా పరిశీలించాలని ,అనధికార లేఅవుట్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదన్నారు. భూ రికార్డులు, డ్రైనేజీ, రోడ్డు వేల్పులు, నీటిపారుదల మార్గాలన్ని శా)య పద్ధతిలో ఉండాలని చెప్పారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ అధికారులు ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకొని అత్యవసర కాలువలు, ఫుల్ ట్యాంక్ లెవెల్ (FTL). పరిరక్షణపై రాజీపడకుండా, నీటి ముంపు ప్రమాదం లేకుండా మంజూరు చేయాలని,ముందు జాగ్రత్త తీసుకోవాలని అన్నారు. తాహసిల్దార్, మున్సిపల్ కమిషనర్లు అనుమతుల జారీ ప్రక్రియ వేగవంతం చేయడమే కాకుండా ఎవరైనా నియమాలను ఉల్లంగించి ఉంటే అలాంటి వారిపై పై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లా ఇరిగేషన్ అఅధికారి నాగార్జున, ఆర్ అండ్ బి ఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ గిరిధర్, నల్గొండ మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్,చిట్యాల మున్సిపల్ కమిషనర్, డిటిసిపిఓ కృష్ణవేణి హాజరయ్యారు.

**తిరస్కరించిన నామినేషన్లపై పరిశీలన**

గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా నల్లగొండ రెవెన్యూ డివిజన్ పరిధిలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్ల పై వచ్చిన అప్పీళ్లను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఆర్‌డిఓ కార్యాలయంలో పరిశీలించారు. నల్లగొండ డివిజన్ పరిధిలోని 9 మండలాలలో రిటర్నింగ్ అధికారులు తిరస్కరించిన నామినేషన్ల పై 19 అప్పీళ్లు రాగా, అప్పీళ్లపై నిబంధనల ప్రకారం ఆర్ ఓ ల సమక్షంలో పరిశీలించి ఆర్‌డిఓ రూపొందించిన జాబితాను, తీసుకోన్న నిర్ణయాలను ఆమె పరిశీలించారు. కాగా వచ్చిన 19 అప్పీళ్లలో 15 తిరస్కరణకు గురికాగా, 4 అప్పీళ్లు అంగీకరించినట్లు ఆర్ డి ఓ అశోక్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వివరించారు.కాగా చండూరు డివిజన్ కు సంబంధించి నామినేషన్ల పై 3 అప్పీళ్లు రాగా, రెండు తిరస్కరణ అయ్యాయని, ఒకటి అంగీకరించడం జరిగిందని చండూరు ఆర్డీవో శ్రీదేవి తెలిపారు. నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి,రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్లు ఉన్నారు.

# క్రీడ

## రోహిత్ వరల్డ్ కప్ ఆడినప్పుడు నేను స్కూల్‌లో ఉన్నా : బావుమా



భారత్, సౌతాఫ్రికా మధ్య నేడు (బుధ వారం) రెండో వన్డే జరగనుంది. రాయ్‌పూర్ వేదికగా ఈ మ్యాచ్ జరగ నుంది. తొలి వన్డేకు దూరంగా ఉన్న సౌతాఫ్రికా కెప్టెన్ తెంబా బావుమా రెండో వన్డేకు అందుబా టులో ఉండనున్నాడు. మంగళవారం నిర్వహిం చిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో బావుమా మాట్లాడుతూ.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రాకతో టీమ్‌ఇండియా బలంగా మారిందని, అయితే రోకోను ఎదుర్కో వడం తమకు కొత్తేమీ కాదన్నాడు. 2007 టీ20 ప్రపంచ కప్‌లో రోహిత్ ఆడుతున్నప్పుడు తాను స్కూల్‌లో ఉన్నానని బావుమా గుర్తుచేసుకున్నాడు. టీమ్‌ఇండియా 2007 టీ20 ప్రపంచ కప్ సాధించిన జట్టులో రోహిత్ శర్మ సభ్యుడిగా ఉన్న సంగతి తెలి సిందే. ‘కోహ్లీ, రోహిత్ వరల్డ్ క్లాస్ ప్లేయర్స్. వారితో చాలా మ్యాచ్‌లు ఆడాం. కొన్నిసార్లు పైచేయి సాధించాం. ఇవన్నీ సిరీస్‌ను మరింత ఉత్తేజకరంగా మారుస్తాయి’ అని బావుమా పేర్కొన్నాడు. సౌతాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో భారత్ 17 పరుగుల తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. కోహ్లీ (135) సెంచరీ చేయగా.. రోహిత్ (57) హాఫ్ సెంచరీతో మెరిశాడు. రాయ్‌పూర్‌లో జరిగే మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్‌ఇండియా పట్టుదలతో ఉంది. ఈ మైదానంలో భారత్ ఇప్పటివ రకు ఒకే వన్డే మ్యాచ్ ఆడగా.. ఘన విజయం సాధించింది.



## హార్దిక్ రీఎంట్రీ అదుర్స్..

### తొలి మ్యాచ్‌లోనే చెలరేగిన ఆల్‌రౌండర్

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా దుమ్మురేపాడు. సౌతాఫ్రికాతో టీ20 సిరీస్‌కు సన్నాహకంగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ ఆడుతున్న హార్దిక్ పాండ్యా తన తొలి మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 42 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 77 పరుగులతో అజే యంగా నిలిచి తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. ఆసియా కప్ 2025 సందర్భంగా గాయపడ్డ హార్దిక్ పాండ్యా.. ఆ తర్వాత ఆస్ట్రేలియా పర్యటనతో పాటు సౌతాఫ్రికాతో వన్డే సిరీస్కు దూరమయ్యాడు. గాయం నుంచి కోలు కున్న అతను మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున బరిలోకి దిగాడు. పంజాబ్‌తో మంగళవారం హైద రాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర హాఫ్ సెంచరీతో బరోడా విజ యంలో కీలక పాత్ర పోషిం చాడు. హార్దిక్ విధ్వంసంతో ఈ మ్యాచ్‌లో బరోడా 5 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదిం చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 222 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ(19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సులతో 50), అన్మోల్‌ప్రీత్ సింగ్(32 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులతో 69) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. బరోడా బౌలర్లలో హార్దిక్ పాండ్యా, రసిక్ సలామ్, అతిత్ షేత్ తలో వికెట్ తీయగా.. రాజ్ లింబానీ(3/36) మూడు వికెట్లు పడ గొట్టారు. అనంతరం బరోడా 19.1 ఓవర్లలో 3 వికెట్లకు 224 పరుగులు చేసి గెలుపొం దింది. హార్దిక్ పాండ్యా(42 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సులతో 77 నాటౌట్), శివాలిక్ శర్మ(31 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 47 నాటౌట్) పరుగులతో రాణించాడు. అశ్వని కుమార్, రమణ్‌దీప్ సింగ్ తలో వికెట్ తీసారు. తాజా ఇన్నింగ్స్‌లో హార్దిక్ పాండ్యా రీఎంట్రీకి మార్గం సుగుమమైంది. డిసెంబర్ 9 నుంచి సౌతాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్ ప్రారంభం కానుంది. డిసెంబర్ 9న కటక్ వేదికగా, డిసెంబర్ 11న న్యూ చండీఘర్‌లో రెండో టీ20, డిసెంబర్ 14న ధర్మశాల వేది కగా మూడో టీ20, డిసెంబర్ 17న లక్నో వేదికగా నాలుగో టీ20, డిసెంబర్ 19న అహ్మదాబాద్ వేదికగా ఐదో టీ20 జరగనుంది. ఈ సిరీస్‌కు భారత సెలెక్టర్లు ఇంకా జట్టును ప్రకటించ లేదు.

## వైభవ్ సరికొత్త రికార్డు



భారత యువ ఓపెనర్ వైభవ్ సూర్య వంశీ మరో రికార్డు నెలకొల్పాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అతిపిన్న వయసు (14 ఏళ్ల 250 రోజులు)లో సెంచరీ చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. మంగళవారం మహారాష్ట్ర, బిహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశీ ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ (108*; 61 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సులు) సెంచరీ బాదాడు. అంతకుముందు ఈ రికార్డు విజయ్ జోల్ పేరిట ఉండేది. మహారాష్ట్ర తరఫున ఆడిన విజయ్ 2013లో ముంబయితో జరిగిన 63 బంతుల్లో సెంచరీ చేశాడు. అప్పుడు అతని వయసు 18 ఏళ్ల 118 రోజులు. వైభవ్‌కు ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇది తొలి శతకం. అతను 15 ఏళ్లు నిండకముందే టీ20ల్లో మూడో సెంచరీ సాధించడం విశేషం. అంతకుముందు ఐపిఎల్ 2025, ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2025లోనూ వైభవ్ శతకాలు బాదిన సంగతి తెలిసిందే. ఇక, మహారాష్ట్ర, బిహార్ మ్యాచ్ విషయాని కొస్తే.. వైభవ్ సెంచరీతో చెల రేగడంతో తొలుత బ్యాటింగ్ చేసిన బిహార్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని మహారాష్ట్ర ఐదు బంతులు మిగిలుండగానే 7 వికెట్లు కోల్పోయి ఛేదించిది. కెప్టెన్ పృథ్వీ షా (66; 30 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్) మెరిశాడు. అతను 21 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. నీరజ్ జోషి (30), రంజిత్ (27), నిఖిల్ నాయక్ (22) రాణించారు.

# ఫోకస్


# మహిళ



## మహిళల సాధికారతే నేటి అవసరం..

పేదరికం కేవలం ఆర్థిక లోపం మాత్రమే కాదు. ఇది వ్యక్తుల గౌరవం, స్వేచ్ఛ, జీవన అవకాశాలను కూడా తగ్గిస్తుంది. 1948లో ఐక్యరా జ్యసమితి మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన ప్రతి వ్యక్తికి ఆహారం, నివాసం, వైద్య సేవలు, సామాజిక భద్రత హక్కుగా ఉన్నాయని స్పష్టంగా ప్రకటించింది. 2030 నాటికి పేదరిక నిర్మూల నను ప్రపంచ అభివృద్ధికి అత్యవసర కర్తవ్యంగా గుర్తించాయి. మహిళల సాధికారత, స్వాతంత్ర్యం, హక్కులు అనేవి లింగ సమా నత్వ సాధనలో పునాదులుగా ఉంటాయి. ఇవి పరస్పరపూరకాలు కూడా. మహిళలకు సమాన అవకాశాలు, సమాన వేతనం, నిర్ణయాధికారం కల్పించడం కేవలం పేదరికాన్ని తగ్గించడం మాత్రమే కాక, కుటుంబాలు, సమాజం, దేశం స్థిర అభివృద్ధి వైపు ముందుకు సాగడానికి పునాదులు సిద్ధం చేయడం అత్యవసరం. ఒక అంచనా ప్రపం చంలో ప్రతి పది మహిళల్లో ఒకరు అత్యంత పేదరికంలో జీవిస్తున్నారు. 2030 నాటికి 3.42 కోట్ల మంది ఇంకా పేదరికంలో ఉండ వచ్చు. పేదరికం, మహిళల ఆర్థిక వేరువేరు వ్యవస్థలు, లింగ వివక్షతో ముడిపడ్డాయి. మహిళలు రోజూ ఉచిత గృహపని, సంరక్షణ పనుల్లో ఎక్కువ సమయం గడుపుతున్నారు, ఇది కుటుంబాలు, సమాజం, ఆర్థిక వ్యవస్థలకు కీలకం. ఈ కృషికి గుర్తింపు, వేతనం ఇవ్వడం, మహి ళల సాధికారతకు మద్దతు ఇవ్వడం అత్యవసరం. 2030 స్థిర అభివృద్ధి కార్యసూచీ ఎవరూ వెనకబడరని, ముఖ్యంగా అత్యంత వెనకబడినవారిని ముందుగా చేరుస్తామని స్పష్టంగా ప్రకటిం చింది. దీన్ని సాధించడానికి సుస్థిర, సమగ్ర, సమానమైన ఆర్థిక వృద్ధి, పూర్తిస్థాయి ఉపాధి, గౌరవప్రదమైన పని, సామాజిక సమగ్రత, అస మానత తగ్గింపు, అనుకూల పర్యావరణం అవ సరం. ఆఫ్రికా, అత్యల్ప అభివృద్ధి చెందిన దేశాలు, చిన్న దీవి రాష్ట్రాలు, సంక్షోభభరిత ప్రాంతాల్లో పేదరికం ఇంకా పెద్ద సవాలుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా మహిళలు తగిన విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, గృహం, రవాణా, ఉద్యోగ అవకాశాల లేమి కారణంగా పేదరి కాన్ని ఎదుర్కొంటున్నారు. గృహపరమైన ఉచిత సేవల బాధ్యతలు, పిల్లల సంరక్షణ, కుటుంబ బాధ్యతలు వారి ఆర్థిక స్వావలంబనను తగ్గిస్తు న్నాయి. ఈ కృషికి సరైన గుర్తింపు లేకపోవడం సామాజిక అసమానతను పెంచుతుంది. ఆర్థిక సమగ్రత స్థితి నివేదిక 2024 ప్రకారం, ఆర్థిక సమగ్రత కేవలం ప్రభుత్వ పెట్టుబడిగా కాక, లక్షలాది జీవితాలను నిజంగా మార్చే శక్తివంత మైన మార్గం. పాలసీ రూపకర్తలు, అభివృద్ధి భాగస్వాములు ఈ కార్యక్రమాలను సాధ్యమై నంత విస్తృతంగా విస్తరించాలి. సమగ్రత, సమానత్వం,సుస్థిరత కలిగిన భవిష్యత్తును సృష్టించడం అత్యంత ప్రధానం. మహిళలు ఆర్థి కంగా సాధికారత సాధించినప్పుడు, కుటుం బాలు బలపడతాయి. పిల్లలకు మెరుగైన విద్య, ఆరోగ్యం లభిస్తుంది, సమాజం స్థిర అభివృద్ధి వైపు ముందుకు కదలుతుంది. సమాన వేతనం, సురక్షిత వాతావరణం, విద్యా అవకాశాలు, నాయకత్వ హక్కులు ప్రతి మహిళకు అందిం చడం సమాజ అభివృద్ధికి కీలక మార్గం. లింగ అసమానత, భద్రతా లోపం, అవకా శాల అసమానత తదితర అంశాలే పేదరి కానికి ప్రధాన కారణాలు. ఆ సమ స్యల నుంచి బయటపడినప్పుడే మహిళల సాధికారత సాధ్యమ వుతుంది.

## హాట్ ఫ్లాషెస్‌పై అపోహలు తొలగించుకోవాలి



మహిళల జీవితంలో మెనోపాజ్ (నెలసరి ఆగిపోవడం) అనేది సహజ దశ. అయితే ఈ సమయంలో వచ్చే హాట్ ఫ్లాషెస్ (హఠాత్తుగా వేడి పెరగడం, చెమటలు పడటం, గుండె వేగంగా కొట్టుకోవడం లాంటి లక్షణాలు) చాలా మంది మహిళలకు గందరగోళాన్ని, అసౌకర్యాన్ని కలిగిస్తాయి.

ఒక ప్రముఖ మెనోపాజ్ పరిశోధకురాలి ప్రకారం, హాట్ ఫ్లాషెస్ గురించి మనం సాధారణంగా చేసే 5 పొరపాట్లు ఇవి:

1. హాట్ ఫ్లాషెస్ కొద్దిసేపు మాత్రమే ఉంటాయి అనుకోవడం
వాస్తవానికి హాట్ ఫ్లాషెస్ కొన్ని నెలలు కాదు— కొన్ని సంవత్సరాలు కూడా కొనసాగవచ్చు. కొంతమందికి ఇవి చాలా తేలికగా ఉండవచ్చు.. మరికొందరికి రోజూ, వరుసగా, జీవిత నాణ్యతను ప్రభావితం చేసేలా రావచ్చు.

2. హాట్ ఫ్లాషెస్ రాత్రివేళ మాత్రమే వస్తాయి అనుకోవడం
రాత్రివేళ వచ్చే వాటిని నైట్ స్వెట్స్ అంటారు. కాని హాట్ ఫ్లాషెస్ రోజులో ఎప్పుడైనా రావచ్చు. పని సమయంలో, ప్రయాణంలో, బయట ఉన్నప్పుడు— ఎప్పుడు వచ్చినా మహిళలు చాలా అసౌకర్యంగా ఫీలవుతారు.

3. మనశ్శాంతి కోల్పోవడం వల్ల వస్తాయి అనుకోవడం
అవును, ఒత్తిడి ఒక కారకం కావచ్చు. కానీ హాట్ ఫ్లాషెస్ యొక్క ప్రధాన కారణం హార్మోన్ మార్పులు.. ప్రత్యేకంగా ఎస్ట్రోజెన్ తగ్గడం. ఇది శరీరంలోని ఉష్ణ నియంత్రణ వ్యవస్థను అస్థిరం చేస్తుంది. కాబట్టి ఇవి కేవలం స్ట్రెస్ సమస్యలు కాదు.

4. హార్మోన్ థెరపీ మాత్రమే పరిష్కారం అనుకోవడం
హార్మోన్ థెరపీ కొందరికి మంచి ఫలితం ఇస్తుంది. కానీ అందరికీ అది సరిపోదు. కొంతమంది ఆరోగ్య పరిస్థితుల కారణంగా హార్మోన్ మందులను వాడలేరు. అందుకే హార్మోన్ కాకుండా ఇతర చికిత్సల అవసరం పెరిగింది.

5. వయస్సు ఎక్కువైనప్పుడు మాత్రమే వస్తాయి అనుకోవడం
మెనోపాజ్ లక్షణాలు 40 ఏళ్ల వయసు దాటినపుడే వస్తాయని అనుకుంటాం. కానీ వాస్తవానికి పెరిమెనోపాజ్ అనే దశ (మెనోపాజ్‌కు కొన్ని సంవత్సరాల ముందే ప్రారంభమయ్యే మార్పులు) 35—45 సంవత్సరాల మధ్యే మొదలై, హాట్ ఫ్లాషెస్ అప్పుడే కనిపించవచ్చు.

## హమాలీ కార్మికులకు లైసెన్సులు, గుర్తింపుకార్డు, ఇన్సూరెన్స్ సౌకర్యం

### సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్ డిమాండ్



ప్రజాపక్షం/నర్సంపేట : హమాలీ కార్మికులకు లైసెన్సులు గుర్తింపు కార్డు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వ్యవసాయ మార్కెట్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. నర్సంపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ కార్యాలయం ప్రాంగణంలో వ్యవసాయ గ్రేన్ మార్కెట్ హమాలీ, దాడువాయి, స్వీపర్, చాట, ఎడ్లబండ్ల కార్మికులు మార్కెట్ యార్డ్‌లో పనిచేస్తూ లైసెన్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో ఉన్న హమాలీ కార్మికులు 300 మంది కార్మికులు మార్కెట్లో పనిచేస్తుండేవారని, కొత్తగా వచ్చిన హమాలీ కార్మికులకు లైసెన్సులు, గుర్తింపు కార్డు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ లో పనిచేసే సమయంలో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, యూనిఫామ్, విశ్రాంతి గదులు,సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్లో పనిచేసేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే పది లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటియూసి నర్సంపేట డివిజన్ అధ్యక్షులు ఎడ్ల నాగులు, కోశాధికారి ఓదెల కనకమల్లు, కార్యదర్శి ఎల్లబోయిన రవి, చిన్నాల సారంగం, సోమయ్య, మొగిలి, సాయిలు, అనిల్, రమేష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## ఆర్‌కెపి ఓసి ఫేజ్—2 ప్రాజెక్టుతో ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు

### సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి లక్ష్మణ్



ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ : ఆర్‌కెపి ఓసి ఫేజ్—2 ప్రాజెక్టు ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో ప్రజలకు, కాలనీలకు ఇబ్బందులు కలిగితే సిపిఐ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఓసి వల్ల ఆర్‌కె—4 ప్రాంత నివాసులు కాలుష్యం, బ్లాస్టింగ్ వల్ల ఇళ్లు దెబ్బతిని అనారోగ్యంతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని, స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఎంఎఫ్‌టి, సిఎస్‌ఆర్ నిధులతో సిసి రోడ్లు, డ్రైనేజీలు, బోర్వెల్స్ ఏర్పాటు చేసి ఏరియాను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, వనం సత్యనారాయణ, కాదండి సాంబయ్య, నక్క వెంకటస్వామి, ఏగుడ మొండి, నాయకులు ఈరవేణి రవీందర్, మామిడాల సత్యనారాయణ, బోయ పోతుల కొమురయ్య, తోకల రాజన్న, మురళి పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రి కార్మికులకు రూ.26వేలు వేతనం

### మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్

### ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన


మహబూబ్‌నగర్‌లో...

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : తెలంగాణ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలు, వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, సిహెచ్‌సి కేంద్రాలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. గడువు ముగిసిన పాత టెండర్ ఏజెన్సీలను రద్దు చేసి తక్షణమే నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, కార్మికులకు జాతీయ పండుగ ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని డిమాండ్‌చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులు విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్ నాయకులు కార్మికులు, బి.చెన్నయ్య, జే.నరసింహ, జి.మొగులప్ప, బుచ్చన్న, రాఘవేందర్, అంజి, వీరాంజనేయులు, శ్రీను, మున్నా, మన్యం, కృష్ణ, రాఘవేందర్, యాదగిరి, రామస్వామి, వెంకటయ్య, రాకేష్, వసంతదేవి, సత్యమ్మ, మల్లమ్మ, మంగమ్మ, లక్ష్మమ్మ, శిరీష, అరుణ, అలివేల, సునీత, పద్మ, చిట్టెమ్మ, నాగలక్ష్మి, ఇందిరా, జ్యోతి, సుధా, రాధా, లక్ష్మి, అంజమ్మ, సవిత, మంజుల, మమత, దేవానంద్, శేఖర్ బాలరాజ్, శంకర్, ప్రకాష్, ఆంజనేయులు, వివేక్ పాల్గొన్నారు.

### నూతన టెండర్లు వెంటనే పిలవాలి

వరంగల్ : ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, నూతన టెండర్లను వెంటనే పిలవాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ డిమాండ్ చేశారు. ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు శానిటేషన్, పేషంట్‌కేర్, సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వరంగల్ సికెఎం ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన గేట్ ఎదుట, ఎంజిఎం హాస్పిటల్ లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి దామర కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్, బొట్ల శ్రీనివాస్, సికెఎం హాస్పిటల్‌కార్యదర్శి ఎం.శంకర్, సక్కుబాయి, సంధ్య, ఎంజిఎం హాస్పిటల్ కోశాధికారి మంద సంజీవ, గడల రమేష్, శ్యామ్, కోమల, మహేష్, రాజేశ్వర్, రమ, లక్ష్మణ్, రజిత, రవిందర్, లక్ష్మి, లావణ్య, స్వరూప, రాజు, కమలాకర్, అకిల్, రాము, బాబు, రాజు, రమ సిబ్బంది పాల్గొన్నారు.

### కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం

ఘట్‌కేసర్ : ఐహెచ్‌ఎఫ్‌ఎం ఎస్ కాంట్రాక్టు శానిటేషన్ కేర్,సెక్యూరిటీ కార్మికులకు నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు కల్లూరి జయచంద్ర, సిపిఐ మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్‌కు మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ టెండర్ల కాలపరిమితి ముగిసిందని వెంటనే నూతన టెండర్లను పిలిచి కనీస వేతనం చెల్లించాలని కోరుతూ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని జయచంద్ర తెలిపారు.

### కాంట్రాక్టు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నిజామాబాద్ అర్బన్ : కాంట్రాక్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, పాత కాంట్రాక్టు రద్దుచేసి మెడికల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాన్ని పెంచాలని ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి వై.ఓమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట గేట్ ధర్నా రాష్ట్ర మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు అనారోగ్యంతో వచ్చే పేద బలహీనవర్గాల ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కార్మికుల వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు డి. చక్రపాణి, మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ నాయకులు భాగ్యలక్ష్మి, స్వరూప, భారతి, కవిత, రాధాకుమార్, వెంకటేశ్, సాయి, నరసయ్య పాల్గొన్నారు.

### పాత ఏజెన్సీల టెండర్లు రద్దుచేయాలి

భువనగిరి రూరల్ : యాదాద్రి భువనగిరి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్‌లో కాలం చెల్లిన పాత ఏజెన్సీల టెండర్లను రద్దుచేసి సానిటేషన్, సెక్యూరిటీ గార్డు కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందే విధంగా నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నూతన టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసి కార్మికుల వేతనాలు పెంచాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించి సూపరింటెండెంట్ పాండు నాయక్‌కి కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త టెండర్లు పిలిచి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు గుండు వాణి, నీలం నరసింహ, సోమ నరసయ్య, బట్టుపల్లి లావణ్య, శారదా, లలిత, సులోచన, భారతమ్మ, హేమలత, విజయలక్ష్మి, సురేఖ, శేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


వరంగల్‌లో..


ఘట్‌కేసర్‌లో..



నిజామాబాద్‌లో..



యాదాద్రి భువనగిరిలో..

## సిపిఐలో 20 కుటుంబాలు చేరిక

### పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్సీ సత్యం



ప్రజాపక్షం/మునుగోడు : నల్లగొండ జిల్లా మునుగోలు మండలంలోని కొరటికల్ గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 20కుటుంబాలు గ్రామ సిపిఐ నాయకులు దండు వెంకటరమణ, మందుల పాండు. మునుగోటి దయాకర్ ఆధ్వర్యంలో మంగళవారం సిపిఐలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఎర్రకండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరటికల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల వారు పార్టీపై విశ్వాసంతో సిపిఐలో చేరడం శుభ పరిణామం అన్నారు. స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు గ్రామానికి చెందిన నీతి నిజాయితీతో గ్రామ అభివృద్ధికి పాటుపడే నాయకులను గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో దండు వెంకటరమణ, స్వప్న, అనంతమ్మ, భీమనపల్లి నరసింహ, కుప్పటి భూపాల్, దండు నవీన్, దండు సైదులు, దండు శ్రీను, ఆరెకంటి యుగంధర్, భీమనపల్లి నవీన్ ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, దండు యాదయ్య. రొమ్ముల యాదయ్య, మిర్యాల యాదయ్య, అద్దంకి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/పరిగి** :మండల పరిధిలోని సుల్తాన్‌పూర్, రంగంపల్లి, గడసింగపూర్ , గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా సెంటర్‌కు వచ్చిన ధాన్యంను వెంటనే రైతుల నుంచి కొనుగోలు చేసి టాకింగ్ చేసిన విధంగా రైస్ మిల్లులకు ధాన్యం వెంటనే పంపవలసిందిగా సెంట్ ఇన్చార్జీలకు ఆదేశించారు. ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నామని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కావలసిన గోనె సంచులను, లారీలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.



## పారిశుద్ధ్య కార్మికులను సత్కరించిన జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా సర్కిల్ ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం జివిపి పాయింట్ వద్ద స్వచ్ఛ మిషన్ ద్వారా స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిహెచ్‌ఎంసి అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ విచ్చేశారు. ఓల్డ్ మున్సిపల్ ఆఫీస్ మసీద్ వద్ద గల జివిపి పాయింట్ జిహెచ్‌ఎంసి పారిశుద్ధ్య సిబ్బంది సిసి కెమెరా విత్ మైక్‌ను బిగించి పారిశుద్ధ్య కార్మికులతో నిత్యం పర్యవేక్షిస్తూ చెత్తను ఎవరు వేయ కుండా జివిపిని ఎలిమినేట్ చేసిన వై.కుమార్, జవాన్ రామకృష్ణ, ఎ స్‌ఎఫ్‌ఎలులక్ష్మి , మంజుల, అంజలి, సాయిలు, కార్మికులు, ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, వర్కర్లకు బెస్ట్ అవార్డులు అందజేసి రఘుప్రసాద్ శాలువాతో సత్కరించి అభినందించారు. పారిశుద్ధ్య విభాగం నుండి సుదర్శన్ పేపర్ రీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బి నగర్ డిసిఎస్‌డబ్ల్యూ ఎం. గోపాల్‌రావు, ఇన్‌చార్జ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సాయితరుణ్, జవాన్లు, ఎస్‌ఎఫ్ ఎలు, తదితరులు పాల్గొన్నారు.



## శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రాష్ట్రంలో మొదటి స్థానం, దేశంలో ఏడో స్థానంలో ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎంపికైన సందర్భంగా శామీర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఉమ్మడి శామీర్‌పేట మండలాల ప్రజలు, నాయకులు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర హాజ్ కమిటి మెంబర్ ముజుబుద్దిన్, శామీర్‌పేట మండల కాంగ్రెస్ ప్రసిడెంట్ వై ఎస్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి చాట్లపల్లి నర్సింగరావు, అలియాబాద్ మాజి సర్పంచ్ కమఠం కృష్ణారెడ్డి, మూడుచింతలపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, మాజి సర్పంచ్ కిషోర్‌యాదవ్, కట్టమైసమ్మ ఆలయ కమిటి చైర్మన్ మహేందర్‌యాదవ్, ఇలాసాగరం అశోక్, మహిళా శక్తి మై వాయిస్ రాష్ట్ర అధ్యక్షురాలు హైమారెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలంలోని జడ్పిహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై ట్రాఫిక్ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం ట్రాఫిక్ ఎసిపి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు నియమాలను పాటించాలని ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలకు లోబడి వాహనాదారులు తమ వాహనాలను నడుపాలని చెప్పారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట పెట్టుకోవాలని హెల్మెట్ తప్పకుండా ధరించాలని దీంతో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదాల బారిన పడకుండా కాపాడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సిఐ. శంకరయ్య, ఎంఇఒ కమలాకర్, ట్రాఫిక్ ఎస్‌ఐ నవీన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వేణు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు.



## ఎస్‌ఐ దశరథకు ఘనంగా వీడ్కోలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహించిన దశరథ బదిలీపై మాదాపూర్ ఎస్‌ఒటికి బదిలీ అయ్యారు. మంగళవారం శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ ఎస్‌ఐ దశరథను శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా దశరథ ఉత్తమ సేవలు అందించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఐ రాజు, ఎస్‌ఐలు శశివర్ధన్‌రెడ్డి, సోమిరెడ్డి, ఎఎస్‌ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు శాస్త్ర సాంకేతిక విజ్ఞానంలో ముందుండాలి

### కలెక్టర్ హరిచందన దాసరి







**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణలను పెంపొందించేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సుల్తాన్‌బజార్‌లోని శ్రీ హనుమాన్ వ్యాయామశాల పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి సైన్స్‌ఫైర్ అవార్డ్స్ మానక్ ఎగ్జిబిషన్ జిల్లాస్థాయి బాల్ వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖ, మాజీ రాజ్యసభ సభ్యులు, హనుమాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు వి.హనుమంతరావు, సెక్రటరీ మైథిలి శరణ్ పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌లో ఇన్‌స్పైర్ అవార్డ్స్ కింద 179ఎగ్జిబిట్లు, అలాగే బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలో 130 పైగా మోడళ్లు ప్రదర్శించారు. విద్యార్థులు ప్రయోగాత్మకంగా ఆలోచించి శాస్త్రీయ భావనలను బలోపేతం చేసుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని కలెక్టర్ అన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులేనని, చదువుతో పాటు టెక్నాలజీలో ముందంజ వేయాలని సూచించారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్, బాల్ వైజ్ఞానిక ప్రదర్శనలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుండటంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు రాణించాలని, సైన్స్ అంటే జీవితం, భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని కలెక్టర్ అన్నారు. ప్రదర్శనలో భాగంగా పాల్గొన్న పాఠశాలల విద్యార్థులను అభినందించారు. రెండు రోజులపాటు కొనసాగనున్న ఈ ప్రదర్శనకు వివిధ యూనివర్శిటీల ప్రొఫెసర్లు జ్యూరీలుగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డిఇఒ ఆర్. రోహిణి, డిప్యూటి డిఇఒ వెంకటేశ్వర్లు, సైన్స్ అధికారి ధర్మేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తరగతి గదిలోనే దేశ భవిష్యత్**

తరగతి గదిలోనే దేశ భవిష్యత్తు ఆవిర్భవిస్తుందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. తిరుమలగిరి మండల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు మంగళవారం కలెక్టరేట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ సెక్షన్ల పనితీరు, బాధ్యతలను ఎఒలు, సెక్షన్ అధికారులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ స్థాయిలో ఉన్న నాణ్యతతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతోందని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకం, మౌలిక వసతులు, బోధన విధానాలపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచమే ఒక పాఠ్య పుస్తకమని, విద్యార్థులు చుట్టూ జరుగుతున్న విషయాలను తెలుసుకోవడం, కొత్త సాంకేతికతలు, సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని సూచించారు.

విద్యారంగంలో ప్రభుత్వ సంస్కరణల ఫలితంగా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఇలాంటి పర్యటనలు మేధాశక్తి పెంపునకు దోహదం చేస్తాయన్నారు.

## నామినేషన్ స్వీకరణ కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం /వికారాబాద్** : వికారాబాద్,నవాబ్ పేట్ మండలాల్లో నామినేషన్ కేంద్రాలను తనఖీ చేసిన ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్ యాస్మిన్‌బాష మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోని సిద్దులూర్, నవాబ్‌పేట్ మండల పరిధిలోని నవాబ్‌పేట్, ఏక్మామిడి గ్రామ పంచాయతీ కార్యాలయాలలో నిర్వహిస్తున్న ఎన్నికలను పురస్కరించుకొని గ్రామ పంచాయతీ లో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాల ను పరశీలించారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ను పరిశీలించారు. అవసరమైన వారికి సహాయసహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. రాష్ట ఎన్నికల సంఘం నియమనిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తప్పకుండా అమలయ్యేలా చూడాలని, నిర్ణీత గడువు లోపల నామినేషన్‌లు స్వీకరించేందుకు టోకటర్లు జారీ చేయాలని అధికారులకు సూచించారు.

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు ఖర్చుల వివరాలపై పూర్తి అవగాహన కలిపించాలన్నారు. వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు కొత్త బ్యాంక్ అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సాధారణ పరిశీలనలో భాగంగా పంచాయతీ అధికారి జయసుధ, ఆర్డిఒ వాసుచంద్ర, డిప్యూటి కలెక్టర్ పూజ, డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిడిఒ వినయ్‌కుమార్, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద స్థలంలో నిర్మాణ దారులకు అనుకూలంగా కూల్చివేతలు

**ప్రజాపక్షం/దుండిగల్** : దుండిగల్ మున్సిపాలిటి గాగిల్లపూర్‌లోని వివాదస్పద స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ యంత్రాంగం నిర్మాణదారులకు అనుకూలంగా పైపై కూల్చివేతలు చేపట్టారు. అక్రమ నిర్మాణాలను తొలగించిన తీరు అందరిని ఆ శ్చర్యానికి గురిచేసింది. కోర్టు పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగించాల్సి ఉన్న మున్సిపల్ సిబ్బంది పైపై కూల్చివేతలు చేపట్టి వెనుతిరుగడంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముడుపులతో సరిపెడుతున్న మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారంటు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గాగిల్లాపూర్ సర్వేనెంబర్ 235 లో ఓ స్థలం కోర్టు వివాదంలో ఉంది. ఈ స్థలం మాదంటే మాది అని ఆత్మహత్యలు , గొడవల దాక వెళ్లింది. అదే స్థలంలో పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు పరిధిలో ఉన్న స్థలంలో నిర్మాణాలు చేపట్టరాదు, అదేమీ పట్టదన్నట్లు ఓ వర్గం కోర్టు తీర్పును బేఖాతర్ చేస్తు సుమారు ఏడు గుంటలు ఆక్రమించి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో మంగళవారం పైపై కూల్చివేతలు చేపట్టి వెనుతిరుగడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముడుపులతో సరిపెడుతున్న మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారంటు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేచి చూడాలి ఇకనైనా మున్సిపల్ అధికారులు నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తారో లేదో..

## వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అలియాబాద్ మున్సిపాలిటి లాల్‌గడిమలక్‌పేటకు చెందిన ముద్దం నర్సింగరావు(55) నగరంలోని ప్యాట్నీ సెంటర్ సికింద్రాబాద్‌లో సెక్యూరిటిగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే ఇంటి నుంచి కాలినడకన లాల్‌గడిమలక్‌పేట బస్టాప్‌కు వెళ్తుండగా అంబేద్కర్ కాలనీ నుంచి ప్రధాన రోడ్డును దాటుతుండగా జగ్గంగూడ వైపు నుంచి ఒక గుర్తు తెలియని వాహనం వెనకాల నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింగరావుకు తలకు, చెవి, ముక్కు భాగంలో తీవ్ర రక్తశ్రావమై రోడ్డుపై పడిపోయాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఘనపూర్‌లోని మెడిసిటి ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు నర్సింగరావు మృతి చెందాడని తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## పోలీస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎస్‌పి

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్/నావబ్‌పేట్:** వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్, నవాబ్‌పేట్ మండల పరిధిలోని వికారాబాద్ జిల్లా ఎస్‌పి మోమిన్‌పేట్, నావబ్‌పేట్ , పోలీస్‌స్టేషన్‌లను ఆకస్మికంగా సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ,రిసెప్షన్,వివిధ విభాగాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మోమిన్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నామినేషన్ సెంటర్లను అక్కడ నిర్వహిస్తున్న బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు.

నవాబ్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏక్‌మామిడి గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతవాతావరణంలో జరిగేలా ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ అధికారి , సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకట్, ఎస్,అరవింద్, ఎస్‌ఐ పుండ్లిక్ పాల్గొన్నారు.



## చీమల్‌దారి గ్రామ సర్పంచుకు ఒక్కరే నామినేషన్

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్** : వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల పరిధిలోని చీమల్‌దారి గ్రామంలో సర్పంచు, వార్డు మెంబర్ ఒక్కరే నామినేషన్ రావడంతో గ్రామ సర్పంచుగా ఎల్లకొండ కల్పణ హరిష్‌కుమార్ రెడ్డిని గ్రామపెద్దల సమక్షంలో ఒక్కరే నామినేషన్ వేయడంతో సర్పంచ్ అభ్యర్థిగా ఏకగ్రీవం అయినట్లు తెలుస్తుంది.

ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే పథకాలను పేద ప్రజలకు అందేలా అధికారులతో కలిసి తన వంతు సహకారం అందిస్తామని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామ అభివృద్ధికి ఈ ఐదు సంత్సరాలు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రజలకు, స్నేహితులకు, కుటుంబ సభ్యులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పంచాయతీల్లో 'హస్తం' హవా

### తాండూరు నియోజకవర్గంలో 12గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

**ప్రజాపక్షం/తాండూరు:** పంచాయతీ పోరులో అధికార పార్టీ హస్తం హవా కొనసాగుతోంది. మొదటి విడత నామినేషన్ల పర్వం ముగియడంతో తాండూరు నియోజకవర్గం పరిధి నాలుగు మండలాల్లోని గ్రామ పంచాయతీలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సవాల్‌గా తీసుకున్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పంచాయతిలో అధిక సంఖ్యలో సర్పంచ్ స్థానాల ను కైవసం చేసుకోవడానికి భారి స్కెచ్ వేశారు. నామినేషన్ల దాఖలు, నామినేషన్ పత్రాల పరిశీలన పూర్తి కావడంతో పాటు నామినేషన్ల ఉపసంహరణ ఒక రోజు మాత్రమే గడువు ఉంది. ఉపసంహరణ చివరి రోజు అత్యధిక సర్పంచ్ స్థానాలను హస్త గతం చేసుకునేందుద్సిద్ధమవుతున్నారు. ఈ పాటికే తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలల్లోని గ్రామపంచాయతీలలో 12 సర్పంచ్ స్థానాలు దాదాపుగా ఏకగ్రీవం అయినట్లు తెలుస్తోంది. వీటిని అధికారులు అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. ఏకగ్రీవమైన సర్పంచ్ అభ్యర్థులు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని ప్రత్యేకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. మరో పక్క ప్రతిపక్ష పార్టీలైన బిఆర్‌ఎస్ పార్టీ కూడా అందులో కొన్ని గ్రామాలను తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. అందుకుగాను మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నాలుగు మండలల్లోని అన్ని గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తూ ఏకగ్రీవ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించింది. పంచాయతీ పోరులో బిజెపి పార్టీ గ్రామ పంచాయతీలపై పెద్దగా ఫోకస్ పెట్టినట్లుగా కన్పించడం లేదు. తమ అభ్యర్థులను రంగంలోకి దించినప్పటికి ఏకగ్రీవాలపై దృష్టి సారించ లేదు. తాండూరు నియోజకవర్గంలో 149 సర్పంచ్ స్థానాలకు గాను 790 మంది, 1228 వార్డు స్థానాలకు గాను 2447 మంది అభ్యర్థులు తమ నామినేషన్ల దాఖలు చేసిన విషయం తెలిసిందే. నియోజవర్గంలో ఇప్పటివరకు 12 గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. పెద్దేముల్ మండలంలో సిద్దన్నమడుగు తాండ సర్పంచ్‌గా విజయ్, దుగ్గపూర్‌లో గ్రామ సర్పంచ్‌గా బుడిగ జంగం మంగమ్మలు, యాలాల మండలంలో లక్ష్మి నారాయణపూర్ సర్పంచ్‌గా గుర్రాల నాగమణి, సంగెంకుర్దు గ్రామంలో సర్పంచ్‌గా సుధాలక్ష్మి , కిష్టాపూర్ సర్పంచ్‌గా స్వప్న, సంగాయిగుట్ట తాండా సర్పంచ్‌గా కిషన్ నాయక్‌లు ఏకగ్రీవం కానున్నారు. బషీరాబాద్‌లో మంతన్ గౌడ్ సర్పంచ్ స్థానం ఎస్టి రిజర్వు కావడంతో ఆ గ్రామంలో ఒకే ఎరుకుల కుటుంబం మరో వ్యక్తి నామినేషన్ దాఖలు చేయడంతో ఎరుకల భీమప్ప ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సర్పంచ్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని బోణి కొట్టింది. హంక్యానాయక్ తాండలో అనిత రాథోడ్, బాబు నాయక్ తాండలో అనితలు సర్పంచ్‌గా ఏకగ్రీవం కానున్నారు. తాండూరు మండలంలో చిట్టి గణపూర్ సర్పంచ్‌గా విజయ్‌కుమార్, రాంపూర్ కింద తాండ సర్పంచ్‌గా వెంకట్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నప్పటికి అధికారికగా ప్రకటించాల్సి ఉంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసే వరకు మరిన్ని గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి.







## ప్రజలకోసం పనిచేసే వ్యక్తి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి : ఎఎంసి చైర్మన్

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో ఎవరు రౌడి రాజకీయాలు చేశారనేది ప్రజలకు తెలియనిది కాదని, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పటోళ్ల బాల్‌రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ సూచించారు. తాండూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రౌడీ రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలను వారు తీవ్రంగా ఖండించారు. మంగళవారం తాండూరు క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ గ్రంథాలయ చైర్మన్ మురళీకృష్ణగౌడ్‌పై, మరో యువ నాయకుడు అశోక్‌పై ఎవరు దాడి చేశారో తాండూరు ప్రజలకు తెలియనిది కాదని, ఇది బిఆర్‌ఎస్ నాయకులు, పైలెట్ రోహిత్‌రెడ్డి రౌడి రాజకీయలకు నిదర్శనం కాద అని ప్రశ్నించారు. ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి గెలిచిన రెండు సంవత్సారాల కాలంలోనే అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు నిరంతరం ప్రజల మధ్య ఉంటూ తాండూరు అభివృద్ధికి మచ్చలేని నాయకుడిగా పనిచేస్తున్నారని అన్నారు.మరో పది సంవత్సరాలు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, తాండూరు ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డియే ఉంటారని గుర్తు చేశారు. ఎవ్వరు ఎవ్వరిని బయటకు పంపాలో తాండూరు ప్రజలకు తెలుసునని తీవ్రంగా మండిపడ్డారు. తాండూరులో అత్యాధిక సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైన పైలెట్ రోహిత్‌రెడ్డి ఒకరిపై నిందలు వేయడం మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పట్లోళ నర్సిములు, సీనియర్ నాయకులు రాజుకుమార్ తదితరులు ఉన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు : ఆర్ఐ



**ప్రజాపక్షం/కేశంపేట:** ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేశంపేట ఆర్ఐ చెన్నకేశవులు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో సమీపంలో ఆర్ఐ చెన్నకేశవులుతోపాటు ఫ్లయింగ్ స్కాడ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్ఐ చెన్నకేశవులు మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని వివరించారు. ప్రజలు సరైన గుర్తింపు ఉన్న రూ.50వేల వరకు మాత్రమే నగదు తీసుకువెళ్ళాలని, వాహనాల్లో మద్యం, నగదు రవాణా చేస్తే చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఓ టర్లను ప్రలోభపెట్టే విధంగా ఎవరు వ్యవహరించినా వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## గ్రామీణ మహిళలకు ఈవెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టిసిఇఐ) ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్స్ట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌పై సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (ఎస్ఈఆర్పీ) సహకారంతో నవంబర్27 నుంచి డిసెంబర్ 1వరకు మహిళలకు శిక్షణ అందించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్‌చాన్సల ర్ ప్రొఫెసర్ వై ఎల్ శ్రీనివాస్, ఎస్ఇఆర్‌పి సిఇఒ డి.దివ్య, ఎన్ఐటిహెచ్ఎం డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, టిసిఇఐ అధ్యక్షుడు ఎ.బలరాం, టిసిఇఐ జనరల్ సెక్రటరీ రవి బురా హాజరయ్యారు. అనంతరం వైస్‌చాన్సలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలోని 32 జిల్లాల నుండి ఎంపికైన 180 మంది మహిళలకు ఎస్ఇఆర్‌పి సహకారంతో ఈవెంట్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ అందించండం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన మహిళా ఈవెంట్ మేనేజర్లను వారి జిల్లాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.


## ఆడపిల్లల ఆత్మవిశ్వాసానికి కరాటే

మాజీ సైనికులు, బ్లాక్ బెల్ట్ గ్రహీత భూషణ్ పటేల్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** ఆడపిల్లల ఆత్మవిశ్వాసానికి కరాటే విద్య ఎంతో అవసరమని మాజీ సైనికులు, బ్లాక్ బెల్ట్ గ్రహీత భూషణ్ పటేల్ సూచించారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని న్యూ పవర్‌కుంగ్ ఫూ అకాడమీ మాస్టర్స్ బాలరాజ్, అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో బాలికలకు కరాటే శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా భూషణ్ పటేల్ మాట్లాడుతూ మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, ఆడ పిల్లల వ్యక్తిత్వ వికాసానికి, సమాజంలో వారి స్థాయిని పెంచేందుకు కరాటే విద్య దోహద పడుతుందన్నారు. ప్రతి విద్యార్థినీ తల్లిదండ్రులు విధిగా బాలికలకు చిన్నతనం నుండే చదువుతో పాటు కరాటే విద్యనే నేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. విపత్కర పరిస్థితుల్లో తమను రక్షించుకోవడంలో కరాటే ఉపయోగపడుతుందన్నారు.

## సేవా కార్యక్రమాలు విస్తృతం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్‌కెపురం డివిజన్ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగిన నిర్వహించిన ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా ఉప్పల బాలస్వామి, ప్రధాన కార్యదర్శిగా భవనాశి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారిని చిలుక బ్రదర్స్ ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజంలో తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం, శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయ మాజీ చైర్మన్ జగిని రమేష్, సంఘం సభ్యులు మంచుకొండ సైదయ్య, బ్రాహ్మణపల్లి రాములు, గుండా రామకోటి శ్రీనివాస్, సోమనాదం, రామారావు, మురళి, జగిని సోమయ్య పాల్గొన్నారు.

## వీధికుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ శివ గంగ కాలనీలో 8 సంవత్సరాల మూగ బాలుడిపై వీధికుక్కలు దాడి చేసిన తీవ్రంగా గాయపరిచాయి. జిహెచ్ఎంసి అధికారులు బాలుడి ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ఆరోపించారు. స్థానిక బిజెపి నాయకులుతో కలిసి గాయపడ్డ బాలుడి కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సహాయంగా రూ.10 వేలు అందించారు దగ్గర ఉండి 108అంబులెన్స్‌లో నల్లకుంట ప్రభుత్వ హాస్పత్రిలో చేర్పించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసిన వీధికుక్కల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోకుండా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## నేడు పంచాయతీ తొలిదశ ఎన్నికల నామినేషన్ల విత్‌డ్రాలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్లు విత్‌డ్రా చేసుకునేందుకు బుధవారం చివరి రోజు కావడంలో స్వాతంత్రులుగా వేసిన అభ్యర్థులకు విత్‌డ్రా చేసేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు ముమ్మరంగా యత్నిస్తున్నారు. క్రియాశీలకంగా ఉన్న అభ్యర్థుల నామినేషన్లు విత్‌డ్రా చేయిస్తే తాము గెలుపొందుతామని ఆశిస్తున్న నేతలు నామినేషన్ విత్‌డ్రా చేయించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏ రాజకీయ పార్టీ నేతలు ఎక్కడికి వెళ్తున్నారు..ఎవరు నామినేషన్ విత్‌డ్రా చేసుకుంటున్నారనే విషయాలపై పంచాయతీల్లో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ఒక్కసారిగా ఎన్నికల రాజకీయ వేడి మొదలైంది. పోటీలో ఉండే అభ్యర్థులు ఏ గుర్తులు వస్తాయోనని నేతలు జోరుగా చర్చించుకుంటున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. నామినేషన్ల విత్‌డ్రాకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పోటీ నుండి తప్పుకునేందుకు నేతల బుజ్జగింపులకు ఎక్కువగా పెరిగాయి. ఏది ఏమైనప్పటికి పంచాయతీ ఎన్నికల నామినేషన్ విత్‌డ్రాకు భారీ తెర పడటమే కాకుండా పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు ఎన్నికలు అధికారులు ప్రకటించనున్నారు. దాంతోనే పంచాయతీల్లో అసలైన పోరు ఏర్పడే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# వడివడిగా 'బమ్మృక్నుద్దౌలా' పునరుద్ధరణ పనులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పాతబస్తీ గర్వకారణమైన బమృక్నుద్దౌలా చారిత్రక చెరువును హైడ్రా పునరుద్ధరిస్తుండగా, మరికొద్ది రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి రానుంది. హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ చెరువు అభివృద్ధి పనులను జిహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. చెరువు చుట్టూ బండ్ ఇన్‌లెట్, ఔట్ లెట్స్, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల ప్లే ఏరియా, వృద్ధుల కోసం సీటింగ్ జోన్‌లు, ఓపెన్ జిమ్, పచ్చికబయళ్లు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. చెరువును మొత్తం సిసిటివిలతో కవర్ చేసి ప్రధాన కార్యాలయంతో అనుసంధానించనున్నారు. చారిత్రకంగా నిజాంల కాలంలోని ఈ చెరువు ఔషధ గుణాలున్న నీటికి ప్రసిద్ధి. గతంలో ఆక్రమణలతో 4.12 ఎకరాలకు కుదించబడిన చెరువును పునరుద్ధరిస్తూ ప్రస్తుతం 18 ఎకరాలకు విస్తరించినట్లు అధికారులు తెలిపారు. స్థానికులు చెరువు పునరుద్ధరణపై హర్షం వ్యక్తం చేస్తూ ఇది పాతబస్తీ అభివృద్ధికి నూతన శకం అని అన్నారు.





### 30 ఏళ్ల మురుగు సమస్య పరిష్కారానికి హైడ్రా చర్యలు

హిమాయత్‌నగర్, ఆదర్శనగర్ బస్తీలల్లో 30ఏళ్లుగా కొనసాగుతున్న మురుగు సమస్యను మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. వర్షాకాలంలో మురుగు, వరదనీరు ఇళ్లలోకి రావడం, బోరు బావులు కలుషితం కావడంపై స్థానికులు రంగనాథ్ ఫిర్యాదు చేశారు. కొన్ని పైపులు 6 మీటర్ల మేర దెబ్బతినడంతో వాటిని మార్చితే సమస్య తగ్గుతుందని జలమండలి అధికారులు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెద్ద పైపులు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ అధికారులను ఆదేశించారు. హుస్సేన్ సాగర్ రిటైనింగ్ వాల్ 35 మీటర్లు దెబ్బతినడంతో అది కూడా పునర్ నిర్మించాలని సూచించారు.

## రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ డిపిఆర్‌ఒగా బాలేశ్వరి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా పౌర సంబంధాల శాఖ ఇన్‌చార్జ్ డిపిఆర్‌ఒగా బి.బాలేశ్వరి మంగళవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లా డిపిఆర్‌ఒగా పని చేస్తున్న పిసి వెంకటేశం పదవీ విరమణ పొందిన నేపథ్యంలో జిల్లాలో ఎపిఆర్‌ఒగా బాలేశ్వరికి ఇన్‌చార్జి డిపిఆర్‌ఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా డిపిఆర్‌ఒగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బాలేశ్వరి మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని కలిశారు. కార్యక్రమం డిపిఆర్‌ఒ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

ఎపి మహేష్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లకు కలెక్టర్ హరిచందన సూచన




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా జరగేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అభ్యర్థులను కోరారు. ఎపి మహేష్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నికలు ఈనెల 7న జరిగే సందర్భంగా కలెక్టరేట్ సమావేశమందిరంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, డిసిపి శిల్పవల్లి, డిఆర్‌ఒ ఇ.వెంకటాచారి సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో 37 వేల మందికి పైగా ఓటర్లు బ్యాలెట్ విధానంలో ఓటు వేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్‌లోని పలు నగరాల్లో కూడా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. నగరంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కమలానెహ్రూ పాలిటెక్నిక్, సరోజిని దేవి వనితా కళాశాలలో 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 10 పోలింగ్ కేంద్రాలు ఇతర రాష్ట్రాల్లో ఉన్నాయి. పోలింగ్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు డిసెంబర్ 8న ప్రారంభమవుతుందని తెలిపారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. ఓటర్లు గుర్తింపు పత్రాలతో రావాలని, సెల్‌ఫోన్‌లు, వాటర్ బాటిల్స్ వంటి అనుమతించమన్నారు.

## పోలింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమక్షంలో మంగళవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి పరిశీలించారు. జిల్లాలోని రంగారెడ్డి జిల్లాలో రెవెన్యూ డివిజన్లలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని,




ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 526 గ్రామపంచాయతీల సర్పంచ్, 4668 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతోపాటు, ఓపీఓల ర్యాండమైజేషన్ జరిపారు. అనంతరం పోలింగ్ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారులు అన్ని విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధులు పూర్తి అవగాహనతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా, రీపోలింగ్‌కు అస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, నోడల్ అధికారి శ్రీలక్ష్మి, నోడల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో తుదిదశకు సుందరీకరణ పనులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ప్రాంగణంలో చేపట్టిన సుందరీకరణ పనులు చివరి దశకు చేరాయి. ఫౌంటైన్, ల్యాండ్‌స్కేపింగ్, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాలు, పెయింటింగ్ వంటి పనులు పూర్తి కాగా, 4వ తేదీన ప్రారంభోత్సవం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి పలు మార్లు ఈ పనులు పరిశీలించారు. తుది మెరుగులు దిద్దుతూ ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు.



## 'పంచాయతీ' ఫలితాలు 17నే వెల్లడించాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** గ్రామపంచాయతీ మూడు దఫాల ఎన్నికల కౌంటింగ్ చివరిరోజు ఈ నెల 17న జరిపి, ఫలితాలు విడుదల చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. దీంతో రెండో దఫా, మూడో దఫా ఎన్నికల ఓటింగ్ సరళిపై ప్రభావం ఉండదని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షులు ఎం.పద్మనాభ రెడ్డి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐఎఎస్ ఆర్.వి.చంద్రవదన్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీలకతీతంగా జరగాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవం పేరిట వేలం, ప్రలోభాలు, భయభ్రాంతులు చేస్తూ జరిగే ఏకగ్రీవాలు ఆమోదయోగ్యం కావన్నారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి సోమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ లక్షలు పోసి పదవిని కొన్న వ్యక్తి గ్రామానికి ఏమాత్రం సేవ చేయకపోగా అవినీతికి పాల్పడటం ఖాయమన్నారు. పద్మనాభ రెడ్డి మట్లాడుతూ ఏకగ్రీవ ఫలితాలు ఒక వారం వరకు ఆపి సీనియర్ అధికారులతో విచారించిన తర్వాతనే ఫలితాలు వెల్లడించాలని కోరారు. ఒక వేళ ఏకగ్రీవం పేరిట వేలం కాని, భయభ్రాంతులకు గురిచేసిన సందర్భాల్లో ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టిజిపిఎస్‌సి సభ్యులు వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ విభాగం, సెయింట్ ఫ్రాన్సిస్ మధ్య ఎంఒయు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ వారసత్వ చరిత్ర విభాగం, హైదరాబాద్ బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. ఈ మేరకు మంగళవారం వారసత్వ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఉమా జోసెఫ్‌లు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. తెలంగాణలోని వారసత్వ ప్రదేశాల రక్షణ, సంరక్షణపై విద్యార్థుల దృష్టిని మళ్లించేందుకు ఈ ఒప్పందం దోహదపడనున్నది. కార్యక్రమంలో వారసత్వ విభాగం నుంచి డాక్టర్ పి.నాగరాజు, కళాశాల చరిత్ర విభాగం నుంచి ఎం.ఎస్.రూమన్ దేబ్ తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు యువత కృషి

ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ శంకర్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్‌లో సోనియాగాంధీ మెమోరీయల్ చెస్ టోర్నమెంట్ కరపత్రాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. జర్నలిస్టు, చెస్ మాస్టర్ వానరాసి జగన్‌ను ప్రత్యేకంగా అభినంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ యువత విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. చదరంగం పోటీలతో మనిషిలో మెదస్సు పెరగడమే కాకుండా ఆలోచన శక్తి పెరుగుతుందని వివరించారు. చెస్ మాస్టర్ వానరాని జగన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో సోనియా గాంధీ జన్మదినం పురస్కరించుకొని చెస్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు రాఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, జర్నలిస్టు ఖాజాపాషా (కెపి), జర్నలిస్టులు పాల్గొన్నారు.






### పేదల కష్టాలు తీర్చేందుకు కృషి

**షాద్‌నగర్:** పేదల కష్టాలను తీర్చేందుకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందనే విషయాన్ని గుర్తించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మార్కెట్ డైరెక్టర్ మల్లేష్, మాజీ ఉప సర్పంచ్ సీతారాములు, కాంగ్రెస్ సీనియర్ నేత మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## 'అఖండ–2' అంచనాలకు మించి ఉంటుంది

నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట



బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'అఖండ–2' ఈ చిత్రం 5వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిర్మతలు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. లెజెండ్ సినిమా మేమే చేసాము. 2014 ఎలక్షన్స్‌కి ముందు ఆ సినిమా వచ్చి పెద్ద విజయాన్ని సాధించింది. అదే కాంబినేషన్లో మళ్లీ ఈ ఎలక్షన్స్‌కి ముందు ఒక సినిమా చేయాలనుకున్నాం. మేము అనుకున్న కథ సరిగ్గా ఎలక్షన్స్ ముందే రావాలి. అప్పుడే ఆ క్యారెక్టర్, కథ కనెక్ట్ అవుతుంది. సరిగ్గా ఎలక్షన్ డేట్ అనేది ఒక క్లారిటీ లేకపోవడంతో ఆ కథని పక్కనపెట్టి అఖండ2 కథని ముందుకు తీసుకెళ్లాం.చాలా హ్యాపీ గా ఉందండి. బాలయ్య బాబు, బోయపాటి గారిది బ్లాక్ బస్టర్ కాంబినేషన్. వరసగా హ్యాట్రిక్ విజయాల తర్వాత మళ్లీ వస్తున్న సినిమా ఇది. ఈ కథ చాలా బిగ్ స్పాన్ ఉన్నది. బాలయ్యలో అప్పటికి ఇప్పటికీ అదే ఎనర్జీ. ఇంకా పెరిగింది. ఆయనతో కూర్చున్నప్పుడు ఆయన ఎనర్జీ మనకి వస్తుంది ఈ సినిమాని కుంభమేళాలో షూట్ చేసాం. అక్కడ షూట్ చేయాలంటే చాలా పర్మిషన్స్ కావాలి. మాకు అన్ని పర్మిషన్లు దొరికాయి. డ్రోన్ పర్మిషన్ కూడా దొరికింది. ఇప్పుడు మీరు సినిమాలో చూడబోయే ప్రతి సన్నివేశం ఈ సినిమా కోసం తీసిందే. స్టాక్ షాట్స్‌ని ఉపయోగించలేదు. బోయపాటి గారు అహర్నిశలు కష్టపడి కుంభమేళా సన్నివేశాలని చాలా అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ సినిమా కథ వినగానే త్రీడీలో బాగుంటుందనుకున్నాం. రేపు త్రీడీ సెన్సార్ ఉంటుంది. 2డి, 3డి రెండూ ఒకే సారి రిలీజ్ వుంటుంది.

## ఇండియన్, కొరియన్ కొలబ్రేషన్‌తో సినిమాలు



ఇండియన్ కొరియన్ కొలబ్రేషన్‌లో సినిమాలు రావాలని కొరియన్ డైరెక్టర్, ప్రొడ్యూసర్స్ యూ ఇన్‌షిక్ అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇండియాకి రావడం ఇదే మొదటిసారి. హైదరాబాద్ బిర్యానీ సూపర్‌గా ఉంది. నాకు చాలా నచ్చింది. ఇక్కడ కొంత మంది ప్రేక్షకులుని కలిసాను. వాళ్ళు నేను చేసిన సినిమాలు, డ్రామాలు అన్ని చూశారు. ప్రతిదాని గురించి చాలా డీటెయిల్‌గా మాట్లాడుతున్నారు. ఇది నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో తప్పకుండా ఇండియన్, తెలుగు ఆడియన్స్ కోసం సినిమాలు నిర్మించాలని భావిస్తున్నాను. కొరియా కాన్సుల్ జనరల్ సురేష్ చుక్కపల్లి మాట్లాడుతూ.. కల్చరల్‌గా ఇండియా కొరియా మధ్య చాలా సారూప్యత ఉంటుంది. వాళ్ళందరూ మనలాగే చాలా ఫ్యామిలీ ఓరియెంటెడ్‌గా ఉంటారు. పెద్దలకి, కల్చర్‌కి, మూలాలకి గౌరవిస్తారు. అయోధ్యలో కొరియా ప్రిన్సెస్ పేరుతో మెమోరియల్ ఉంది. ప్రతి ఏడాది 50వేల మంది కోరియన్స్ అయోధ్యని సందర్శిస్తారు. వాళ్ళ పూర్వికులు ఇక్కడ నివసించారనేది వారి నమ్మకం. ఇండియాకి లార్జెస్ట్ వ్యువర్స్ షిఫ్ ఉంది. కొరియన్ వెబ్ సిరీస్ సినిమాలు తెలుగు హిందీలో అనువాదం అవుతున్నాయి.

## నచ్చకపోతే ప్రెస్ మీట్ పెట్టి సారి చెబుతా

'సైక్ సిద్ధార్థ' హీరో శ్రీనందు



శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్దార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్‌తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా మరో కీలమైన పాత్ర పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. మంగళవారం ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీ నందు మాట్లాడుతూ చాలా ఎమోషనల్‌గా ఉంది. ఇదంతా ఒక టీం జర్నీ. డైరెక్టర్ వరుణ్ ఆర్కిటెక్చర్ ఆ ఫీల్‌లో గోల్ మెడల్స్ వచ్చాయి. తనకి ఫిలిం మేకింగ్ అంటే ప్యాషన్. అన్నపూర్ణ స్టూడెంట్. రామ నాయుడులో డెబ్యు చేస్తున్నాడు. నాకు రైటింగ్, డైరెక్షన్ మీద మొదటి నుంచే ఆసక్తి ఉంది. కొన్ని మ్యూజిక్ వీడియోస్‌కి డైరెక్షన్ చేశా. బ్రోచేవారు బ్యానర్లో నాకు డైరెక్టర్‌గా ఒక సినిమా ఓకే అయింది. అప్పుడే ఒక రైటర్ కావాలంటే వరుణ్ పరిచయమయ్యాడు. కానీ కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్టు ఆగిపోయింది. ఆ జర్నీలో మా ఇద్దరి మధ్య ఒక నమ్మకం వచ్చింది. నిజానికి ఈ సినిమా ఒక డెమో లాగా షూట్ చేశాడు. దాన్ని ఒక ఓటీటీ సంస్థ నుంచి ఆఫర్ కూడా వచ్చింది. అయితే ఇది మంచి స్కేల్లో ఇంకా చాలామందికి రీచ్ కావాల్సిన కథ అని చెప్పను. ఆ తర్వాత మేమే ఈ సినిమాని చేయాలనుకుని నిర్ణయించుకున్నాం. వరుణ్ నా నమ్మకాలు నిలబెట్టుకున్నాడు.

## ప్రతీ మీమ్ సేవ్ చేసుకున్నా

- సంయుక్త మీనన్



బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'అఖండ–2'. ఈ సినిమా డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సంయుక్త మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. విరూపాక్ష తర్వాత చాలా సినిమాలు వచ్చా.యి నేను మాత్రం సెలెక్టెడ్‌గా చేస్తున్నాను. బింబిసారా, విరూపాక్ష, సార్, భీమ్లా నాయక్ ఒకే సారి సైన్ చేశాను. అయితే రిలీజ్ టైమ్స్ డిఫరెంట్‌గా అయ్యాయి. తర్వాత స్వయంభు, నారీ నారీ, ఆ తర్వాత 'అఖండ–2' సైన్ చేశాను. ఆ తర్వాత పూరి సినిమా చేశాను. ప్రతి కథలో కంటెంట్ నచ్చి చేస్తున్నాను. ఇలాంటి కథ ప్రేక్షకులు ఇష్టపడతారు, వారికి నచ్చుతుంది అని ఉద్దేశంతోనే చేస్తాము. అది ఫైనల్‌గా ఆడియన్స్‌కి నచ్చితే వెరీ హ్యాపీ. డైరెక్టర్ ఈ కథ గురించి చెప్పారు. ముందు డేట్స్ ఉన్నాయో లేదో మా టీంని అడిగాను. లేవని చెప్పారు. ఎలాగైనా ఈ సినిమా చేయాలని చెప్పాను. అప్పుడు వాళ్ళు డేట్స్ అడ్జస్ట్ చేశారు.ఈ సినిమాలో నా క్యారెక్టర్ స్టయిలీష్‌గా వుంటుంది. సినిమాలో సాంగ్ చేయాలని చెప్పారు. నాకు నిజంగా ఆ పాట విన్న తర్వాత చాలా నెర్వస్‌గా అనిపించింది. అంత మాస్ సాంగ్ నేనెప్పుడూ చేయలేదు. తప్పకుండా సాంగ్‌ని అద్భుతంగా చేయాలని నిర్ణయించుకున్నాను. రెండు రోజులు ప్రాక్టీస్ తర్వాత నా మోకాలు సహకరించలేదు. తర్వాత ఫిజియోథెరపీ తీసుకున్నాను. బాలయ్య చాలా ఫ్రెండ్లీ పర్సన్. ఆయన్ని తొలిసారి ఒక యాడ్ షూట్‌లో కలిసాను. అప్పుడే నేను ఎంతో పరిచయం ఉన్న మనిషి లాగా మాట్లాడారు. ఆయన డైరెక్టర్ ఏది చెప్తే అది చేస్తారు. ఆయనలో ఆ క్వాలిటీ నాకు చాలా నచ్చింది. ఆయనతో పని చేయడం చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది. దానికి సంబంధించిన ప్రతి మీమ్ సేవ్ చేసుకున్నాను. ఆయనకు చూపించినప్పుడు చాలా సరదాగా నవ్వుకున్నాం. మీమ్స్ మనం క్రియేట్ చేయలేం. అవి ఆర్గానిక్‌గా క్రియేట్ అవ్వాలి. డాకు మహారాజ్ కేరళలో కూడా అద్భుతంగా ఆడింది. అలాగే అఖండ సినిమా కూడా చూశాను. తెలుగు ప్రేక్షకులు నెక్స్ట్ లెవెల్. వాళ్ళు సినిమాని సెలబ్రేట్ చేసుకునే విధానం అద్భుతం. వాళ్ళు ఫస్ట్ డేని సెలబ్రేట్ చేసుకునే విధానం చూస్తే మనం సక్సెస్‌కి ఆడిట్ అయిపోతాం. స్వయంభులో యాక్షన్ క్యారెక్టర్ చేస్తున్నాను. శర్వా నారి నారి నడుమ మురారిలో చాలా మంచి క్యారెక్టర్. అలాగే పూరితో వర్క్ చేయడం మరచిపోలేని అనుభం.

## రాజు వెడ్స్ రాంబాయి దర్శకుడికి దిల్ రాజు సన్మానం



యధార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కించిన రాజు వెడ్స్ రాంబాయి సినిమా ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో చిత్ర దర్శకుడు సాయిలు కంపాటి ఇండస్ట్రీ అంత ప్రశంశలతో మోచేత్తున్నారు. తెలంగాణ ఎఫ్‌డీసి చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు దర్శకుడు సాయిలును అభినందించారు. దిల్ రాజు కార్యాలయంలో సాయిలును ఘనంగా సన్మానించారు. దిల్ రాజు తో పాటు ఆయన సోదరుడు శిరీష్ కూడా

## మోగ్లీ ట్రైలర్ రిలీజ్



యాంకర్ సుమ తన కొడుకు ప్రమోషన్ కోసం తనకున్న అన్ని పరిచయాలను ఉపయోగించుకుంటున్నారు. ఎలాగైనా తన నట వారసున్ని ఫిలిం ఇండస్ట్రీలో నిలబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బబ్లుగం సినిమాతో హీరోగా పరిచయం అయిన సుమ కొడుకు రోషన్ కనకాల ఇప్పుడు రెండో సినిమా మోగ్లీ 2025 అనే సినిమాతో జనం ముందుకు వస్తున్నారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్ పెంచేశారు. పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ రష్మిక మందాన చేతుల మీదుగా ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరించారు. కలర్ ఫోటో సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న సందీప్ రాజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 12న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు.

## 'రాజా సాబ్'లో బొమ్మన్ ఇరానీ పోస్టర్ రిలీజ్



రెబల్ స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్ లో పీపుల్ మీడియా నిర్మిస్తున్న చిత్రం 'రాజా సాబ్'. ఈ సినిమాలో ఒక ఇంపార్టెంట్ క్యారెక్టర్‌లో వెర్సటైల్ యాక్టర్ బొమన్ ఇరానీ నటిస్తున్నారు. మంగళవారం బొమన్ ఇరానీ బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మూవీ టీమ్ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేసింది. 'రాజా సాబ్' సినిమాలో సైకియాట్రిస్ట్, హిప్నాటిస్ట్, పారానార్మల్ ఇన్వెస్టిగేటర్‌గా బొమ్మన్ ఇరానీ క్యారెక్టర్ ప్రేక్షకులను థ్రిల్ చేయనుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 9న 'రాజా సాబ్' సినిమా వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్' ను తెరకెక్కిస్తున్నారు.





## ప్రపంచపటంలో రాష్ట్రం


(మొదటి పేజీ తరువాయి)

నడిపించి అభివృద్ధిలో అగ్ర స్థానంలో నిలిపిన మన్మోహన్ సింగ్ చిరస్మరణీయులన్నారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటి పారుదల సౌకర్యాల కల్పనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించారని, ఆయన పరిపాలనా కాలంలోనే నాగార్జున సాగర్, ఎస్ఆర్ఎస్‌పి, బాక్రానంగల్, శ్రీశైలం లాంటి ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయన్నారు. తెలంగాణ ప్రజాప్రభుత్వం ఉన్నత లక్ష్యాలతో రాష్ట్రాన్ని ప్రపంచంతో పోటీ పడే విధంగా ముందుకు తీసుకెళుతుందన్నారు. యంగ్ ఇండియా స్కూల్స్ నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. గత 10 సంవత్సరాల పాటు తెలంగాణలోని ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆయన ఆరోపించారు. త్వరితగతిన ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, రాష్ట్రంలోనే కృష్ణ, గోదావరి నదులతో సాగు, తాగు నీరు అందించే అవకాశం ఉమ్మడి ఖమ్మం జిల్లాకే దక్కిందని ఆయన తెలిపారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ చీరలు, మహిళకు ఉచిత బస్ ప్రాయాణం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి తదితర సంక్షేమ పథకాలతో ప్రజల ముందుకు వస్తున్నామని, 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఈనెల 8, 9 తేదీల్లో ఆవిష్కరించనున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజాప్రభుత్వానికి ఖమ్మం జిల్లా ఆయువు పట్టుగా ఉందని, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖా మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర రావులు ఈ ప్రభత్వానికి ఆయువు పట్టుగా ఉన్నారని, ఏ కార్యక్రమాన్నైనా చేయగలిగే అవకాశం వారి చేతుల్లోనే ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందని, ఇక్కడి ప్రజలు ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వాన్ని నడిపించే అవకాశం కాంగ్రెస్‌కు ఇచ్చారని చెప్పారు. ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకునేందుకు అన్నివిధాలుగా కృషి చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రానున పంచాయితీ ఎన్నికల్లో అభివృద్ధి చేసేవారినే ఎన్నుకోవాలని, అభివృద్ధి నిరోదకులకు, మందుకు, డబ్బులకు లొంగకుండా అభివృద్ధి కాముకులకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

ఈ సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావులు ప్రసంగించగా ఇంచార్జ్ మంత్రి వాకాటి శ్రీహరి, ఎంపిలు రామసహాయం రఘురామిరెడ్డి, పోరిక బలరామ్ నాయక్, ఎంఎల్‌ఏలు కోరం కనకయ్య, డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, రామ్‌దాస్ నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణతో పాటు వివిధ కార్పోరేషన్ల చైర్మన్‌లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం, పొదెం వీరయ్య, మువ్వా విజయ్‌బాబు, పసుపులేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెంలో వర్సిటీ ఏర్పాటు అభినందనీయం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాయ సహకారాలతో కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి పథంలో సాగుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులను తీసుకొచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాశన సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. బుధవారం డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మక భూవిజ్ఞాన విశ్వవిద్యాలయం (ఎర్త్ యూనివర్సిటి)ని ఏర్పాటు చేయడం, దానికి భారత మాజీ ప్రధాని డా. మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం అభినందనీమని చెప్పారు. దీంతో భద్రాద్రి జిల్లా ఖ్యాతి దేశ విదేశాలకు చేరుకుందని, ప్రపంచ దేశాల నుండి చదువుకునేందుకు ఇక్కడికి తరలివస్తారని చెప్పారు. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఇది చక్కటి ప్రాంతమని, ఈ ప్రాంత భూముల్లో విలువైన ఖనిజ సంపద నిక్షిప్తమై ఉండటంతో భూ విజ్ఞాన పరిశోధనలు చేసేందుకు చక్కటి అవకాశాలు ఉన్నాయన్నారు. యూనివర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం విద్యా పరంగా ప్రపంచ పటంలో నిలవబోతోందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ యూనివర్సిటీని విద్యార్థులు ఉపయోగించుకుని దేశానికి సేవ చేయాలన్నారు. అదే విధంగా 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని పాల్వంచలో నెలకొల్పేందుకు ప్రభుత్వం సుముకంగా ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు పనులు త్వరిత గతిన పూర్తి చేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాని, విమానాశ్రయం ఏర్పాటుకు మరింత చొరవతీసుకుని ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతంలోన మరికొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు సహకరించాలని, ప్రతీ సమస్యపై సమగ్ర సమాచారంతో నివేదికలు తయారు చేసి త్వరలో ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

## కాంగ్రెస్‌లో పెరిగిన హిందూ వ్యతిరేక ధోరణి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎంఐఎం సహవాసంతో కాంగ్రెస్‌లో యాంటీ హిందూ ధోరణి పెరిగిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. బిఆర్ఎస్ గతంలో చూపిన ధోరణినే ఇప్పుడు కాంగ్రెస్ అనుసరిస్తోందని విమర్శించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నల్గొండ జిల్లా బిజెపి అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మంజుల, బండారు రవీందర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నగేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు బిజెపిలో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి రాంచందర్ రావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సుపరిపాలన, అభివృద్ధి పట్ల ఆకర్షితులై పెద్ద ఎత్తున చేరికలు జరిగాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై అవహేళన వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు హిందూ మనోభావాలను దెబ్బతీస్తాయన్నారు. హిందూ దేవతలను అవమానించే వ్యాఖ్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ వైఖరికి కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సిఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిజెపి శ్రేణులకు రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

## పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకెళ్లారని పవన్‌ను ఉద్దేశించి ఆయన విమర్శించారు. హైదరాబాద్ కి వచ్చిన పైసలతో విజయవాడ, వైజాగ్ మిగితా ప్రాంతాలను డెవలప్ చేసుకున్నారన్నారు. పవన్ కళ్యాణ్ కొత్తగా రాజకీయాల్లోకి వచ్చారని, మంచి చేయాలని ఉదేశం తో వచ్చి ఉంటారు.. కానీ ఇలాంటి వ్యాఖ్యలు సరికాదన్నారు. పవన్ సోదరుడు చిరంజీవి మంచి వ్యక్తి...ఇలాంటి వివాదాస్పద వ్యాఖ్యలు ఎప్పుడు చేయలేదని గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్తే నైజాంలో రెండు రోజులైనా సినిమాలు ఆడుతాయని లేనిపక్షంలో సినిమాలు మూసుకోవాల్సిదేనన్నారు. ఇప్పటికి 13ఏళ్లు అయింది తెలంగాణ వచ్చి ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు అవసరమా అని ప్రశ్నించారు. పవన్ వ్యాఖ్యలపై మా తెలంగాణ బిడ్డలు బాధపడుతున్నారు. గత సిఎం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి వెళ్ళిపోయారు. ఆ అప్పులు కడుతూ ఇప్పుడు ఇప్పుడే రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నాము. ఇలాంటి సమయంలో తెలంగాణ సమాజాన్ని తక్కువ చేసి మాట్లాడడం కరెక్ట్ దని హితవు పలికారు.

## రెండు దశల్లో జనగణన

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలో జరుగుతుంది. అయితే లద్దాఖ్, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పపడే నాన్ సింక్రోనస్ ప్రాంతాల్లో జన గణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది' అని నిత్యానంద్‌రాయ్ లోక్‌సభకు తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్లు మంత్రి నిత్యానంద్‌రాయ్ చెప్పారు. మన దేశంలో జన గణనకు 150ఏళ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాలను తదుపరి జన గణన కోసం పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు. మరో ప్రశ్నకు సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా, కులగణన కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని నిత్యానంద్‌రాయ్ లోక్‌సభకు తెలిపారు.

### డిజిటల్ విధానంలో జనగణన

మరో ప్రశ్నకు జవాబిస్తూ, 2027 జనాభా లెక్కింపు డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ డిజిటల్ విధానంతో జనాభా లెక్కించేందుకు అధికారులతోపాటు ప్రజలకూ అవకాశం ఇవ్వనున్నారు. ఇంతకు మునుపే రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం పౌరులను అడగడానికి దాదాపు 30కిపైగా ప్రశ్నలను సిద్ధం చేసింది. ఈ సర్వేలో ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, స్కూటర్, బైక్, కారు, జీప్, వ్యాన్), గృహోపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వస్తువుల యాజమాన్యం గురించి ప్రజలను అడుగుతారు. తృణధాన్యాల వినియోగం, తాగునీటి వనరులు, లైటింగ్, మరుగుదొడ్ల వాడకం, స్నానం, వంటగది సౌకర్యాలు, వంట కోసం ఉపయోగించే ఇంధనం, ఎల్‌పిజి/సిఎన్‌జి కనెక్షన్ గురించి కూడా అడుగుతారు. ఇంటి ఫ్లోరింగ్, గోడలు, పైకప్పు కోసం ఉపయోగించిన మెటీరియల్, నివాసితుల సంఖ్య, ఇంటి గదుల సంఖ్య, ఇంటి యజమాని గురించి ప్రశ్నలు ఉంటాయి.

## యాప్‌పై తీవ్ర దుమారం

(మొదటి పేజీ తరువాయి)

అని, డివైస్‌లో యాప్ ఉంచుకోవాలా వద్దా అనేది వినియోగదారుని ఇష్టమని తెలిపారు. దేశంలో ఇక నుంచి విక్రయించే ప్రతి సెల్‌ఫోన్‌లో తప్పనిసరిగా 'సంచార్ సాథీ' యాప్ ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలని ఫోన్ దిగుమతిదార్లు, తయారీదార్లను టెలికాం శాఖ ఆదేశించింది. 90 రోజుల్లోపు ఈ నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇప్పటికే విక్రయించిన ఫోన్లలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలని పేర్కొంది. ఈ దిశగా తీసుకున్న చర్యలకు సంబంధించిన కంప్లయెన్స్ నివేదికను 120 రోజుల్లోగా సమర్పించాలని తెలిపింది. ఈ యాప్ ఫోన్ యూజర్లకు స్పష్టంగా కనిపించేలా ఇన్‌స్టాల్ చేయాలని, మొదటిసారి డివైజ్ సెటప్ సమయంలోనే ఇది యూజర్లకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం యాపిల్, సామ్‌సంగ్, గూగుల్, వివో, ఒప్పో, షియోమీ వంటి ప్రధాన కంపెనీలు ఇండియాలో హ్యాండ్‌సెట్లు తయారు చేస్తున్నారు. వీటికి తా జా ఆదేశాలు వర్తిస్తాయి. 'సంచార్ సాథీ' అంశంపై పార్లమెంటులో మంగళవారం తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఈ చర్య ప్రజల ప్రైవసీ ఉల్లంఘనేనంటూ కాంగ్రెస్, శివసేన, యుటిబి, టిఎంసి తప్పుపట్టాయి. విస్తృత చర్చ జరగాలని పార్టీలు డిమాండ్ చేశాయి. కాగా, దీనిపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికామ్ (డిఓటి) స్పందించింది. ఈ యాప్ కేవలం సైబర్ సెక్యూరిటీకి ఉద్దేశించినది మాత్రమేనని, ఇందులో ప్రైవసీ ఉల్లంఘన లేదని, యూజర్ డాటాను రక్షిస్తుందని తెలిపింది.

## మరోవైపు యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం జరిపారు. తర్వాత ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, యుద్ధాన్ని ఎలా ముగించాలనే విషయంపై మేక్రాన్‌తో చర్చించామన్నారు. యుద్ధం వీలైనంత త్వరగా ముగిసిపోవాలన్నారు. సెక్యూరిటీ గ్యారంటీలు సాధించడంపైనే తాము ప్రధానంగా దృష్టి సారించామని చెప్పారు. ఒకవైపు మాస్కోలో చర్చలు, మరోవైపు యుద్ధం జరగుతున్న సమయంలో జెలెన్‌స్కీ మంగళవారం ఐర్లాండ్‌లో పర్యటించారు. ఐర్లాండ్ ప్రధానమంత్రి మైఖేల్ మార్టిన్ ఆయనకు స్వాగతం చెబుతూ, అత్యంత సంక్లిష్టమైన సమయంలో ఈ పర్యటన జరుగుతోందన్నారు. ఉక్రేన్‌కు 100 మిలియన్ డాలర్ల ఆర్థిక సహాయం అందజేసేందుకు ఐర్లాండ్ మంత్రివర్గం మరోవైపు సమావేశం నిర్వహించింది. చర్చలు జరుగుతున్న సమయంలో ఉక్రేన్‌ను బలహీన పరచేందుకు పుతిన్ దుష్ప్రచారానికి తెరతీశారని జెలెన్‌స్కీ డబ్లిన్‌లో విమర్శించారు. విట్‌కాఫ్ మాస్కో ప్రయాణానికి ముందుగా ఆదివారం ఆయన ఫ్లోరిడాలో ఉక్రేన్ అధికార ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రష్యాకు ఉక్రేన్ భూభాగాలను వదిలేసుకోవడం, ఉక్రేన్‌కు భద్రతా హామీలు వంటి అనేక అంశాలపై వారితో విట్‌కాఫ్ చర్చించారు. ట్రంప్ అల్లుడు కుష్నేర్, అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో కూడా పాల్గొన్నారు. ఉక్రేన్ తరపున ఆ దేశ జాతీయ భద్రతా కార్యదర్శి రస్టెమ్ ఉమెరోవ్, విదేశాంగశాఖ మొదటి ఉపమంత్రి సెర్గీ కిస్లిస్టా పాల్గొన్నారు.

### యుద్ధ పరిష్కారానికి ట్రంప్ ప్రతిపాదన మూలాధారం

ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి ట్రంప్ ప్రతిపాదించిన 28 సూత్రాల ప్రణాళిక (తర్వాత 19కి కుదించారు) ఒక మంచి మూలాధారంగా ఉంటుందని రష్యా కేంద్రకార్యాలయం అధికార ప్రతినిధి పెస్కోవ్ చెప్పారు. భారత్‌లో పుతిన్ పర్యటనకు ముందుగా ఆయన న్యూఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీలో పెస్కోవ్ మంగళవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, యూరోపియన్లు విదేశాలలో ఉన్న రష్యా ధనాన్ని ఆస్తులను దొంగిలించి తిరిగి దానినే ఉక్రేన్‌లో యుద్ధ యంత్రాంగానికి పెట్టుబడిగా సమకూరుస్తున్నారని విమర్శించారు. భారత్–రష్యా సంబంధాల గురించి మాట్లాడుతూ, భారత్ ఆందోళన తమకు తెలుసునని, అందుకే వాణిజ్యలోటు భర్తీ చేసేందుకు దిగుమతులను గణనీయంగా పెంచుకుంటామన్నారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరాటం చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com